ISSN 2581-3978

మార్చి 2024 సంపుటి 9, సంచిక 12, పేజీలు: 60, రూ. 20

# తెలంగాణ

మాస పత్రిక

## 200 యూనిట్ల ఉచిత విద్యుత్..
## రూ. 500కే గ్యాస్ సిలిండర్





తొలిపద్దు

# తెలంగాణ

మాసపత్రిక

సంపుటి: 9 సంచిక: 12 మార్చి, 2024

**కమీషనర్ & పబ్లిషర్**

**ఎం. హనుమంతరావు, ఐఎఎస్**

**చీఫ్ ఎడిటర్**

**కె. సుబ్రహ్మణ్య శాస్త్రి**

**ఎగ్జిక్యూటివ్ ఎడిటర్**

**కోడూరు శ్రీనివాస్ రావు**

**అసోసియేట్ ఎడిటర్స్**

**కప్పర రాంప్రసాద్‌రావు**

**ముత్తోజు సత్యనారాయణ**

**కాజీపేట కిరణ్‌కుమార్**

**సామిడి జగన్‌రెడ్డి**

**ముఖచిత్రం**

ఇల్లాలి ఇంటికి సర్కారు కాంతులు

**రెండవ కవర్**

తొలిపద్దు

**మూడవ కవర్**

మేడిగడ్డ పగుళ్లను పరిశీలిస్తున్న సిఎం, అఖిలపక్ష బృందం

**నాల్గవ కవర్**

తెలంగాణ కుంభమేళ

**విడి ప్రతి: రూ.20**

**సంవత్సర చందా : రూ.220**

ప్రచురణ

**సమాచార, పౌర సంబంధాల శాఖ**

**సమాచార భవన్, ఎ.సి.గార్డ్స్**

**హైదరాబాద్ - 500 028.**

ముద్రణ

**కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్**

**విద్యానగర్, హైదరాబాద్ - 500 044.**

రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు తప్పనిసరిగా ప్రభుత్వానికి చెందినవి కానక్కరలేదు.

e-magazine:http//ipr.tg.nic.in

email: telanganamasapatrika@gmail.com

ISSN 2581-3978

https://magazine.telangana.gov.in


## సంపాదకీయం

# 'గ్యారంటీ'లకు బడ్జెట్ గ్యారంటీ

**తెలంగాణ** రాష్ట్ర మూడవ శాసన సభలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తన తొలి ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ను ప్రవేశపెట్టింది. ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖా మంత్రి భట్టి విక్రమార్క మల్లు శాసన సభలో బడ్జెట్ ప్రవేశపెట్టగా, పరిశ్రమలు, ఐ.టి శాఖల మంత్రి దుదిళ్ళ శ్రీధర్ బాబు శాసన మండలిలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1న ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశ పెట్టడంతో నికరంగా రాష్ట్రానికి కేంద్రం నుంచి ఎన్ని నిధులు సమకూరుతాయో స్పష్టత రాలేదు. కేంద్రం పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టినప్పుడే మన రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్ నుంచి ఏ మేరకు నిధులు వచ్చేది స్పష్టత వస్తుంది. అందువల్లే రాష్ట్ర ప్రభుత్వం కూడా ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టింది.

2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ లో మొత్తం వ్యయం 2,75,891 కోట్ల రూపాయలుగా, రెవెన్యూ వ్యయం 2,01,178 కోట్ల రూపాయలు, మూలధన వ్యయం 29,669 కోట్ల రూపాయలుగా ప్రతిపాదించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలలో రెండు గ్యారంటీలను- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందించే మహాలక్ష్మి పథకం, ఆరోగ్యశ్రీ పరిమితిని 5 లక్షల రూపాయల నుంచి 10 లక్షల రూపాయలకు పెంచడం - అధికారం చేపట్టిన 48 గంటలలోనే అమలుపరిచింది. మరో రెండు గ్యారంటీలు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అందించే గృహలక్ష్మి, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ సరఫరా అమలుకు కూడా శ్రీకారం చుట్టింది. మిగిలిన గ్యారంటీలకు కూడా మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ఈ గ్యారంటీలన్నింటినీ అమలుపరిచే దిశగా ప్రభుత్వం ఇప్పటికే, లబ్ధిదారులనుంచి ప్రజాపాలన కార్యక్రమం ద్వారా గ్రామ సభలు నిర్వహించి దరఖాస్తులు కూడా స్వీకరించింది. లబ్ధిదారుల నుండి పెద్దమొత్తంలో ఒక కోటి 29 లక్షల దరఖాస్తులు ప్రభుత్వానికి వచ్చాయి. ప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రకారం అభయహస్తం కింద ఆరు గ్యారంటీలను అమలుపరిచేవిధంగా ఈ బడ్జెట్ కేటాయింపుల్లో ఈ గ్యారంటీలకు పెద్దపీట వేసింది. ఈ గ్యారంటీల అమలుకు బడ్జెట్‌లో 53,196 కోట్ల రూపాయలను కేటాయించి తన చిత్తశుద్ధిని చాటుకుంది.

పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 40,080 కోట్ల రూపాయలు కేటాయించడం ద్వారా గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత చెప్పకనే చెప్పినట్లయింది. ఎన్నికల ప్రణాళికలో చెప్పిన ప్రతి హామీని నెరవేర్చేందుకు కృతనిశ్చయంతో ఉన్నామని, రైతులకోసం ప్రకటించిన వరంగల్ డిక్లరేషన్, హైదరాబాద్‌లో ప్రకటించిన యువ డిక్లరేషన్, చేవెళ్ళలో ప్రకటించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్, కామారెడ్డిలో ప్రకటించిన బీసీ, మైనారిటీ డిక్లరేషన్ అన్నింటినీ ఖచ్చితంగా అమలుచేస్తామని ఆర్థిక మంత్రి మల్లు హామీ ఇవ్వడం అభినందనీయం.

ఇదే శుభ సందర్భంలో తెలంగాణ ముద్దుబిడ్డ, దివంగత మాజీ ప్రధాని పి.వి. నరసింహారావుకు దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న లభించడం మన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చెప్పినట్టు మనందరి గుండెల్లో ఆనందం ఉప్పొంగే మధుర క్షణం ఇది.


కె. సుబ్రహ్మణ్య శాస్త్రి

# మెగా డీఎస్సీ విడుదల

రాష్ట్రంలో 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఫిబ్రవరి 20న నోటిఫికేషన్ జారీ చేసింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఈ మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. స్కూల్ అసిస్టెంట్‌లు, సెకండరీగ్రేడ్ టీచర్లు, భాషా పండితులు, పీఇటీలు, సోషల్ ఎడ్యుకేషన్ టీచర్లు, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు తదితర పోస్టులను ఈ మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేస్తారు. ఈ కార్యక్రమంలో రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బి. వెంకటేశం, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# విషయ సూచిక




9


ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగానికి పచ్చజెండా





18

'పద్మ' అవార్డు గ్రహీతలకు ఘన సన్మానం


26

జాతిరత్నం





54

జనగీతానికి నీరాజనం

200 యూనిట్ల ఉచిత విద్యుత్
రూ. 500కే గ్యాస్ సిలిండర్........6

యాదాద్రి పవర్ ప్రాజెక్టు పనులు
త్వరగా పూర్తి చేయాలి........8

ధరణి దరఖాస్తులకు మోక్షం........10

ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షునిగా చిన్నారెడ్డి ........11

ప్రజల కోసం ప్రజల ద్వారా ప్రజాపాలన ........12

కేసీఆర్ సొంత నిర్ణయాలతో రాష్ట్రాన్ని ముంచారు........20

అమ్మల దర్శనానికి పోటెత్తిన భక్త జనం........22

మేడారం అభివృద్ధికి మంత్రుల కమిటి........24

రెండు లక్షల ఖాళీలు భర్తీచేసి తీరుతాం ........28

కులగణనకు ఏకగ్రీవ తీర్మానం........29

ప్రగతిపథర ........30

సేవాలాల్ మార్గంలో నడవాలి ........31

బడ్జెట్........32

సింగరేణి కార్మికులకు కోటి బీమా ........45

ఆడ బిడ్డలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం........46

అంబేద్కర్ విగ్రహం సాక్షిగా కారుణ్య నియామకాలు ........47

ఆదిలాబాద్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తాం... ........48

తాగునీటి కొరత రానీయద్దు : సిఎం........50

కరెంట్ కట్ చేస్తే.. సస్పెండ్ చేస్తాం!........51

ప్రాజెక్టులు అప్పగించేది లేదు........52

విజన్ 2050 ........53

మహా పవిత్రరాత్రి ........56

'పాపాలను మూటగట్టుకున్నది వారే'........58



## మీడియా అకాడమీ ఛైర్మన్‌గా శ్రీనివాస రెడ్డి

**తెలంగాణ** మీడియా అకాడమీ ఛైర్మన్‌గా సీనియర్ సంపాదకుడు, ఐ.జె.యు జాతీయ అధ్యక్షుడు కె.శ్రీనివాస రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. శ్రీనివాస రెడ్డి ఈ పదవిలో రెండేళ్ళపాటు కొనసాగనున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రెస్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షునిగా కూడా శ్రీనివాస రెడ్డి పనిచేశారు. మీడియా అకాడమీ ఛైర్మన్‌గా నియమితులైన సందర్భంగా శ్రీనివాస రెడ్డికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.



## సచివాలయం చెంతన రాజీవ్ విగ్రహం

**దివంగత** మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ, దేశ సమగ్రతను కాపాడటం కొరకు ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్న మార్గదర్శకుడు. రాజీవ్ విగ్రహాన్ని సచివాలయం ఎదురుగా ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. విగ్రహ నిర్మాణం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు.

## ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్‌గా సిరిసిల్ల రాజయ్య



రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్‌గా సిరిసిల్ల రాజయ్యను ప్రభుత్వ సిఫారసు మేరకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ నియమించారు. సభ్యులుగా సంకేపల్లి సుధీర్‌రెడ్డి, రమేష్ ముదిరాజ్, నెహ్రూనాయక్‌లను నియమించారు.




రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ ప్రచురిస్తున్న 'తెలంగాణ' మాసపత్రికను పోస్టల్ ద్వారా తమ చిరునామాకు పొందగోరువారు **వార్షిక చందా రూ.220** చెల్లించి పొందవచ్చు.

'తెలంగాణ' మాసపత్రిక తెలుగు, ఉర్దు భాషలలో వెలువడుతున్నందున పాఠకులు తమకు ఏ భాషా పత్రిక (తెలుగు/ఉర్దూ) కావాలో స్పష్టంగా తెలియజేయాలి. చందాదారులు తమ చిరునామాను స్పష్టంగా ఇంటి పూర్తి అడ్రస్, పిన్‌కోడ్ నెంబర్‌తో సహా తెలియచేయవలెను. డి.డి. రూపంలో ఈ క్రింది చిరునామాకు పంపించవలెను.

**చందా పంపించవలసిన మా చిరునామా :**

అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్, కమిషనర్ కార్యాలయం,
సమాచార, పౌర సంబంధాల శాఖ, సమాచార భవన్,
ఎ.సి.గార్డ్స్, మాసబ్‌ట్యాంక్, హైదరాబాద్ 500028
వివరాలకు 040-23399048, 23398104
ఎక్స్‌టెన్షన్ 148 నంబరులో సంప్రదించవచ్చు.

- చీఫ్ ఎడిటర్



సమాచార, పౌర సంబంధాలశాఖ కేంద్ర కార్యాలయంలో స్పెషల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎం. హనుమంత రావు




### మరో రెండు గ్యారంటీల అమలు

# 200 యూనిట్ల ఉచిత విద్యుత్ రూ. 500కే గ్యాస్ సిలిండర్

**రాష్ట్ర ప్రభుత్వం అభయహస్తం పేరుతో ప్రజలకు హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలలో మరో రెండు గ్యారంటీలకు శ్రీకారం చుట్టింది. ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్రప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటలలోనే మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య పరిమితి 5 లక్షల రూపాయల నుంచి 10 లక్షల రూపాయలకు పెంచే రెండు హామీలను అమలుపరచిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్‌ను అందించే గృహజ్యోతి, కేవలం 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ సరఫరాచేసే మహాలక్ష్మి పథకాల అమలుకు శ్రీకారం చుట్టింది.**

రాష్ట్ర సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ రెండు గ్యారంటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ, ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా, రాష్ట్రం ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నా ప్రజలకిచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను అమలుచేసి తీరుతామని ప్రకటించారు. దుబారా ఖర్చు తగ్గించుకొని, ఆర్థిక నియంత్రణ పాటిస్తూ, సంక్షేమ పథకాలకు, అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తున్నామన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు తమ ప్రభుత్వం నూటికి నూరుశాతం కట్టుబడి ఉన్నదని, పథకాలు పేదలకు సులువుగా చేరేందుకు వీలుగా ఆయా శాఖల అధికారులు విధివిధానాలు రూపొందించారని సి.ఎం చెప్పారు. ఎవరెన్ని తప్పుడు ప్రచారాలు చేసినా, ఎటువంటి మాటలు మాట్లాడినా, పథకాల అమలు విషయంలో తమ ప్రభుత్వం వెనకడుగు వేయబోదని ఆయన స్పష్టం చేశారు. పథకాలు అమలుకాకుండా ఉంటే బాగుండునన్న రీతిలో కొందరు ప్రతిపక్ష నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. కానీ, వారిమాటలు ప్రజలు విశ్వసించడం లేదన్నారు.

నిజమైన లబ్ధిదారులకు పథకాలు అందించాలన్న లక్ష్యంతోనే ప్రజాపాలన కార్యక్రమం ద్వారా దరఖాస్తులు స్వీకరించామని, ఆ దరఖాస్తుల ఆధారంగానే అర్హులను గుర్తించామన్నారు.

ఈ పథకాలను పార్టీ నాయకురాలు ప్రియాంకా గాంధీ చేతులమీదుగా ప్రారంభించాలని అనుకున్నామని, కానీ, మహబూబ్ నగర్ జిల్లా స్థానిక సంస్థల నుంచి ఎమ్మెల్సీ ఎన్నికకు నోటిఫికేషన్ రావడం, కోడ్ అమలులోకి రావడంతో సచివాలయంలో ప్రారంభించామన్నారు.

మహాలక్ష్మి పథకం ద్వారా500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్లవరకూ ఉచిత కరెంటుతో పాటు, ఆరు గ్యారంటీలను 2023 సెప్టెంబర్ 17న తుక్కుగూడ సభలో సోనియాగాంధీ ప్రకటించిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఆమె మాట ఇచ్చారంటే అది శిలాశాసనమేనని, తమ ప్రభుత్వం ఆమె మాటను అమలుచేసి తీరుతుందని అన్నారు. కట్టెలపొయ్యితో కష్టాలు పడుతున్న మహిళలకోసం దీపం పథకాన్ని యు.పి.ఎ ప్రభుత్వమే గతంలో తీసుకువచ్చిందని

ఆ పథకం కింద అప్పుడు ప్రభుత్వం 400 రూపాయలకే గ్యాస్ సిలిండర్ అందిస్తే, ఆ తరువాత కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం సిలిండర్ ధరను 1200 రూపాయలకు పెంచిందని ముఖ్యమంత్రి విమర్శించారు.

## 200 యూనిట్ల వరకూ జీరో బిల్లు- భట్టి

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు చరిత్రాత్మకమైనవని అన్నారు. ఇవి దేశానికి ఒక దశను, దిశను నిర్దేశిస్తాయని భావిస్తున్నామన్నారు. 200 యూనిట్ల వరకూ కరెంటు బిల్లు వచ్చిన పేదలందరికీ మార్చి నుంచి జీరో బిల్లు ఇవ్వనున్నట్లు విద్యుత్ శాఖా మంత్రి కూడా అయిన భట్టి విక్రమార్క తెలిపారు.

## మున్ముందు 500 చెల్లిస్తే చాలు- ఉత్తమ్

ప్రస్తుత విధానంలో లబ్ధిదారు సిలిండర్ పై మొత్తం ధర చెల్లిస్తే, సబ్సిడీ మొత్తం వారిఖాతాలో జమ అవుతుందని పౌర సరఫరాల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కొన్ని రోజుల అనంతరం 500 రూపాయలు మాత్రమే చెల్లించి సిలిండర్ తీసుకొనే సదుపాయం కల్పిస్తామని మంత్రి చెప్పారు. గ్యాస్ పథకాన్ని దాదాపు 40 లక్షల మంది లబ్ధిదారులతో ప్రారంభి స్తున్నామని, రానున్న రోజుల్లో అర్హులందరికీ వర్తింపచేస్తామని చెప్పారు. మిగిలిన గ్యారంటీలను కూడా అమలుచేసి తీరుతామని ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు.

రాష్ట్రంలో రెండు డిస్కంల పరిధిలో గృహజ్యోతి కింద అర్హులకు 200 యూనిట్లవరకూ ఉచితంగా కరెంటు అందిస్తారు. 200 యూనిట్ల దాకా వినియోగించే అర్హులైన ఇంటి యజమానులతో పాటు, అద్దెదారులకు కూడా ఈ పథకం వర్తిస్తుంది. నిరంతర ప్రక్రియగా ఈ పథకం అమలవు తుంది.

## మహాలక్ష్మి పథకానికి మార్గదర్శకాలు

మహాలక్ష్మి పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తారు. ప్రస్తుతం వంట గ్యాస్ సిలిండర్ ధర 955 రూపాయలు ఉంది. ప్రస్తుతానికి లబ్ధిదారులు ఈ ధర మొత్తం చెల్లించి సిలిండర్ తీసుకోవాలి. తరువాత ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ ద్వారా సబ్సిడీ



సొమ్మును లబ్ధిదారుని ఖాతాకి బదలీ చేస్తారు. కొద్ది రోజుల తర్వాత ఆర్థిక, పౌరసరఫరాల శాఖల సమన్వయంతో లబ్ధిదారులు కేవలం 500 రూపాయలు మాత్రమే చెల్లించి సిలిండర్ తీసుకొనే సదుపాయాన్ని కల్పిస్తారు.

తెల్ల రేషన్ కార్డుతోపాటు, గ్యాస్ కనెక్షన్ ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ పథకం అమమమలవుతుంది. ప్రజాపాలన గ్రామ సభలలో దరఖాస్తు చేసుకొని ఉండాలి. గత మూడేళ్ళలో ఆ కుటుంబం సగటు వినియోగాన్ని బట్టి సబ్సిడీ సిలిండర్ కోటాను నిర్ణయిస్తారు.





# యాదాద్రి పవర్ ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తి చేయాలి

## అధికారులకు డిప్యూటీ సిఎం భట్టి ఆదేశం

**యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకు రావాలని డిప్యూటీ ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖా మంత్రి బట్టి విక్రమార్క మల్లు అధికారులను ఆదేశించారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డిలతో కలిసి ఆయన నల్గొండ జిల్లా దామరచర్ల మండలంలో నిర్మాణంలో ఉన్న థర్మల్ పవర్ ప్రాజెక్టును సందర్శించి, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతకు ముందు థర్మల్ పవర్ స్టేషన్‌లో స్థానికుల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు.**

ప్రాజెక్టు పురోగతిపై చక్కటి ప్రజెంటేషన్ ఇచ్చినందుకు డిప్యూటీ సిఎం అధికారులను అభినందించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రస్తుతం మంత్రులుగా ఉన్న ఉత్తంకుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డిలకు ఈ ప్రాజెక్టుపై పూర్తి అవగాహన ఉందని గతంలో వీరిద్దరూ ఎంపీలుగా ఉన్న క్రమంలో ప్రాజెక్టు పురోగతికి కృషి చేశారని వివరించారు. ప్రాజెక్టు పూర్తికి ఇద్దరు మంత్రుల సంపూర్ణ సహకారం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే రెండుసార్లు ప్రాజెక్టు అంచనా వ్యయాలు పెంచడంతో బడ్జెట్ భారీగా పెరిగిందని ఫలితంగా రాష్ట్ర ఖజానాకు భారంగా మారిందని, ప్రజలకు ఆందోళన కలుగుతోందని వివరించారు. ఈ ప్రాజెక్టును తొందరగా పూర్తి చేయకపోతే మోయలేని భారంగా మారుతుంది అన్నారు. అందుకే పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి పెట్టాం, ఈ క్రమంలోనే థర్మల్ పవర్ స్టేషన్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామన్నారు.

గతంలో హైదరాబాదులో ఈ ప్రాజెక్టు పనుల పురోగతిని సమీక్షించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ప్రాజెక్టు పూర్తికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. ప్రాజెక్టు ద్వారా స్థానికంగా ఉన్న స్కిల్డ్, అన్ స్కిల్డ్ అందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించే అంశంపై ఆలోచన చేయాలన్నారు. ప్రస్తుతం పని చేస్తున్న అన్ స్కిల్డ్ లేబర్ ఎక్కడి నుంచి వస్తున్నారు, వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు సమాధానం ఇస్తూ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత స్థానికులకే అవకాశాలు కల్పిస్తామన్నారు. ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి చేసేందుకు ఓ పాలసీని రూపొందించాలని అధికారులు భావిస్తే అందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని భట్టి తెలిపారు. ప్రాజెక్టు పూర్తికి ప్రభుత్వ పక్షాన ఎల్లవేళలా సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు.

ఈ ప్రాజెక్టు సంపద రాష్ట్ర ప్రజలకు పూర్తిస్థాయిలో ఉపయోగపడాలి ఏ కొందరి వ్యక్తుల పరం కాకూడదన్నారు. ఈ ఆశయం నెరవేర్చే క్రమంలో అధికారులు ఎటువంటి బెదిరింపులకు లొంగాల్సిన పని లేదన్నారు. ప్రాజెక్టును పూర్తి చేసేందుకు 24/7 తనతోపాటు సీనియర్ మంత్రులు, అధికార యంత్రాంగం అందుబాటులో ఉంటారని భరోసా ఇచ్చారు.



# ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగానికి పచ్చజెండా

**రీజినల్ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) దక్షిణ భాగం(చౌటుప్పల్-అమన్‌గల్-షాద్‌నగర్-సంగారెడ్డి- 182 కి.మీ) జాతీయ రహదారి ప్రకటనకు సంబంధించిన అడ్డంకులు తొలగిపోయాయి. ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగాన్ని ఇప్పటికే జాతీయ రహదారిగా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమైన తర్వాత ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగాన్నిజాతీయ రహదారిగా ప్రకటించేందుకు ప్రతిపాదనలు కోరాలని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను ఆదేశించారు.**

**ఆర్‌ఆర్‌ఆర్** అంశంతో పాటు తెలంగాణలో జాతీయ రహదారుల విస్తరణకు అనుమతి, పలు ముఖ్యమైన రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలని జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో జాతీయ రహదారులుగా విస్తరించాల్సిన రాష్ట్ర రహదారుల జాబితాను కేంద్ర మంత్రికి అందజేశారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయన అధికారిక నివాసంలో కలిశారు. సుమారు గంటన్నరపాటు కొనసాగిన భేటీలో రాష్ట్రంలో జాతీయ రహదారుల విస్తరణ, జాతీయ రహదారుల పనులకు సంబంధించిన వివిధ సమస్యల ను ముఖ్యమంత్రి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, ఢిల్లీ తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు. తొలుత రీజినల్ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) నార్తరన్ పార్ట్ చౌటుప్పల్–భువనగిరి–తుఫ్రాన్–సంగారెడ్డి–కంది పరిధిలో యూటిలిటీస్ (కరెంటు స్తంభాలు, భవనాల తదితరాలు) తొలగింపునకు సంబంధించి వ్యయం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నెలకొన్న ప్రతిష్టంభనపై చర్చసాగింది. యూటిలిటిస్ తరలింపు వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని పది నెలల క్రితం భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తెలపకపోవడంతో ఈ విషయంలో ప్రతిష్టంభన నెలకొంది. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత యూటిలిటీస్ తరలింపు వ్యయాన్ని భరించేందుకు సమ్మతిస్తూ ఎన్‌హెచ్‌ఏఐకు లేఖ పంపారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి గడ్కరీ వద్ద ప్రస్తావించగా ఆయన ఈ అంశంపై ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను ఆరా తీశారు. యూటిలిటీస్ తరలింపు వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించాలని మెలిక పెట్టినది ఎవరంటూ అధికారులపై కేంద్ర మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం యుటిలిటీస్ తరలింపు వ్యయాన్ని భరిస్తే భవిష్యత్‌లో టోల్ ఆదాయంలో సగం రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుందన్నారు. యుటిలిటీస్ తరలింపు వ్యయాన్ని తామే భరిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు.

ఆర్‌ఆర్‌ఆర్‌కు సంబంధించి భూ సేకరణ, విధానపరమైన ప్రక్రియలను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రికి కేంద్ర మంత్రి తెలిపారు. హైదరాబాద్ నుంచి విజయవాడ జాతీయ రహదారిని ఆరు వరుసల రహదారిగా, హైదరాబాద్ నుంచి కల్వకుర్తి వరకు ఉన్న రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారు.



# ధరణి దరఖాస్తులకు మోక్షం

**ప్రభుత్వం ప్రజలకు మాట ఇచ్చిన విధంగానే ధరణిలో మార్పులకు శ్రీకారం చుట్టింది. మార్చి 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ప్రత్యేక కార్యాచరణ (స్పెషల్ డ్రైవ్) ను ప్రారంభించింది. గత ప్రభుత్వ కాలంలో తమ భూ సమస్యల విషయమై రైతులు పెట్టుకున్న దరఖాస్తులకు ఇప్పుడు మోక్షం లభించనుంది. ఈ మేరకు ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసింది. ఇప్పటి వరకు కలెక్టర్లకు ఉన్న అధికారాలను తహసీల్దార్, ఆర్డీఓ, అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిలో విభజించి ఎవరు ఏఏ సమస్యలు పరిష్కరించాలో అందులో స్పష్టం చేసింది. ఇది కాకుండా కొన్ని సీసీఎల్ఏ స్థాయిలో కూడా పరిష్కారం చేయాలని పేర్కొన్నారు. ముఖ్యంగా రైతులు పేర్కొన్న సమస్యల్లో కోర్టులు, వ్యవసాయ భూమి వ్యవసాయేతర భూమిగా మార్చడం తదితర అంశాలను కలెక్టర్ల పరిధిలో అలానే ఉంచారు. మిగతా వాటిలో కొన్నింటిని తహసీల్దార్లకు, మరికొన్ని ఆర్డీఓలకు అధికారమిచ్చారు.**

**అంతకుముందు..** సచివాలయంలో ధరణి కమిటీతో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. రెవిన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ధరణి కమిటీ సభ్యులు ఎం. కోదండరెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ రేమండ్ పీటర్, అడ్వకేట్ సునీల్, రిటైర్డ్ స్పెషల్ గ్రేడ్ కలెక్టర్ బి.మధుసూదన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, రెవిన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి శేషాద్రి, ప్రాజెక్టు డైరెక్టర్ సీఎంఆర్వో వి.లచ్చిరెడ్డి, ఉన్నతాధికారులు సమావేశంలో ఉన్నారు.

2020లో అమల్లోకి వచ్చిన ఆర్వో ఆర్ చట్టంలోనే లోపాలున్నాయని ధరణి కమిటీ ముఖ్యమంత్రికి నివేదించింది. గత ప్రభుత్వం మూడు నెలల్లో హడావుడిగా చేపట్టిన రెవిన్యూ రికార్డుల నవీకరణతో నే కొత్త చిక్కులు వచ్చాయని చెప్పారు. ఆ రికార్డులనే ధరణికి ప్రామాణికంగా తీసుకోవటంతో భూముల సమస్యలు, భూముల రికార్డుల వివాదాలు ఎక్కువయ్యాయని అన్నారు. దీంతో లక్షలాది సమస్యలు ఉత్పన్నమ య్యాయని, కనీసం పేర్లలో చిన్న అక్షర దోషాలున్నా సరిదిద్దుకునేందుకు జిల్లా కలెక్టర్ దాకా వెళ్లాల్సి వస్తోందని వివరించారు. దాదాపు 35 మాడ్యుల్స్ ద్వారా ధరణి డేటాలో ఉన్న తప్పులను సవరించుకునేందుకు రెవిన్యూ శాఖ అవకాశం ఇచ్చిందని, కానీ ఏ మాడ్యుల్లో దేనికి దరఖాస్తు చేసుకోవాలనే అవగాహన లేకపోవటంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని కమిటీ సీఎం దృష్టికి తీసుకెళ్లింది.

లక్షలాది దరఖాస్తులు ఇప్పటికే తిరస్కరణకు గురయ్యాయని, ఒక్కో తప్పును సవరించుకోవాలంటే వెయ్యి రూపాయలు ఫీజు చెల్లించాల్సి ఉండటం రైతులకు భారంగా మారిందని తెలిపారు. అటు రిజిస్ట్రేషన్ల శాఖ, ఇటు రెవిన్యూ శాఖల మధ్య సమన్వయం లోపంతో నిషేధిత జాబితాలో ఉన్న భూముల క్రయ విక్రయాలు కూడా జరుగుతున్నాయని చర్చ జరిగింది. ధరణి డేటాను వ్యవసాయ శాఖ ప్రామాణికంగా తీసుకొని రైతు బంధు ఖాతాలో జమ చేయటంతో ఇప్పటికే కోట్లాది రూపాయల ప్రభుత్వ ధనం దుర్వినియోగమైందని చర్చ జరిగింది. ఇప్పుడున్న ధరణి లోపాలను సవరించాలంటే చట్ట సవరణ చేయటం లేదా కొత్త ఆర్ వో ఆర్ చట్టం చేయటం తప్ప గత్యంతరం లేదని కమిటీ సభ్యులు ముఖ్యమంత్రికి నివేదించారు.

కమిటీ ఇచ్చే తుది నివేదిక ఆధారంగా రైతుల భూముల రికార్డుల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ముఖ్యమంత్రి అన్నారు. అవసరమైతే చట్ట సవరణ చేయటం లేదా.. కొత్త చట్టం తీసుకు వచ్చే అంశాలను పరిశీలిద్దామని చెప్పారు. ధరణిలో ఇప్పుడున్న లోపాలు, సమస్యలన్నీ మరింత లోతుగా అధ్యయనం చేయాలని కమిటీకి సూచించారు. ఎలాంటి భూవివాదాలు, కొత్త చిక్కులు లేకుండా దోషరహితమైన భూముల రికార్డులను నిర్వహించాలని సీఎం అన్నారు. అందుకు అవసరమైన పరిష్కారాలను కూడా అన్వేషించాలని కమిటీని కోరారు. ప్రభుత్వం తీసుకునే తదుపరి నిర్ణయాలతో ఇప్పుడున్న లోపాలకు అడ్డుకట్ట వేయటంతో పాటు కొత్త సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని సీఎం అధికారులను అప్రమత్తం చేశారు. ఇప్పుడున్న పెండింగ్ దరఖాస్తుల్లో సాధ్యమైన వాటిని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు.

### ఏజెన్సీ పై సమగ్ర విచారణ

ధరణి పోర్టల్ నిర్వహిస్తున్న ఏజెన్సీపై సమగ్ర విచారణ జరిపించాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. సీసీఎల్ఏ అధ్వర్యంలో ప్రభుత్వం బాధ్యతాయుతంగా నిర్వహించాల్సిన ఈ పోర్టల్ ను ప్రైవేటు ఏజెన్సీలకు ఎందుకు అప్పగించారని సీఎం ప్రశ్నించారు. రాష్ట్రంలోని లక్షలాది మంది రైతుల భూముల రికార్డులు మొత్తం విదేశీ కంపెనీల చేతుల్లో ఉన్నాయని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. అత్యంత గోప్యంగా ఉండాల్సిన భూముల డేటాను, ఆధార్, బ్యాంకు ఖాతాల వివరాలన్నీ ఏజెన్సీ దగ్గర ఉంచటాన్ని ముఖ్యమంత్రి తప్పు బట్టారు. భూముల రికార్డుల డేటాకు భద్రత ఉందా.. సురక్షితంగా ఉన్నట్టా.. లేనట్టా.. అని అనుమానాలు వ్యక్తం చేశారు.

2018లో టెక్నికల్, ఫైనాన్సియల్ బిడ్డింగ్, అర్హతల ఆధారంగా ఐఎల్ ఎఫ్ఎస్ అనే కంపెనీకి అప్పటి ప్రభుత్వం ధరణి పోర్టల్ డిజైన్ డెవెలప్మెంట్ ను అప్పగించిందని అధికారులు బదులిచ్చారు. ఆ కంపెనీ దివాళా తీసిందని, తర్వాత టెర్రాసిస్ అని పేరు మారటం, డైరెక్టర్లు అందరూ మారిపోవటం, తర్వాత వాటాలు అమ్ముకొని ఫాల్కాన్ ఇన్వెస్టెమెంట్ కంపెనీగా చేతులు మారటంపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చ జరిగింది.

బిడ్ దక్కించుకున్న కంపెనీ తమ ఇష్టానుసారంగా పేర్లు మార్చుకొని, ఏకంగా కంపెనీలనే మార్చితే ప్రభుత్వం ఎలా అంగీకరించిందని ముఖ్యమంత్రి ఆరా తీశారు. భూముల రికార్డుల డేటాను ఎవరికి పడితే వారికి, విదేశీ కంపెనీలకు కూడా అప్పగించే నిబంధనలున్నాయా.. అని అధికారులను ముఖ్యమంత్రి ప్రశ్నించారు.

2018లో రూ.116 కోట్లకు ధరణి టెండర్ దక్కించుకున్న కంపెనీ తమ వాటాలను దాదాపు పన్నెండు వందల కోట్లకు అమ్ముకోవటం విస్మయం కలిగించిందని సీఎం అన్నారు. మన రికార్డులన్నీ వాళ్ల దగ్గరే ఉన్నందున.. విలువైన భూములను పేర్లు మార్చుకోలేదని గ్యారంటీ ఏముందని ప్రశ్నించారు. కొన్ని సందర్భాల్లో అర్ధరాత్రి కూడా భూముల రిజిస్ట్రేషన్లు జరిగినట్లు ఫిర్యాదులు వచ్చాయని, ధరణి పోర్టల్ నిర్వహణపై నియంత్రణ, అజమాయిషీ లేదా.. అని సీఎం రెవిన్యూ అధికారులను ప్రశ్నించారు.



## ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షునిగా చిన్నారెడ్డి

**రాష్ట్ర** ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షునిగా మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జి.చిన్నారెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఆయనకు క్యాబినెట్ హోదా కల్పిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. చిన్నారెడ్డి 2007-2009 మధ్య కాలంలో డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి మంత్రివర్గంలో గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా పనిచేశారు. వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి నాలుగు పర్యాయాలు శాసనసభ్యునిగా గెలుపొందారు. తెలంగాణ ఉద్యమ సమయంలో చురుగ్గా పనిచేశారు. తెలంగాణ ఎమ్మెల్యేల ఫోరం ఛైర్మన్‌గా పనిచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆయనకు ప్రజావాణి కార్యక్రమ అమలు బాధ్యతలను కూడా అదనంగా అప్పగించారు.





## ముగ్గురు రాజ్యసభ సభ్యులు ఏకగ్రీవం

**ఇటీవల** జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో మన రాష్ట్రం నుంచి ముగ్గురు రాజ్యసభ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇందులో ఇద్దరు కాంగ్రెస్ నుంచి ఎన్నిక కాగా, మరొకరు బీఆర్ఎస్ నుంచి ఎన్నికయ్యారు. కాంగ్రెస్ పార్టీ నుంచి సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు, మాజీ కేంద్ర మంత్రి రేణుక చౌదరి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు అనిల్‌కుమార్ గౌడ్‌లు ఎన్నికయ్యారు. బీఆర్ఎస్ నుంచి వద్దిరాజు రవిచంద్ర ఎన్నికయ్యారు.



# ప్రజల కోసం ప్రజల ద్వారా ప్రజాపాలన

## గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

**రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే మరో రెండు గ్యారంటీలను అమలు చేయనున్నదని, మహాలక్ష్మి పథకం కింద అర్హులైన కుటుంబాలకు 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ సరఫరా, గృహజ్యోతి పథకం కింద అర్హత గల ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత గృహవిద్యుత్‌ను అందించనున్నదని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చెప్పారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఉభయ సభలను ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. గవర్నర్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ...**

ప్రజాకవి, పద్మ విభూషణ్ స్వర్గీయ శ్రీ కాళోజీ నారాయణరావు గారి

**“అధికారమున్నదని హద్దుపద్దు లేక**
**అన్యాయమార్గాల నార్జింపబూనిన**
**అచ్చి వచ్చే రోజులంతమైనాయి**
**అచ్చి వచ్చే రోజులంతమైనాయి!”**

అనే పలుకులతో, ఈ చారిత్రక సభలో నా ప్రసంగాన్ని ప్రారంభిస్తున్నాను.

తెలంగాణ ప్రజలు మాపై ఉంచిన నమ్మకానికి, విశ్వాసానికి కృతజ్ఞతతో వున్నాను. మార్పు మరియు ధర్మబద్ధమైన ప్రగతి కోసం ఒక ఉమ్మడి ఆకాంక్షగా ఇటీవల జరిగిన ఎన్నికలు నిలిచాయి. ఈ ఎన్నికల్లో ప్రజాభిప్రాయం స్పష్టంగా ప్రతిధ్వనించింది. తెలంగాణ ప్రజలు వారి ఆకాంక్షలు ప్రతిబింబించేలా నిజమైన స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం గల పరిపాలనను కోరుకున్నారు.

తెలంగాణ ప్రజల విజ్ఞతను నేను అభినందిస్తున్నాను. వారి తీర్పు పౌర హక్కులకు, ప్రజాస్వామిక పరిపాలనకు నిదర్శనం. ప్రజలకు అందుబాటులో ఉండి వారి ఫిర్యాదులను స్వీకరించడానికి జ్యోతిభాపూలే ప్రజా భవన్‌గా పేరు మార్చిన భవనం ఎల్లవేళలా తెరిచేవుంటుంది. తెలంగాణలో ఇప్పుడు ప్రజలకోసం ప్రజల ద్వారా ప్రజాపాలన జరుగుతున్నది.

నిజమైన ప్రజాస్వామ్య నిబద్ధతతో ప్రజలకు సేవకులుగా ఉంటామని పునరుద్ఘాటించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని నేను అభినందిస్తున్నాను. ఈ దిశగా ప్రజా పాలన ఉట్టిపడేలా ప్రభుత్వపు తొలిమెట్టు అయిన ప్రజావాణి కార్యక్రమం, ప్రజలు వారి ఇబ్బందులను చెప్పుకుని, పరిష్కారం కోరడానికి ఒక సరియైన వేదిక.

నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్ష, యువత బలిదానాలు, విద్యార్థుల అలుపెరగని పోరాటాల నుండి తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. అట్టి త్యాగాలను పూర్తిగా గౌరవించే బాధ్యతతో మా పాలన వుంటుంది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలించడమే మా లక్ష్యం.

తెలంగాణ ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన వారందరికీ నా ప్రభుత్వం కృతజ్ఞతలు తెలియచేస్తున్నది. ప్రత్యేకించి అప్పటి యూపీఏ ప్రభుత్వ గౌరవ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ కృషిని గుర్తు

చేసుకుంటుంది. ఈ చారిత్రాత్మక ప్రక్రియలో కీలకమైన పాత్ర పోషించిన సోనియాగాంధీకి నా ప్రభుత్వం రుణపడి వుంటుందని తెలియజేస్తున్నది. ఎన్నికలలో హామీ ఇచ్చిన విధంగా, మా ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ఆరు గ్యారెంటీలను అమలు పరచడానికి నా ప్రభుత్వం కట్టుబడి వుంది. ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించింది. ప్రతీ గ్రామ పంచాయతీలో, ప్రతీ మునిసిపాలిటీలలో సామరస్యంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో గ్రామ మరియు వార్డు సభలను నిర్వహించాము. వివిధ వర్గాల ప్రజల నుండి 1.28 కోట్లకు పైగా దరఖాస్తులు అందాయి. నిర్దిష్ట సమయంలోపు ఆరు (6) గ్యారెంటీలను అమలు పరుస్తాం.

మా ప్రభుత్వం మహాలక్ష్మి పథకం, రైతు భరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇళ్ల, యువ వికాసం, చేయూత గ్యారంటీల అమలుకు కట్టుబడి ఉంది. ఇచ్చిన గ్యారంటీలను నెరవేర్చడం జరుగుతోంది. రైతులు, యువత, ఎస్.సి, ఎస్.టి, బి.సి మరియు మైనారిటీ సామాజిక వర్గాలకు మేము ఇచ్చిన వాగ్దానాల అమలుకు కట్టుబడి ఉన్నాం.

కొత్తగా ఏర్పాటు చేసిన మన టి.ఎస్.పి.ఎస్.సి ద్వారా దాదాపుగా 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయడం, పాలమూరు రంగారెడ్డి వంటి సాగునీటి ప్రాజెక్టుల నుండి విద్యారంగం వరకు తెలంగాణలోని వివిధ రంగాలు మా భవిష్యత్ ప్రణాళికలో వున్నాయి. కొత్తగా ఏర్పాటు చేసిన ధరణి కమిటి ద్వారా భూమికి సంబంధించిన అనేక సమస్యలను పరిష్కరించే దిశగా నా ప్రభుత్వం చిత్త శుద్ధితో ప్రయత్నాలు ముమ్మరం చేసింది.

> **మన హైదరాబాదు కేవలం పాలనా పరమైన రాజధాని మాత్రమేకాక, మన రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధికోసం గొప్ప ఆదాయ వనరు. మేము హైదరాబాదుకు గల గత వైభవాన్ని పునరుద్ధరించాలని, అదే సమయంలో రాష్ట్రమంతటా అభివృద్ధిని వికేంద్రీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాము.**

మా ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణను, పారదర్శకతను పునరుద్ధరించడానికి కట్టుబడి వుంది. గత శాసనసభ సమావేశాలలో ఆర్థిక వ్యవస్థపై శ్వేతపత్రాన్ని విడుదల చేసింది. దీనిలో ప్రభుత్వ వనరులను గత ప్రభుత్వం ఎంత అసమర్థంగా, నిర్లక్ష్యంగా వినియోగించిందో స్పష్టంగా పేర్కొనడం జరిగింది. తెలంగాణ ప్రజలు గత ప్రభుత్వానికి ధనిక రాష్ట్రాన్ని అప్పగించగా, పది సంవత్సరాల తర్వాత వారు మనకి అప్పులపాలైన రాష్ట్రాన్ని అప్పగించారు. ప్రజలపై భారం మోపకుండా రాష్ట్ర ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడమే ప్రభుత్వానికి తక్షణ సవాలు. ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణ, నిర్వహణలో బాధ్యత, జవాబుదారీతనాన్ని అవలంభించడానికి ఈ బడ్జెటు ఒక సదవకాశం.

మన రాష్ట్రంలో అత్యధిక జనాభాకు జీవనోపాధిని సమకూరుస్తు వ్యవసాయం వెన్నెముకగా వుంది. రాష్ట్ర ఆర్థిక ముఖ చిత్ర కల్పనలో మన రైతుల శ్రమ కీలకం. మన సామాజిక – ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం పోషించే కీలక పాత్రను గుర్తిస్తూ, రైతుల సంక్షేమానికి నా ప్రభుత్వం కట్టుబడివుంది. వాతావరణ మార్పుల నుండి మార్కెట్ ఒడిదుడుకుల వరకు వారు ఎదుర్కొనే ప్రతి సవాలును గుర్తించి వారి అభివృద్ధికి దోహదపడే పటిష్ట విధానాలను అమలు చేస్తానని నేను వాగ్దానం చేస్తున్నాను. రైతు భరోసా, పంట రుణ మాఫీ, పంట మార్పిడి కార్యక్రమాలు, ఉద్యానవన అభివృద్ధి, నాణ్యమైన విత్తనాలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులతో రైతాంగ సాధికారతను మేము లక్ష్యంగా పెట్టుకున్నాం. వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించడమే కాకుండా మన రైతులకు స్థిరమైన ప్రోత్సాహకాలను కల్పించడం కూడా మా లక్ష్యం.

ఆర్థికాభివృద్ధికి పరిశ్రమలు, సేవా రంగాలు చాలా ముఖ్యమైనవి. కొత్త ఉద్యోగాలను ఉపాధిని కల్పించడంలో ఈ రంగాలు అతి కీలకమైనవి. పారిశ్రామిక, సేవారంగాల వృద్ధికి ఊతమిచ్చే సామర్థ్యం తెలంగాణ రాష్ట్రానికి వుంది. అయితే, ఈ సామర్థ్యాన్ని గత ప్రభుత్వం పాక్షికంగా మాత్రమే వినియోగించింది.

నా ప్రభుత్వం, కీలకమైన ఈ రెండు రంగాలను సంపుష్టి చేయడానికి నూతన ఒరవడిని తీసుకొని రావాలని భావిస్తోంది. ప్రస్తుతమున్న క్షేత్రస్థాయి వాస్తవాలు, భాగస్వాముల అభిప్రాయాలు, ప్రపంచ వ్యాప్తంగా అనుసరిస్తున్న ఉత్తమ పద్ధతుల అధ్యయనం ఆధారంగా నూతన విధానాన్ని ప్రవేశపెట్టాలని నా ప్రభుత్వం భావిస్తోంది.

మన రాష్ట్రంలోని అనేక పారిశ్రామిక యూనిట్లు సూక్ష్మ, చిన్నతరహా, మధ్యతరహా పరిశ్రమల కేటగిరీలు లేదా ఎంఎస్ఎంఇల క్రిందికి వస్తాయి. ఎంఎస్ఎంఇలు కున్న సవాళ్ళు, అవసరాలు భారీ పరిశ్రమలకు పూర్తి భిన్నంగా వుంటాయి. మెరుగైన సాంకేతికత, నైపుణ్యం కలిగిన సిబ్బందిని నియమించుకునే సామర్థ్యం, ఆర్థిక సహాయం, మార్కెట్ సౌలభ్యం, పారిశ్రామిక ఖాయిలాలను నివారించడంలో వారికి తోడ్పడుతూ ప్రభుత్వం నూతన ఎంఎస్ఎంఇ విధానాన్ని తీసుకువస్తుంది.

తోళ్ళు, పాదరక్షలు, రత్నాలు, ఆభరణాలు, రసాయనాలు, ప్లాస్టిక్ ఇంజనీరింగ్ వస్తువులు, ఎఫ్ఎంసిజి ఉత్పత్తులు, అత్యధిక విలువ గల ఆహార ప్రాసెసింగ్, ఎలక్ట్రిక్ మొబిలిటి, నిల్వల వంటి రంగాలు వాటి సామర్థ్యంతో పోల్చుకుంటే, అనుకున్న మేరకు వినియోగంలోనికి రానందున నా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధను వహించి ప్రతి రంగానికి ప్రత్యేక పారిశ్రామిక పార్కులు, అనుకూలమైన వ్యవస్థలను ఏర్పాటు చేసేలా చూస్తుంది.

ఐటి, ఫార్మా వంటి ప్రధాన రంగాలకు మా సహకారం కొనసాగుతుంది. నా ప్రభుత్వం 1000 నుండి 3000 ఎకరాల విస్తీర్ణంతో జనావాసాలకు దూరంగా, 10 నుండి 12 ఫార్మా విలేజ్ క్లస్టర్లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదిస్తోంది. ఈ క్లస్టర్లు వ్యర్థాల శుద్ధి, టెస్టింగ్ ల్యాబ్‌లు, లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాలు, గృహ నిర్మాణం, విద్య, ఆరోగ్య సంరక్షణకు కావలసిన సామాజిక మౌలిక సదుపాయాలను కలిగి ఉంటాయి.

మా ప్రభుత్వం ఏర్పడి కొన్ని వారాలే

అయినప్పటికీ, గౌరవ ముఖ్యమంత్రి, గౌరవ పరిశ్రమలు, వాణిజ్య, ఐటిఇ&సి శాఖ మంత్రి దావోస్, స్విట్జర్లాండ్‌లో జరిగిన వరల్డ్ ఎకానమిక్ ఫోరం వార్షిక సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర ప్రతినిధి బృందానికి ఉత్సాహకరమైన ప్రతిభా వంతమైన నాయకత్వం వహించడం వల్ల పారిశ్రామిక దిగ్గజాల నుండి అత్యంత సానుకూల స్పందన వచ్చింది. ఈ పర్యటనలో అంతర్జాతీయ కంపెనీలకు చెందిన 50 మంది పారిశ్రామిక వేత్తలతో ముఖ్యమంత్రి సమావేశమయినారు. దీని ఫలితంగా తెలంగాణలో రూ.40,000 కోట్లకు పైగా పెట్టుబడులను పెట్టడానికి వారు సంసిద్ధతను వ్యక్తపరిచారు. ఈ సదస్సులో గౌరవ ముఖ్యమంత్రి ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయంపై అంతర్జాతీయ కంపెనీ ప్రతినిధులకు తమ ప్రభుత్వపు



లక్ష్యాలను, దార్శనికతను వివరించారు. పునరుత్పాదక ఇంధనం, జీవశాస్త్ర రంగాలు, తయారీ, డాటా సెంటర్స్, ఆహార ప్రాసెసింగ్, ఐటి వంటి రంగాలలో ఎంఓయులను కుదుర్చుకోవడం గొప్ప విషయం.

నేడు మన సమాజంలో డిజిటల్ అనుసరణ శరవేగంగా జరుగుతుంది. తెలంగాణ రాష్ట్రం డిజిటల్ అవకాశాల నుండి పూర్తిగా ప్రయోజనం పొందడమే కాకుండా కొత్త సాంకేతికతలలో దేశంలోనే అగ్రగామిగా ఎదగవలసిన అవసరం వుంది. ఇంటర్నెట్‌ను ఒక ప్రాథమిక హక్కుగా ప్రవేశపెట్టడం అనేది, మా ప్రభుత్వం చేపట్టబోయే ముఖ్యమైన కార్యక్రమాలలో ఒకటి. కేవలం డిజిటల్ మౌలిక సదుపాయాలను సృష్టించడమే కాకుండా, సమాజంలోని అన్ని వర్గాలకు కనీస ధరలకే అందుబాటులోకి తేవడంపై దృష్టి సారిస్తుంది. ప్రతి కుటుంబం వేగవంతమైన డిజిటల్ అనుసరణ అవకాశాల ద్వారా వచ్చే ప్రయోజనం పొందేందుకు ఒక సార్వజనీన సమగ్ర డిజిటల్ అక్షరాస్యత కార్యక్రమాన్ని మా ప్రభుత్వం అమలు చేస్తుంది.

నా ప్రభుత్వం కొత్త సాంకేతికతను ముఖ్యంగా కృత్రిమ మేధాశక్తిని వినియోగించుకోవాలని దృఢ నిశ్చయంతో వుంది. ప్రపంచ అగ్రగామి సంస్థలు, అలాగే జాతీయ సాంకేతిక కంపెనీలను తమ కృత్రిమ మేధా కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆహ్వానించడం ద్వారా దేశంలోనే హైదరాబాదును, తెలంగాణను కృత్రిమ మేధస్సుకు ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేస్తాం. మా ప్రభుత్వం కృత్రిమ మేధా సిటీని 50-100 ఎకరాలలో ఏర్పాటు చేస్తుంది.

సమ్మిళిత విధానం, లక్షిత ప్రణాళికల అమలుతో నా ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు పరిశ్రమలు, సేవా రంగాలు అందించే సామర్థ్యాన్ని సంపూర్ణంగా అందుబాటులోకి తెస్తుందని నేను విశ్వసిస్తున్నాను. వీటి ఫలితాలు మరికొన్ని నెలల్లోనే కనిపిస్తాయని నేను విశ్వసిస్తున్నాను.

నా ప్రభుత్వం నైపుణ్య శిక్షణ, వృత్తిపర విద్యకు అధిక ప్రాధాన్యతను ఇస్తుంది. నైపుణ్య లోపాలను గుర్తించి, ఇండస్ట్రీ 4.0 అవసరాలను తీర్చడానికి, నా ప్రభుత్వం అంచనావేసిన సుమారు రూ.2000 కోట్ల ప్రాజెక్టు వ్యయంతో రాష్ట్రంలోని ప్రభుత్వ ఐటిఐలన్నింటినీ ఆధునిక టెక్నాలజీ సెంటర్లుగా మార్చబోతున్నది. ఈ కేంద్రాలు ఎన్‌సివిటి ఆమోదించిన అధిక డిమాండ్ ఉన్న ట్రేడ్లలో దీర్ఘకాలిక, స్వల్పకాలిక కోర్సులను అందించడం ద్వారా సుమారు ఒక లక్ష మంది తెలంగాణ యువతకు ప్రయోజనం కలిగిస్తాయి.

మన రాష్ట్రం విద్యుత్ అవసరాలకు ప్రధానంగా బొగ్గు పై ఆధారపడుతున్నది. విద్యుత్ ఉత్పాదక వ్యయాన్ని తగ్గించడానికి అలాగే పర్యావరణ పరిరక్షణల లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని స్వచ్ఛ ఇంధనపు వాటాను పెంచాల్సి వుంటుంది. అధిక డిమాండ్ అవసరాలను తీర్చడానికి హరిత ఇంధనం అంటే సౌర, పవన, హైబ్రిడ్ (సౌర, పవన)తో పాటు నిల్వ (పంప్/బ్యాటరీ) ఇంధనం వంటి అన్ని రకాల హరిత ఇంధనాలను ప్రోత్సహించ దానికి మన ప్రభుత్వం ఒక సమగ్ర "ఇంధన పాలసీ"తో ముందుకు రానున్నది. హరిత ఇంధనం వాటాను గణనీయంగా మెరుగుపరిచి, 2030 సంవత్సరం నాటికి కార్బన్ ఉద్గారాలను తగ్గించాలని నా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది.

తెలంగాణలోని విస్తారమైన రిజర్వాయర్లు ప్రకృతి అందాలతో, పర్యాటకులకు వినోదాన్ని కలిగిస్తాయి. హుస్సేన్ సాగర్, లక్నవరం, రామప్ప వంటి సరస్సులు నీటి వనరులుగా మాత్రమే కాకుండా బోటింగ్‌తో పాటు విశ్రాంతి కేంద్రాలుగా కూడా పేరుపొందాయి. ఈ రిజర్వాయర్లను పర్యావరణ అనుకూల పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయడానికి కావలసిన మంచి విధానాలను రూపొందించి, నీటి వనరుల సహజ స్థితిని పరిరక్షించడానికి నా ప్రభుత్వం కట్టుబడి ఉంది.

ఇప్పటి వరకు మూసీ నది నిర్లక్ష్యానికి గురైంది. ప్రజలకు ఈ నది అన్ని విధాలుగా ఉపయోగపడేలా చేయడమే మన లక్ష్యం. నా ప్రభుత్వం పెద్ద ఎత్తున మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనులను చేపట్టనుంది. మూసీ మరొకసారి హైదరాబాద్ జీవనాడిగా మారనుంది. దానిచుట్టూ ఉన్న మొత్తం పట్టణ ల్యాండ్ స్కేప్

పునరుజ్జీవింప చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. నగర తూర్పు, పశ్చిమ భాగాలను అనుసంధానించే రవాణా నెట్‌వర్క్‌ను, స్వచ్ఛమైన నీటిని, రివర్ ఫ్రంట్ సుందరీకరణ వంటి అంశాలు ఈ ప్రాజెక్టులో అంతర్భాగం. పీపుల్స్ ప్లాజా, పాదచారుల జోన్లు, హాకర్ ప్రాంతాలు, నగరమంతటా పచ్చని ప్రదేశాలు మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు ద్వారా ఏర్పాటు కానున్నాయి. నగరంలోని పురాతన, వారసత్వ ప్రాంతాల పునరుజ్జీవనం వల్ల ప్రజలకు మరింతగా చేరువవుతాయి. ఈ విషయంపై తగు చర్యలు చేపట్టడానికి, ఉత్తమ పద్ధతులను అవలంభించడానికి



ఖ్యాతి గాంచిన జాతీయ, అంతర్జాతీయ నమూనాలను మేము అధ్యయనం చేస్తున్నాము. ఇంతకు ముందు చేయని విధంగా పెద్ద ఎత్తున, సకాలంలో పర్యావరణ, ఆర్థిక మార్పుకు మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఉపయోగపడనుంది.

> **ఉజ్వలమైన, సుసంపన్నమైన తెలంగాణ సాధనలో భాగంగా మన యువత భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధి కల్పన, క్రీడల మౌలిక సదుపాయాలు కీలక పాత్ర పోషిస్తాయని నా ప్రభుత్వం గుర్తించింది. నైపుణ్యం, సాధికారత గల ఉద్యోగుల ఆవశ్యకతను నా ప్రభుత్వం గుర్తించి రాష్ట్రమంతటా నైపుణ్య విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేస్తుంది.**

వేగంగా మారుతున్న జాబ్ మార్కెట్ డిమాండ్లకు అనుగుణంగా అవసరమైన పరిజ్ఞానం, నైపుణ్యంతో మన యువతను సన్నద్ధం చేస్తూ ఈ నైపుణ్య విశ్వవిద్యాలయాలు ప్రతిభా కేంద్రాలుగా పనిచేస్తాయి. నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించడం ద్వారా, మన యువత కేవలం విద్యాపరంగా మాత్రమే కాకుండా పారిశ్రామికంగా కూడా సిద్ధంగా ఉండేలా విద్యా, ఉపాధి మధ్య అంతరాన్ని తగ్గించాలని మేము లక్ష్యంగా పెట్టుకున్నాము.

నైపుణ్య విశ్వవిద్యాలయాల ఏర్పాటులో పెట్టుబడి పెట్టి, క్రీడా మౌలిక సదుపాయాలను పెంచడం ద్వారా పోటీ ప్రపంచంలో యువత రాణించడానికి అవసరమైన వృత్తిపరమైన నైపుణ్యాలతో వారిని సన్నద్ధం చేస్తాం. తద్వారా క్రీడలు మన సంస్కృతిలో అంతర్భాగమయ్యే టట్టుగా చేస్తాము. క్రీడారంగ సమగ్ర అభివృద్ధికి తీసుకుంటున్న ఈ చర్యలు మా నిబద్ధతకు తార్కాణం. ఈ చర్యల ద్వారా తెలంగాణలోని యువత ఆరోగ్యకరమైన, సంతృప్తికరమైన జీవనాన్ని కొనసాగించడంతోపాటు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడతారు.

వివిధ కులాలు ముఖ్యంగా వెనుకబడిన తరగతుల సామాజిక, విద్యా పరమైన, ఆర్థిక, ఉద్యోగ, రాజకీయ అవకాశాలను అంచనా వేయడానికి అవసరమైన సమాచారాన్ని సేకరించే ఉద్దేశంతో కుటుంబాలన్నింటిని సర్వే చేయడం ద్వారా మన ప్రభుత్వం కులగణన (కుల సర్వే)ను చేపట్టాలని నిర్ణయించింది.సమాజంలోని వివక్ష, అణచివేతకు గురైన అన్ని వర్గాలకు న్యాయం చేకూరుస్తాం. సంక్షేమ, అభివృద్ధి కార్యకలాపాలలో భాగంగా రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, పేదలు, ఎస్సి., ఎస్టి, బిసి, మైనారిటీలు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, అమర వీరుల కుటుంబాలు మరియు ఇతరుల అవసరాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుంది.

బడ్జెట్ ప్రక్రియ ప్రాధాన్యతను నేను చెప్పాలనుకుంటున్నాను. బడ్జెటు కేవలం ఒక ఆర్థిక పత్రం మాత్రమే కాదు, మనం కోరుకున్న ఉమ్మడి భవిష్యత్తుకి ఒక నమూనా. ఇది మన ప్రజల ఆకాంక్షలను, అవసరాలను తీర్చడానికి ప్రభుత్వ నిబద్ధతకు ప్రతీక. బడ్జెటులో వనరులను సమర్థవంతంగా కేటాయించి, ఖర్చు చేసే ప్రతి రూపాయి తెలంగాణ సంక్షేమం, పురోగతికి దోహద పడేలా చేయడాన్ని నా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

ప్రముఖ తమిళ కవి సుబ్రమణ్య భారతి మాటల్లో "విత్త నిర్వహణకు వివేక కాంతి పుంజం అవసరం". అట్టి వివేకతను కనబరుస్తూ పబ్లిక్ ఫైనాన్స్ నిర్వహణపట్ల నా ప్రభుత్వం వివేకాన్ని, సరియైన జ్ఞానాన్ని కలిగి వుంటుందని తెలియజేస్తున్నాను.

చివరిగా, మాటల కంటే చేతలు ముఖ్యం. ఇచ్చిన వాగ్దానాలు నెరవేరుతాయి, సంస్కరణలను అమలు చేస్తాం. అభివృద్ధి, సంపద సృష్టిలో నూతన శిఖరాలకు తెలంగాణ చేరుతుందని నేను విశ్వసిస్తున్నాను. ఉజ్వల తెలంగాణ సాధన దిశగా మన ప్రయాణం కొనసాగిద్దాం!

ధన్యవాదములు.

**జైహింద్ !**
**జై తెలంగాణ!!**



# మేడిగడ్డ చూడ...

**మేడిపండు చూడ మేలిమై ఉండును..**
**పొట్టవిప్పి చూడ పురుగులుండు....**
**అన్న చందంగా మారింది మేడిగడ్డ బ్యారేజీ పరిస్థితి.**

"**మేడిగడ్డ** బ్యారేజీలో రెండు, మూడు పిల్లర్లు కుంగిపోతే తప్పా అని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అంటున్నారు. బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారు. లక్ష కోట్ల రూపాయలు ఖర్చుపెట్టినా, లక్ష ఎకరాలకు కూడా నీరివ్వలేదు. కుంగింది ప్రాజెక్టు కాదు.. తెలంగాణ ప్రజల నమ్మకం" అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో పిల్లర్లు కుంగిపోవడం, దాని నిర్మాణ లోపాలను చూపించడానికి రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ నుంచి మంత్రులు, ఎం.ఎల్.ఎలు, పత్రికా విలేకరులను మేడిగడ్డకు బస్సుల్లో తీసుకెళ్ళింది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, సాగునీటి పారుదల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా వీరితోపాటు బస్సుల్లోనే మేడిగడ్డకు చేరుకున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్ పూర్ మండలంలో గోదావరిపై నిర్మించిన మేడిగడ్డ (లక్ష్మి) బ్యారేజిని మంత్రులు శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వర రావు, సీతక్క, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, అధికారపార్టీ శాసన సభ్యులు, సి.పి.ఐ శాసన సభ్యుడు కూనంనేని సాంబశివరావు, ఎం.ఐ.ఎం శాసన సభ్యులు జాఫర్ హుస్సేన్, కౌసర్ మొహియుద్దీన్, జుల్ఫికర్, ఎంఎల్సీ మీర్జా హుస్సేన్ , తదితరులు ఈ పర్యటనలో పాల్గొన్నారు. బీఆర్ఎస్, బీజేపీ శాసన సభ్యులు మినహా మిగిలిన పార్టీల శాసన సభ్యులు ఈ పర్యటనలో పాల్గొన్నారు.



ఈ బృందం మేడిగడ్డకు చేరుకోగానే, బ్యారేజీ ఎనిమిదో బ్లాక్ పక్కనుంచి అప్రోచ్ రోడ్డు ద్వారా గోదావరి నదిలోకి దిగి, బ్యారేజి ఫౌండేషన్ వద్ద దెబ్బతిన్న ఏడో బ్లాక్ లోని పిల్లర్లను పరిశీలించారు. మొదట కుంగిపోయిన 20వ పిల్లర్‌ను, నిలువునా చీలిన 21, పగుళ్ళు వచ్చిన

22వ పిల్లర్‌ను, ఫౌండేషన్ నుంచి నీళ్ళు ఉబికి వస్తున్న 18వ పిల్లర్‌ను తిలకించారు. మేడిగడ్డ ప్రాజెక్టులో కుంగిన పిల్లర్లు, బీటలు వారిన పిల్లర్లను పరిశీలించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఈ వేదికపై కాళ్ళేశ్వరం ఎత్తిపోతలు, ప్రాణహిత – చేవెళ్ళ రీడిజైన్ పై ఇంఛార్జ్ ఈఎన్సీ సుధాకర్, విజిలెన్స్ నివేదికపై డీజీ రాజీవ్ రతన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లోపాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. కాళేశ్వరంపై కేసీఆర్ అడుగడుగునా అసత్యాలే చెప్పారని ముఖ్యమంత్రి నిమర్శించారు. మొత్తం ప్రాజెక్టు పూర్తయితే, దాదాపు 20 లక్షల ఎకరాలకు నీరందే అవకాశం ఉండగా, ఇప్పటికే కోటి ఎకరాలకు నీరందిస్తున్నట్టు కేసీఆర్ గొప్పలు చెప్పుకున్నారని అన్నారు. 94 వేల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి నీరిచ్చింది మాత్రం 98,570 ఎకరాలకు మాత్రమే అని సీఎం చెప్పారు.





## వాస్తవాలు వెల్లడించడానికే – సిఎం

కాళేశ్వరం ప్రాజెక్టుపై తెలంగాణ సమాజానికి వాస్తవాలు వెల్లడించడానికే ప్రజా ప్రతినిధులు అందరితో కలసి మేడిగడ్డ ప్రాజెక్టు సందర్శన చేపట్టామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మేడిగడ్డ సందర్శనకు వెళ్ళేముందు శాసన సభ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణాను సస్యశ్యామలం చేసేందుకు 2008లో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాణహిత – చేవెళ్ళ ప్రాజెక్టు నిర్మాణానికి 38,500 కోట్ల రూపాయలతో టెండర్లు పిలిచిందని, దీనికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరుపెట్టడం జరిగిందని చెప్పారు. తుమ్మిడిహట్టి వద్ద నిర్మించాల్సిన ప్రాజెక్టును కేసీఆర్ ప్రభుత్వం రీడిజైన్ పేరిట మరోచోట కట్టిందని, కాళేశ్వరం ప్రాజెక్టు ఎంతో అద్భుతమని అమెరికాలోనూ ప్రచారం చేశారని, డిస్కవరీ ఛానల్ లో ప్రసారం చేయించారని ముఖ్యమంత్రి చెప్పారు. మొత్తం పంపులు పనిచేస్తే సంవత్సరానికి 10,500 కోట్లు విద్యుత్ బిల్లులకే కట్టాలని, బ్యాంకు రుణ వాయిదాలు, ఇతర ఖర్చులు కలిపితే ఏటా 25,000 కోట్ల రూపాయలు ఖర్చవుతాయని ముఖ్యమంత్రి తెలిపారు.

మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లలో పగుళ్ళను చూసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, వారివెంట పర్యటనకు వచ్చిన వివిధ పార్టీల శాసన సభ్యులు నివ్వెరపోయారు. ఇలాంటి ప్రాజెక్టు గురించా కేసీఆర్, బీఆర్ఎస్ నాయకులు అంత గొప్పగా చెప్పింది. ఈ ప్రాజెక్టు గురించా డిస్కవరీ వంటి ఛానెళ్ళు ప్రత్యేక కథనాలను ప్రసారం చేసింది, ఈ ప్రాజెక్టేనా తెలంగాణకు లైఫ్ లైన్ అని చెప్పుకున్నది అంటూ ఆశ్చర్యం వ్యక్తంచేశారు.

## దేశంలోనే భారీ స్కామ్– ఉత్తమ్

స్వాతంత్ర్యానంతరం దేశంలో జరిగిన కుంభకోణాల్లో కాళేశ్వరం భారీ స్కామ్ అని సాగునీటిపారుదల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. 38 వేల కోట్ల రూపాయల ప్రాజెక్టుకు రీడిజైనింగ్ పేరుతో 94 వేల కోట్ల రూపాయలు ఖర్చుచేశారని ఆయన విమర్శించారు. ఈ ప్రాజెక్టు కోసం ఇంకా 34 వేల కోట్ల రూపాయలు ఖర్చుచేయాల్సి ఉన్నదని, అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ప్రాజెక్టును కట్టారని అన్నారు. ఇది భారీ కుంభకోణం. బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకొనేలా మంత్రివర్గంలో చర్చిస్తామన్నారు. అక్టోబర్ 21న మేడిగడ్డ కుంగిపోతే కేసీఆర్ ఒక్క మాట కూడా మాట్లాడలేదని విమర్శించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అధికారులు కాళేశ్వరం ఫెయిల్యూర్ ప్రాజెక్టు అని తేల్చారని, వారి సూచనలతోనే ఈ ప్రాజెక్టుపై ముందుకు వెళ్తామని మంత్రి చెప్పారు.

## ప్రజల గుండెకు పగుళ్ళు – కూనంనేని

కాళేశ్వరం ప్రాజెక్టును ఇలా చూడటం బాధాకరంగా ఉన్నదని, ఇవి మేడిగడ్డ పగుళ్ళు కాదని, తెలంగాణ ప్రజల గుండెకు ఏర్పడిన పగుళ్ళని సీపీఐ శాసన సభ్యుడు కూనంనేని సాంబశివరావు అన్నారు. మూడేళ్ళలో నిర్మించడం కొద్ది కాలానికే కూలిపోవడం ప్రాజెక్టులో డిజైన్ లోపమే కారణమని అన్నారు. నాణ్యతా లోపంతో ప్రాజెక్టును నిర్మించి, లక్ష కోట్లను గోదావరిలో పోసినవారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



# ‘పద్మ’ అవార్డు గ్రహీతలకు ఘన సన్మానం

## పద్మశ్రీలకు 25లక్షల నగదు బహుమతి.. నెలకు 25 వేల పెన్షన్

**దేశంలో అత్యధికంగా మాట్లాడుకునే భాషలలో తెలుగు బాష రెండవ స్థానంలో ఉందని, అలాంటి మన తెలుగు వారికి ‘పద్మ’ అవార్డులు దక్కడం గర్వ కారణమని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. శిల్పకళా వేదికలో పద్మ అవార్డు గ్రహీతలకు తెలంగాణ ప్రభుత్వం తరఫున ఏర్పాటు చేసిన సన్మాన సభకు రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.**

పద్మ విభూషన్ అవార్డు గ్రహీతలు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ప్రముఖ సినీ నటుడు చిరంజీవిని, పద్మశ్రీ అవార్డు గ్రహీతలు వేలు ఆనందాచారి, దాసరి కొండప్ప, ఉమా మహేశ్వరి, గడ్డం సాంబయ్య, కేతావత్ సోంలాల్, కూరెళ్ల విఠలాచార్యలను రాష్ట్ర ప్రభుత్వం తరపున ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, కవులను, కళాకారులను గుర్తించి ప్రోత్సహించడం ప్రభుత్వాల బాధ్యత అని, అలా జరగనపుడు మన భాష, సాంప్రదాయాలు అంతరించి పోయే ప్రమాదం ఉంటుందని అన్నారు. భాష, సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందని, రాజకీయాలకు అతీతంగా అందరూ ఏకం అవ్వాలని రేవంత్ రెడ్డి అన్నారు. ఒక మంచి సంప్రదాయానికి పునాది వేసేందుకే ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని, ఈ సంప్రదాయాన్ని ఇలాగే కొనసాగించాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో పుట్టిన వారికి, వచ్చిన కళలలో రానిస్తున్న కళాకారులకు చప్పట్లు, దుప్పట్లే మిగులుతున్నాయని, వారు కనీస అవసరాలకు కూడా ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కళాకారులను ప్రోత్సహించేందుకే పద్మ అవార్డు గ్రహీతలకు సన్మాన సభ ఏర్పాటు చేశామని, ఇది రాజకీయాలకు అతీతమైన సభ అని అన్నారు.

పద్మశ్రీ అవార్డు గ్రహీతలకు 25 లక్షల రూపాయల నగదు బహుమతి, ప్రతి నెల 25 వేల రూపాయల పెన్షన్ ను ప్రభుత్వం అందిస్తుందని ముఖ్యమంత్రి ప్రకటించారు. భారత దేశంలో అత్యధిక దూరం రోడ్డు మార్గంలో ప్రయాణించి ప్రజల సమస్యలు తెలుసుకున్న ఏకైక నాయకుడు వెంకయ్య నాయుడని, అలాంటి వారు దేశ ఉప రాష్ట్రపతిగా పని చేయడం మన తెలుగు వారికి గర్వ కారణమని అన్నారు. భవిష్యత్తులో వారు రాష్ట్రపతి పదవిని కూడా చేపట్టాలని ఆకాక్షించారు.

ఒకటి రెండు సినిమాలు విజయవంతమవగానే గర్వపడే నటులు ఉన్న ఈ రోజులలో 46 సంవత్సరాలు నిర్విరామంగా 150కి పైగా సినిమాలు చేసి కూడా నిగర్విగా ఉండటం ఒక్క చిరంజీవికే చెల్లిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కితాబునిచ్చారు. కవులు, కళాకారులు, భాషా, సాంప్రదాయాలను కాపాడు కునేందుకు తమ ప్రభుత్వం ఎప్పుడూ ముందంజలో ఉంటుందని రేవంత్ రెడ్డి అన్నారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, సినీ నటుడు చిరంజీవిల చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డు గ్రహీతలకు నగదు బహుమతి 25 లక్షల రూపాయల చెక్కులను అందచేశారు.

ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సినిమాటోగ్రఫీ, రోడ్లు భవనాల శాఖల మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, కళాకారులు పాల్గొన్నారు.














PADMA AWARDEES - 2024



# కేసీఆర్ సొంత నిర్ణయాలతో రాష్ట్రాన్ని ముంచారు

## శాసనసభలో గర్జించిన సీఎం రేవంత్‌రెడ్డి



**తెలంగాణలో ప్రాజెక్టులను నిర్మించే విషయంలో తన స్వంత నిర్ణయాలతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాన్ని నట్టేటా ముంచారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. కేసీఆర్ తాను ఏర్పాటు చేసిన ఇంజనీర్లు, నిపుణుల కమిటీ చేసిన సూచనలను కూడా పరిగణనలోకి తీసుకోలేదని రేవంత్‌రెడ్డి దుయ్యబట్టారు. కేసీఆర్ చర్యల వల్ల రాష్ట్ర ప్రజలపై లక్ష కోట్ల రూపాయల భారం పడుతున్నదని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పాపాలన్నింటికీ కేసీఆర్, హరీష్‌రావులే బాధ్యత వహించాలని ఆయన స్పష్టం చేశారు.**

**శాసనసభ** సమావేశాలలో చివరిరోజు ఫిబ్రవరి 17వ తేదీన సాగునీటిపారుదల ప్రాజెక్టులపై నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శాసనసభలో శ్వేతపత్రం ప్రవేశపెట్టిన అనంతరం జరిగిన చర్చలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు.

2014 నుంచి 2018 వరకు సాగునీటిపారుదలశాఖ మంత్రిగా ఉన్న హరీష్‌రావును ఆ తరువాత ఆయన శాఖ ఎందుకు మార్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. అప్పటి ప్రభుత్వం గోదావరి ప్రాజెక్టులపై విశ్రాంత ఇంజనీర్లతో కమిటీ వేసిందని చెప్పారు. కమిటీలో బి.అనంతరాములు, వి.వెంకటరామారావు, ఎస్.చంద్రమౌళి, జి.దామోదర్‌రెడ్డి, ఎం.శ్యాంప్రసాద్‌రెడ్డి సభ్యులుగా ఉన్నారని, వారు బ్యారేజీల నిర్మాణంపై 14 పేజీల నివేదిక ఇచ్చారని వెల్లడించారు.

ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుల మీద తుమ్మిడిహెట్టి దగ్గర కాకుండా ఇతర ప్రాంతాల్లో నిర్మించడానికి అవసరమైన రీడిజైనింగ్‌కు కేసీఆర్ ఆదేశంతో పునాది పడిందన్నారు. నిపుణులు రియల్, ఫిజికల్, టోపోషీట్స్ సర్వే చేసి నివేదికలో చేర్చారని చెప్పారు. స్వయంగా వారు నియమించిన ఇంజనీర్లే తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాజెక్టు నిర్మాణానికి అన్నిరకాల ప్రయత్నాలు చేయాలని సూచించినా ఆయన పట్టించుకోలేదన్నారు. 151 మీటర్ల ఎత్తులో ప్రాజెక్టు నిర్మించేందుకు మహారాష్ట్ర సీఎంను ఒప్పించాలని కేసీఆర్‌కు నిపుణులు సూచించారని చెప్పారు. అందుకు ఒప్పుకోకపోతే 150 మీటర్లతో నిర్మించినా ఖర్చులు పెరగకుండా చూసుకోవచ్చని చెప్పారన్నారు. తెలంగాణ కోసం కొట్లాడిన ఇంజనీర్లే మేడిగడ్డ వద్ద బ్యారేజీ కట్టడం వల్ల ఉపయోగం లేదని స్వయంగా కేసీఆర్‌కు నివేదిక ఇచ్చినా పెడచెవిన పెట్టారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు.

కేసీఆర్, హరీశ్‌లు ఆ నివేదికను తొక్కిపెట్టి మేడిగడ్డ వద్ద బ్యారేజీ కడితే మేలు జరుగుతుందని చెప్పి, 38,500 కోట్ల రూపాయల ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని , లక్షా 47 వేల కోట్ల రూపాయలకు పెంచారని ఆరోపించారు. అంత ఖర్చు పెట్టినా తెలంగాణలో పచ్చని పంట పండి ఉంటే బాగుండేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ సమాజానికి కళంకంగా మారిందని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తీసుకుంటున్న నిర్ణయాలు తెలంగాణ సమాజానికి మేలు చేయడం లేదనే అభిప్రాయంతో ఎన్నో ఒడిదుడుకుల్ని ఎదుర్కొని తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చారని ముఖ్యమంత్రి అన్నారు. కానీ తెలంగాణలోనే ప్రజలు ఇబ్బందులపాలయ్యేలా గత పాలకులు ప్రవర్తించారన్నారు.

విజిలెన్స్, కాగ్ నివేదికలను కూడా తప్పనే స్థాయికి దిగజారారని వ్యాఖ్యానించారు. చివరికి కేసీఆర్ వేసిన కమిటీ నివేదికను కూడా తప్పంటారా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా జరిగిన తప్పులకు హరీశ్ క్షమాపణలు కోరాలన్నారు. సిట్టింగ్ జడ్జి లేదా విశ్రాంత జడ్జి విచారణకు వచ్చినప్పుడు ఎవరి ఒత్తిడి వల్ల ఇలాంటి తప్పిదాలకు సంతకం పెట్టారో వివరించాలని డిమాండ్ చేశారు.

నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ... కృష్ణా నదీ జలాల్లో తెలంగాణకు న్యాయబద్ధంగా రావాల్సిన వాటాను సాధించటంలో గత ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. పరీవాహక ప్రాంతానికి అనుగుణంగా నీటి వాటా కోసం పట్టు పట్టకుండా ఏపీకి 512 టీఎంసీలు ఇవ్వడానికి అంగీకరించిందన్నారు. ఫలితంగా దక్షిణ తెలంగాణలోని ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాల రైతులకు తీరని అన్యాయం జరిగిందన్నారు.



న్యాయబద్ధంగా తెలంగాణకు దక్కాల్సిన 555 టీఎంసీల( 68.5 శాతం) నీటిని తెచ్చుకోవాలనే సోయే ఆ ప్రభుత్వానికి లేకుండా పోయిందని దుయ్యబట్టారు. కృష్ణా, గోదావరి బోర్డుల ఏర్పాటు గెజిట్ నోటిఫికేషన్‌కు కూడా కేసీఆర్ అంగీకరించారని, శ్రీశైలం, నాగార్జునసాగర్ ఉమ్మడి ప్రాజెక్టుల నిర్వహణను కేంద్రానికి అప్పగించేందుకు ఫైళ్లు కదిపారని సభకు తెలిపారు.

2020లో పోతిరెడ్డిపాడు కెపాసిటీ 80 వేల క్యూసెక్కులకు పెంచటంతోపాటు పక్కనే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ నిర్మాణానికి ఏపీ ప్రభుత్వం జీవో జారీచేస్తే ప్రేక్షక పాత్ర పోషించారన్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు కూడా చేయలేదని, మహబూబ్‌నగర్‌కు చెందిన ఒక రైతు ట్రైబ్యునల్‌ను ఆశ్రయించి స్టే తెచ్చేంతవరకు అప్పటి ప్రభుత్వం మొద్దు నిద్ర పోయిందని ఆరోపించారు. స్వరాష్ట్రంలోనైనా నీళ్ల దోపిడీ ఆగుతుందని ప్రజలు ఆశించగా.. గత పదేళ్లలో ఏకంగా నాలుగింతలు పెరిగిపోయిందని, పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి రూ. 27,812 కోట్లు ఖర్చు పెట్టినా.. ఒక్క ఎకరా కొత్త ఆయకట్టును సాగులోకి తీసుకురాలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు టీఎంసీల నీటిని ఎత్తిపోసేందుకు చేపట్టిన ఈ ప్రాజెక్టును అకారణంగా ఒక్క టీఎంసీకి కుదించారని, సీతారామ, సీతమ్మ సాగర్ విషయంలోనూ ఇలాగే జరిగిందని మంత్రి ఉత్తమ్ ఆరోపించారు.

డిండి, ఎస్ఎల్‌బీసీ, ఆర్డీఎస్‌ను పూర్తిగా పక్కన పెట్టారన్నారు. గత ప్రభుత్వ నిర్వాకం కారణంగా పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టుల భవితవ్యం ప్రమాదంలో పడిందన్నారు. కాళేశ్వరం సహా ప్రాజెక్టుల పేరుతో కేసీఆర్ ప్రభుత్వం చేసిన అవినీతి... రాష్ట్రానికి శాపంగా మారిందని ఆరోపించారు. ఈ వ్యవహారం మొత్తాన్ని ఎన్‌డీఎస్‌కు అప్పజెప్పి, కూలంకషంగా నివేదిక ఇవ్వాలని అడుగుతామని, ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలపై కాగ్, ఎన్‌డీఎస్‌ఏ, విజిలెన్స్ ఇచ్చిన నివేదికల మేరకు అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు.

## అప్పుడు దేవాలయమైంది..ఇప్పుడు బొందలగడ్డ ఎందుకైంది,,?



కాళేశ్వరం ప్రాజెక్టును దేవాలయంగా పొగిడిన కేసీఆర్ అప్పుడే మేడిగడ్డను బొందలగడ్డగా సంబోధించడం ఎందుకో చెప్పాలని రెవిన్యూ, గృహనిర్మాణం, సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. మేడిగడ్డ బొందలగడ్డ ఎందుకు అయ్యిందో కేసిఆరే చెప్పాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభం నుంచి కుంగిపోయేవరకు కేసిఆరే ఉన్నారని, మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టుకు తానే రూపశిల్పి అని కేసిఆర్ ఎన్నోసార్లు చెప్పుకున్నారని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. భారీ ప్రాజెక్టుల రూపశిల్పి ఇప్పుడు సభకు వచ్చి ఎందుకు వివరణ ఇవ్వడంలేదని దుయ్యబట్టారు.

కాళేశ్వరం అంటే బ్యారేజీలు, రిజర్వాయర్లు, సబ్‌స్టేషన్లు, పంప్ హౌస్‌లు, కిలోమీటర్ల సొరంగాలు అని చెప్పేవాళ్లకు ఒకటే చెప్పదలుచుకున్నామని, కాళేశ్వరం అనే సమాహారానికి బేస్ ఎక్కడ? అని ఒకసారి ఆలోచించుకోండని సూచించారు. ఈ ప్రాజెక్టుకు పునాది మేడిగడ్డ అనే విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. మేడిగడ్డలో పిల్లర్లు కుంగిపోయాయని, దీని తర్వాత అన్నారం బ్యారేజీలో బుడగలు వస్తున్నాయని తెలిపారు. ఆ తర్వాత ఉన్న సుందిళ్ల బ్యారేజీలో సిపేజ్ మొదలైందని, పరిస్థితి ఇలా ఉంటే ప్రభుత్వం నీళ్లు ఇవ్వడం లేదని తమపై నిందలు మోపుతున్నారని పేర్కొన్నారు. తాను ఉంటే గోదావరి నుంచి నీళ్లు ఎత్తిపోసి ఇచ్చేవాడినని, ఈ ప్రభుత్వానికి చేత కావడం లేదని నల్గొండ సభలో ప్రతిపక్ష నేత కేసీఆర్ చెప్పడం హాస్యాస్పదమని విమర్శించారు. గతేడాది నవంబర్‌లో మేడిగడ్డ పిల్లర్లు కుంగిపోయాయని, అప్పటినుంచి డిసెంబర్ 6 తేదీ వరకు కేసిఆర్ అపధర్మ ముఖ్యమంత్రిగా 46 రోజులపాటు ఉన్నారని అన్నారు. ఈ 46 రోజుల్లో ఆయన ఎన్ని నీళ్లు ఎత్తిపోసి రిజర్వాయర్లు నింపారో చెప్పాలని, అప్పుడు ఎందుకు నీళ్లు ఎత్తిపోయలేదని ప్రశ్నించారు.

ఇంకా ఈ చర్చలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ళ శ్రీధర్‌బాబులు మాట్లాడుతూ తెలంగాణ ప్రజలపై లక్ష కోట్ల భారం మోపింది కేసీఆర్ ప్రభుత్వమని దుయ్యబట్టారు. కేవలం పర్సంటేజీల కోసం కాళేశ్వరం నిర్మించారని, నాణ్యతను పట్టించుకోలేదని, ప్రాజెక్టుల నిర్మాణంలో అంతులేని అవినీతి జరిగిందని వారు ఆరోపించారు. మొత్తంగా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వహణలో గత ప్రభుత్వ అవకతవకలు, అవినీతి, బాధ్యతారాహిత్యాన్ని ఎత్తి చూపడంలో ప్రభుత్వం సఫలమైందని చెప్పవచ్చు.

ప్రతిపక్షాల విమర్శలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు ధీటుగా సమాధానమిచ్చారు. గత ప్రభుత్వ కాలంలో సాగునీటి రంగంలో జరిగిన అవకతవకలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాసనసభలో ఎమ్మెల్యేలకు అర్థమయ్యే రీతిలో, రాష్ట్ర ప్రజలకు పూర్తి వివరాలు తెలిసే విధంగా వివరించడంలో విజయం సాధించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావులు సాగునీటిరంగ నిపుణులు, ఇంజనీర్లు ఇచ్చిన నివేదికలను కూడా ఏ విధంగా తుంగలో తొక్కారు, రాష్ట్ర ప్రజలపై లక్ష కోట్ల రూపాయలను ఎలా భారం మోపారు. తదితర విషయాలను ముఖ్యమంత్రి, మంత్రులు విషదీకరించారు. గత ప్రభుత్వ బండారం బయట పెట్టడంలో కృతకృత్యులయ్యారు.



# అమ్మల దర్శనానికి పోటెత్తిన భక్త జనం

## కోటి నలభై లక్షల మంది భక్తుల హాజరు



- కన్నెకంటి వెంకటరమణ

**దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరుగాంచిన మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర అత్యంత వైభవంగా , ఏవిధమైన అవాంచనీయ సంఘటనలు లేకుండా విజయవంతంగా ముగిసింది. ఈ మేడారం జాతరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.110 కోట్లను విడుదల చేసింది. రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖల ప్రత్యక్ష పర్యవేక్షణలో నాలుగు రోజుల పాటు జరిగిన ఈ మేడారం జాతరకు ఈసారి రికార్డు సంఖ్యలో కోటి నలభై లక్షల మంది భక్తులు హాజరయ్యారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సహా కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండా, కేంద్ర పర్యాటక శాఖా మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర గవర్నర్ తమిళసై సౌందర రాజన్, పలువురు రాష్ట్ర మంత్రులు, ప్రముఖులు హాజరై సమ్మక్క, సారలమ్మలకు మొక్కులు సమర్పించుకున్నారు.**

**ఫిబ్రవరి 21వ** తేదీన కన్నెపల్లి నుండి సారలమ్మ మేడారం గద్దెలపైకి రావడంతో ప్రారంభమైన ఈ మహా జాతరలో 22న చిలకల గుట్ట నుండి సమ్మక్క గద్దెలపైకి వచ్చింది. 23న గద్దెలపై సమ్మక్క సారలమ్మలు, పగిడిద్ద రాజు, గోవింద రాజులు ఉండడంతో పూర్తి స్థాయి జాతర జరిగింది. 24వ తేదీన తిరిగి అమ్మవార్లు వనప్రవేశం చేయడంతో నాలుగు రోజులపాటు జరిగిన ఈ మహాజాతర ముగిసింది. మొదటి నుండి రాష్ట్ర ప్రభుత్వం ఈ జాతర నిర్వహణను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని నలుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులను







ప్రత్యేకంగా నియమించింది. ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్.ఐ. సంగ్రామ్ సింగ్ (చెక్)ల నేతృత్వంలో పకడ్బందీ ప్రణాళికతో ఈ జాతరలో ఏ ఒక్క చిన్న అవాంఛనీయ సంఘటన జరగలేదు. రెండేళ్లకు ఒకసారి జరిగే ఈ జాతరకు శాశ్వత ఏర్పాట్లు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు.

అమ్మవారి కుంకుమ భరిణె అంత పవిత్రంగా తెలంగాణ రాష్ట్రాన్ని, రాష్ట్ర ప్రజలను పొత్తిళ్ళలో పెట్టుకుని కాపాడుకుంటాం. జాతరను విజయవంతం చేయడంలో సహకరించిన ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసులు, దేవాదాయ శాఖ, శానిటేషన్ సిబ్బంది, ఇతర శాఖలకు చెందిన ప్రతి ఉద్యోగికి, సిబ్బందికి మంత్రి కొండా సురేఖ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

అమ్మవారి కుంకుమ భరిణె అంత పవిత్రంగా తెలంగాణ రాష్ట్రాన్ని, రాష్ట్ర ప్రజలను పొత్తిళ్ళలో పెట్టుకుని కాపాడుకుంటామని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు కొండా సురేఖ అన్నారు. మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరను భక్తులు అనుక్షణం ఆస్వాదించేలా, జాతరను విజయవంతంగా నిర్వహించడంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికి మంత్రి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. జాతర ఏర్పాట్లు, నిర్వహణలో అన్ని శాఖలు పరస్పర సహకారంతో, సమన్వయంతో వ్యవహరించి, చిత్త శుద్ధిని కనబరచి ఈ మహా జాతరను దిగ్విజయవంతంగా పూర్తి చేసాయని మంత్రి అన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు జాతర పనులను ముందు నుండే ప్రణాళికాబద్ధంగా చేపట్టడంతో భక్తులు అమ్మవార్లను ప్రశాంతంగా దర్శించుకొని, మొక్కులు చెల్లించుకొని, సంతృప్తితో తిరుగు ప్రయాణమయ్యారని మంత్రి వెల్లడించారు. ప్రభుత్వం భక్తులకు అడుగడుగునా అన్ని వసతులను కల్పించేందుకు శాయశక్తులా ప్రయత్నం చేసిందని మంత్రి స్పష్టం చేశారు. కోట్లాదిగా పోటెత్తిన ఈ మహాజాతరలో తెలిసీ తెలియక భక్తులు ఏమైనా ఇబ్బందులకు గురైతే పెద్ద మనసుతో క్షమించాలని మంత్రి విన్నవించారు.

దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రిగా మొదటిసారి మేడారం జాతర నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతను పూర్తి నిష్ఠతో చేపట్టినట్లు మంత్రి తెలిపారు. అమ్మవారి దయతో అనారోగ్యాన్ని జయించి, త్వరగా కోలుకొని అమ్మవార్లు గద్దెలకు చేరుకున్నాక దర్శించుకునే భాగ్యం కలిగిందని మంత్రి అన్నారు. సమ్మక్క సారలమ్మల దయ తెలంగాణ ప్రజల పై సదా వుండాలని ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ ఆకాంక్షించారు.




# మేడారం అభివృద్ధికి మంత్రుల కమిటి

## సమ్మక్క-సారలమ్మలను దర్శించుకున్న సిఎం

**మేడారం ప్రాంతం సమగ్రాభివృద్ధికి శాశ్వత చర్యలు తీసుకునేందుకు త్వరలో మంత్రుల కమిటి ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. మంత్రులు దనసరి అనసూయ (సీతక్క), కొండా సురేఖలతో కలిసి మేడారం ప్రాంతాన్ని అభివృద్ధిపరిచే బాధ్యతను తీసుకుంటానని, తానే స్వయంగా అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తానని రేవంత్‌రెడ్డి చెప్పారు.**



**ముఖ్యమంత్రి** హోదాలో తొలిసారిగా మేడారం సందర్శించి, అక్కడ సమ్మక్క-సారలమ్మలకు రేవంత్‌రెడ్డి మొక్కులు చెల్లించుకున్నారు. నిలువెత్తు బంగారం (బెల్లం), పసుపు, కుంకుమ, గాజులు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మేడారంలో విలేకరులతో మాట్లాడారు.

రాష్ట్రంలో ఉన్న ప్రజా సమస్యలను పరిశీలిస్తూ, పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నామని, ఆరు గ్యారంటీల అమలులో భాగంగా ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్య పరిమితి 5 లక్షల రూపాయల నుంచి 10 లక్షల రూపాయలకు పెంచామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రైతులకు ఇచ్చిన వాగ్దానం 2 లక్షల రూపాయల రుణమాఫీపై బ్యాంకులతో చర్చిస్తున్నామని, త్వరలోనే రైతులకు మంచి శుభవార్త చెప్పబోతున్నామని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతిహామీని అమలు చేస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

అధికారంలోకి వచ్చిన 60 రోజుల్లోనే 25 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, 6,956 మంది స్టాఫ్ నర్సుల నియామకం, 441 సింగరేణి ఉద్యోగులు, 15 వేల పోలీసు, ఫైర్ డిపార్టుమెంట్ ఉద్యోగాలు భర్తీ చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. మార్చి 2వ తేదీన మరో 6వేల పైచిలుకు ఉద్యోగాలు భర్తీ చేయబోతు న్నామన్నారు. మొత్తంగా ఇచ్చిన మాట ప్రకారం రెండు



లక్షల ఖాళీలు భర్తీ చేస్తామని స్పష్టం చేశారు. దానికి తగినట్లు 25 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో యువకులకు ఉద్యోగాలు కల్పించేందుకు పది స్కిల్ యూనివర్సిటీలు ఏర్పాటు చేస్తున్నామని సిఎం రేవంత్ తెలిపారు.

### జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తాం

తాము అధికారంలోకి వచ్చి వంద రోజులు కూడా పూర్తి కాలేదని, జర్నలిస్టులు తొందరపడ వద్దని, త్వరలోనే జర్నలిస్టుల అన్ని సమస్యలు పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జర్నలిస్టులకు హామీ ఇచ్చారు. ప్రభుత్వాన్ని తేవడంతోనే జర్నలిస్టుల పని అయిపోలేదని, ప్రభుత్వానికి అన్ని విధాలుగా చేయూతనందించి, రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించడానికి సహకరించాలని కోరారు.

### తల్లుల ఆశీస్సులతో

సమ్మక్క–సారలమ్మ తల్లుల ఆశీస్సులతో, ఆశీర్వాదంతో తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో మంచి వర్షాలు పడి పాడిపంటలతో ప్రజలు విలసిల్లాలని, తెలంగాణలోని నాలుగు కోట్ల ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని సమ్మక్క సారలమ్మను వేడుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ ప్రాంతంలో తాను, మంత్రి సీతక్క ఏ కార్యక్రమం తీసుకున్నా సమ్మక్క–సారలమ్మ ఆశీస్సులు తీసుకొనే మొదలు పెడతామన్నారు. దక్షిణ కుంభమేళాలాంటి ఈ జాతరకు కోటిన్నర మంది భక్తులు వస్తున్నా కేంద్ర ప్రభుత్వం దీనిని జాతీయ పండగగా గుర్తించడం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం



చేశారు. మేడారం జాతరను జాతీయ పండగగా గుర్తించాలని తాము ఎన్ని సార్లు కోరినా అలా కుదరదని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డి అంటున్నారని ముఖ్యమంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఉత్తర భారతం, దక్షిణ భారతం అనే వివక్ష చూపడం సరికాదని ముఖ్యమంత్రి హితవు పలికారు. దక్షిణ భారతమనే కాదు ప్రపంచంలోనే సమ్మక్క–సారలమ్మ జాతరకు ఒక గుర్తింపు ఉందని, వారి వీరోచిత పోరాటానికి చరిత్ర పుటల్లో స్థానం ఉన్నందున కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయొద్దని విజ్ఞప్తి చేశారు. గతేడాది ఫిబ్రవరి ఆరో తేదీన తాము ప్రారంభించిన యాత్ర విజయవంతమై ఈ రోజు అధికారంలోకి వచ్చి అధికారికంగా జాతరను నిర్వహించామన్నారు. విలేకరుల సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, సీతక్క, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిలతో పాటు ఉన్నతాధికారులు, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.



# జాతిరత్నం

గన్నమరాజు గిరిజామనోహర బాబు



పి.వి.కి "భారత రత్న" ప్రకటించిన సందర్భంగా

## "నరత్నమన్విష్యతి మృత్యతేహితత్"

**ఇది మహాకవి కాళిదాసు మాట! మేలిమి రత్నం ఎప్పుడూ ఇతరులచేత అన్వేషింపబడుతుంది తప్ప అది ఎప్పుడూ ఎవ్వరినీ అన్వేషించదు. ఈ మాట ఇప్పుడు సరిగ్గా మనపూర్వ ప్రధాన మంత్రి, మహామేధావి, గొప్ప దార్శనికుడు, బహుబాషావేత్త, కీ.శే. పి.వి. నరసింహారావుగా ప్రసిద్ధి చెందిన పాములపర్తి వేంకట నరసింహారావుకి నూటికి నూరుపాళ్ళు అన్వయిస్తుంది.**

**ఇటీవలే** మన భారత ప్రభుత్వం వారిని "భారతరత్న"గా భూషించింది. నిజంగా పి.వి. ఈ జాతి తల ఎత్తుకొని తిరిగే రీతిలో మన దేశాన్ని, దాని గమనాన్ని మార్చిన జాతిరత్నం వంటి మహా మనీషి. ఒకానొక క్లిష్టదశలో చిక్కుకున్న ఈ భారతావనిని కష్టదశ తప్పించి నిలబెట్టిన మహానుభావుడు, అపర చాణక్యుడుగా పేరెన్నికగన్న మేధావి. మహా సహస్రావధాని, సుప్రసిద్ధ పండితులు మాడుగుల నాగఫణి శర్మ సహస్రావధానం చేస్తున్న సందర్భంలో ప్రముఖ సాహితీ వేత్తగా నాటి ప్రధాని పివి నరసింహారావు విచ్చేసినప్పుడు ఆశువుగా వారిని గురించి చెప్పిన

> "పెదవిన్ విప్పడు, ఎవ్వరేమియనినన్ పేర్మిన్ విలోకించు, ఏ
> పదవిన్ గోరడు, తానుగా వలచినన్ భద్రంబుగా జూచు, తాన్
> పదునాల్గైన సుభాషలన్ చదివి శబ్దప్రౌఢ నిశ్శబ్దుడౌ,
> ఒదవున్ మేరువు అద్దమందువలె ఓహో! పీవి ఠీవిన్ భువిన్"

పద్యం ఆ మహనీయుని సంపూర్ణ వ్యక్తిత్వాన్ని ఆవిష్కరిస్తూ ఉంది. ఆ వ్యక్తిత్వపు మహోన్నత స్థాయే వారిని "భారత రత్న"ను గావించింది. అనవసరమైన మాటలు మాట్లాడక పోవడం, అంటే గుంభనంగా ఉండి ఏ పనుల్త్నెనా, ఎంతటి పనుల్త్నెనా సాధించే తత్త్వం అంత సులభంకాదు, అందరికీ సాధ్యపడదు. ఆ విషయంలో "పెదవి దాటితే పృథ్వి దాటుతుంద"న్న మాటను బాగా అర్థం చేసుకున్న పి.వి అనవసరంగా పెదవి విప్పి ఒక్క మాటకూడా మాట్లాడకపోవడంలోనే వారి విజ్ఞత ఎంతటిదో అర్థమౌతుంది. 'మౌనస్వామి' అంటూ ఎవ్వరెన్ని విధాలుగా పిలిచినా చలించని ధీరుడు. తమ స్థిర చిత్తతయే వారిని మితభాషిని చేసిందనుకోవచ్చు. దానివల్ల అనేక సమస్యలు పరిష్కారమైన విషయం అందరికీ తెలిసిన సత్యమే. ఎవరెంతగా తూలనాడినా, విమర్శించినా తమదైన ఋజుమార్గంలోనే సాగడం వల్ల తలపెట్టిన అన్ని పనులు సాధించగలిగిన సాహసి మన పివి. వారి దృఢ సంకల్పమే ముఖ్యమంత్రిగా భూ సంస్కరణలకు శ్రీకారం చుట్టేటట్టు చేసింది. దేశానికి ఆర్థిక సంస్కరణల దిశగా నడిపించింది. ఎదుటివాళ్ళ ఆలోచనలకు తలయొగ్గే వ్యక్తిగాక వారి మాటలను విన్నా, తాము తీసుకున్న నిర్ణయంపైనే నిలిచి విజయం సాధించిన మహాదార్శనికుడు పివి నరసింహారావు. పదవీ వ్యామోహమన్నది వారి రక్తంలోనే లేదు. కాని ఏ పదవియైనా తప్పని సరిగా అధిష్టించవలసి వచ్చినప్పుడు, దాన్ని ఎంతో సమర్థంగా, జాతి ప్రయోజనాలే ప్రథమ లక్ష్యంగా, మిక్కిలి బాధ్యతతో నిర్వహించిన కర్తవ్య నిష్ఠుడు మన పివి. ఆ విషయం మన దేశంలోనే కాదు, విదేశాలలో వారికి కూడా స్పష్టంగా తెలిసిన సత్యం. నాటి ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి బాధ్యతలను అప్పజెప్పినప్పుడు దానిని నిర్వహించడంలో వారు చూపిన గొప్ప సంస్కరణ దృక్పథాన్ని, వారి సమర్థతను గుర్తించిన ప్రధాని కొన్ని పరిస్థితుల కారణంగా వారిని ముఖ్యమంత్రి బాధ్యతల నుండి తప్పించి వారి సమర్థతకు తగిన కేంద్ర మంత్రి బాధ్యతలను అప్పజెప్పడమే వారి నిర్వహణాబాధ్యతకు గీటురాయి. వారికి అప్పగించిన అన్ని శాఖలను ఎంతో సమర్థతతో నిర్వహించి దేశ విదేశాలలో మన భారత ప్రభుత్వపు కీర్తికి వన్నెతెచ్చిన అతి సమర్థులు పి.వి. నరసింహారావు.

ఒకానొక విపత్కర పరిస్థితుల్లో హత్యకు గురియైన నాటి భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ తదనంతరం ప్రధాని పదవిని చేబట్టవలసివచ్చినప్పుడు కూడా, తగినంత బలం లేదనిగాని, ప్రభుత్వం నడపలేనని గానీ ఏమాత్రం వెనుకంజ వేయకుండా ప్రధాని పదవిని చేపట్టి మైనారిటీ ప్రభుత్వాన్ని కూడా ఐదు సంవత్సరాల పూర్తి కాలాన్ని విజ్ఞతతో పదవి నిర్వహించి పూర్తి చేశారు. అనేక ఆర్థికపు ఆటుపోట్లకు దేశం గురికాకుండా పలు ఆర్థిక సంస్కరణలను చేపట్టి దేశాన్ని సురక్షిత మార్గంలో నడిపించారు. మన్మోహన్ సింగ్ వంటి గొప్ప ఆర్థిక శాస్త్రవేత్తను దేశానికి సమర్పించి మన ఆర్థిక

# ఆనందం ఉప్పొంగే క్షణాలు: సిఎం



**దేశానికి** ప్రధానిగా ఎనలేని సేవలందించిన తెలుగు బిడ్డ, తెలంగాణ బిడ్డ పాములపర్తి వెంకట నరసింహారావుకు దేశంలోనే అత్యున్నతపురస్కారం భారతరత్న దక్కడం దేశప్రజలందరికీ గర్వకారణమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శాసనసభలో హర్షం వ్యక్తం చేశారు. ఆర్థిక సంస్కరణలు తెచ్చి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన గొప్ప వ్యక్తి పీవీ అని, పీవీ నరసింహారావుకి భారత రత్న ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు. కొంచెం ఆలస్యమైనా వారికి ఈ గౌరవం దక్కడం గర్వకారణమన్నారు. తన తరవున, సభ తరవున, తెలంగాణ ప్రజల తరవున పీవీ కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇది మనందరికీ గర్వకారణమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలుగుజాతి కీర్తి ప్రతిష్ఠలను ఆకాశమంత ఎత్తున ఎగరేసిన మన తెలంగాణ బిడ్డ, మాజీ ప్రధాని, ఆర్థిక మేధావి, బహుభాషా కోవిదుడు పీవీ నర్సింహారావుకి భారతరత్న దక్కడం గర్వించదగ్గ విషయమని, తెలంగాణ బిడ్డలుగా మనందరి గుండెల్లో ఆనందం ఉప్పొంగే క్షణమని ముఖ్యమంత్రి అన్నారు. అలాగే, మాజీ ప్రధాని చరణ్ సింగ్, ఎల్. కె. అద్వానీ, కర్పూరీ ఠాకూర్, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్‌లకు కూడా భారతరత్న రావడం సంతోషకరమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తంచేశారు.

కుప్పకూల బోతున్న భారత ఆర్థిక వ్యవస్థను తన ఆర్థిక సంస్కరణలు, ప్రపంచీకరణ ద్వారా ప్రపంచంలోనే ఆర్థికంగా బలమైన దేశంగా భారత్‌ను రూపొందించడంలో మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహారావు తన తుదిశ్వాస వరకు శ్రమించారని, పీవీ వేసిన ఆర్థిక సంస్కరణల పునాదుల ఫలితంగానే నేడు భారతదేశం ప్రపంచంలోనే ఆర్థికంగా నాలుగవ బలవంతమైన దేశంగా రూపుదిద్దుకుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

అలాగే, ప్రపంచంలోనే అధిక జనాభా కలిగిన ఈ దేశవాసుల ఆకలి తీర్చేందుకు తన జీవితాంతం కృషిచేసిన ఎం.ఎస్.స్వామినాథన్ కు కూడా భారతరత్న దక్కడం హర్షణీయమన్నారు. రైతు సమస్యలపై ఈ దేశంలో మొదటిసారి గళం విప్పి పోరాడి, రైతుల విజేతగా నిలిచిన మాజీ ప్రధాని చరణ్ సింగ్‌కు భారతరత్న దక్కడం శుభపరిణామం. ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానమంత్రిగా ఈ దేశానికి చరణ్ సింగ్ గణనీయమైన సేవలు అందించారని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. చరణ్ సింగ్‌కి భారతరత్న దక్కడం విలువలు గల, రైతు పక్షపాతిగా పోరాడే నాయకులకు స్ఫూర్తినిస్తుందన్నారు.

మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహారావుకు భారతరత్న అవార్డు ప్రకటించడం హర్షించదగిన విషయమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాలు శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. తెలుగు జాతి ముద్దుబిడ్డ, బహుభాషా కోవిదుడైన పీవీ నరసింహారావు ప్రధానిగా దేశానికి అందించిన సేవలు మరువలేనివని, ఆర్థిక సంస్కరణల తో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిన ఘనత పీవీకే దక్కిందని మంత్రి పొంగులేటి హర్షం వ్యక్తం చేశారు.

భారత మాజీ ప్రధాని, ఆర్థిక సంస్కరణల పితామహుడు, తెలంగాణ ముద్దుబిడ్డ పాములపర్తి వెంకట నరసింహారావుకు భారత ప్రభుత్వం దేశ అత్యున్నత పురస్కారం భారతరత్నను ప్రకటించడం పట్ల అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ హర్షం వ్యక్తం చేశారు. పీవీకి భారతరత్న అవార్డు దక్కడం యావత్ తెలంగాణ జాతికి గర్వకారణమని అన్నారు.

ఇబ్బందులను తొలగించగలిగారు. దేశానికి అవసరమైన అణుశక్తి సామర్థ్యానికి అనుగుణంగా అడుగులు వేసి రాబోయే పాలకులకు కొత్త దారులు చూపారు. నిర్ణయాలను తీసుకోవడంలో ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని తీసుకోవడంవల్ల భవిష్యత్పాలకులకు దేశ పటిష్ఠతకు కావలసిన భూమిక ఏర్పడింది. ఇది వారి దార్శనికతకు నిదర్శనం. అందుకే మాడుగుల వారన్నట్లు "తానుగా వలచినన్ భద్రంబుగా జూచు"నన్న మాటలు పి.వి. విషయంలో అక్షర సత్యాలే. కీ.శే. పి.వి. నరసింహారావు మరో పార్శ్వం అక్షరయానం. జీవించినంతకాలం వివిధ భాషలను అభ్యసించడం, అపార సాహిత్యం అధ్యయనం చెయ్యడం, రచనలు చెయ్యడం వంటి అనేక విధాలుగా అక్షరార్చన చేసిన అక్షర మూర్తులు పివి నరసింహారావు, అత్యాధునిక శాస్త్రాలలో ఒకటైన కంప్యూటర్ పరిజ్ఞానాన్ని కూడా సాధించుకున్న అరుదైన విద్వన్మణి నరసింహారావు.

విశ్వనాథ "వేయిపడగలు" నవలను హిందీలో "సహస్రఫణ్"గా అనువదించి ఘనమైన పురస్కారాలను అందుకోవడమేగాక, తెలంగాణ పోరాటకాలపు కథలను రచించిన గొప్ప రచయిత. వారి రచనలతో నాటి "కాకతీయ" పత్రిక సుసంపన్నమై "గొల్లరామవ్వ" కథ వంటి అపురూపమైన కథలను అందించింది. సంగీతంలోనూ లోతైన అభినివేశం ఉన్న పివి రూపెత్తిన సరస్వతీ మాతగా మనం భావించవచ్చు.

ఇంతటి మహామేధావి గనుకనే, అంతటి సమర్థ నాయకుడు గనుకనే మన భారత ప్రభుత్వం వారిని "భారత రత్న"గా సంభావించింది.



# రెండు లక్షల ఖాళీలు భర్తీచేసి తీరుతాం

## పోలీస్ నియామకపత్రాలు అందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**రాబోయే రోజుల్లో రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని, ఉద్యోగ నియామకాలలో తప్పిదాలకు తావులేకుండా, ఎవరికీ నష్టం లేకుండా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. టి.ఎస్.పి.ఎస్.సిలో గతంలో జరిగిన అక్రమాలను నిలువరిస్తాం. పదేళ్ళుగా గ్రూప్ 1 పరీక్ష నిర్వహించలేదు.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే 567 పోస్టుల భర్తీ ప్రక్రియ మొదలు పెట్టాం. నిరుద్యోగులకు నష్టం జరగకుండా వయోపరిమితిని 44 ఏళ్ళ నుంచి 46 ఏళ్ళకు పెంచాం. అని ముఖ్యమంత్రి చెప్పారు.**

**తెలంగాణ** పోలీస్ నియామకమండలి ద్వారా కానిస్టేబుల్, తత్సమానమైన ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఎల్.బి.స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో నియామకపత్రాలను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ, పంజాబ్ లో యువత గంజాయి, డ్రగ్స్ తో నిర్వీర్యమైపోతోంది. ఆ పరిస్థితి తెలంగాణలో రాకుండా టి.ఎస్. న్యాట్ విభాగాన్ని ఏర్పాటుచేసి పటిష్టం చేస్తున్నాం. పోలీస్ శాఖలో కొత్తగా భర్తీ అవుతున్నవారు కూడా తెలంగాణను గంజాయి, మత్తుపదార్థాలు లేని రాష్ట్రంగా మార్చుతామని ప్రతిన బూనాలి. రాష్ట్రంలో డ్రగ్స్ వాడాలంటే వణుకుపుట్టే పరిస్థితి రావాలని ముఖ్యమంత్రి అన్నారు. నియామక పత్రాలు అందుకున్నవారిలో పోలీసు, ఆబ్కారీ, జైళ్ళు, అగ్నిమాపక, రవాణాశాఖల్లో ఉద్యోగాలు సాధించినవారు ఉన్నారు.

“ కేవలం రెండు నెలల్లోనే మా ప్రభుత్వం సాధించిన విజయాల్లో ఇది ఒకటి. 22 నెలలుగా పెండింగ్‌లో ఉన్న పోలీస్ ఉద్యోగాలకు న్యాయ పరమైన సమస్యలను పరిష్కరించి 13,445 నియామకాలకు మార్గం సుగమంచేశాం. రాబోయే రోజుల్లో రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టడం ద్వారా నిరుద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటాం” అని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడితే తమకు ఉద్యోగాలొస్తాయన్న ఆశతో యువత పోరాడి, రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించారు. కానీ, తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కేసీఆర్ నిరుద్యోగుల ఆకాంక్షలను పక్కన పెట్టారన్నారు. తనకు కుటుంబం అంటే నాలుగుకోట్ల ప్రజలేనని, వారికోసం 24 గంటలూ పనిచేస్తానని ముఖ్యమంత్రి అన్నారు.

గత ప్రభుత్వంలో పోటీపరీక్షల ప్రశ్నపత్రాలను పల్లీలు, బఠానీలులాగా అంగట్లో అమ్ముకున్నారని, అందుకే పబ్లిక్ సర్వీస్ కమిషన్ పాలకవర్గాన్ని తొలగించి, కొత్తవారిని నియమించామని ముఖ్యమంత్రి తెలిపారు. గత పదేళ్ళలో చేయలేని గ్రూప్ -1 నియామకాన్నిచేపట్టి 567 ద్యోగాల భర్తీ ప్రక్రియను ప్రారంభించామని చెప్పారు. శాఖల వారీగా సమీక్షించి, కేసులు పరిష్కరించి, నియామకాలు చేపడుతున్నామని, గత ప్రభుత్వం వేసిన చిక్కుముడులను ఒక్కొక్కటిగా విప్పుతున్నాం. వరుసగా నియామకాలు పూర్తిచేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

బి.సి సంక్షేమం, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ తొలుత మాట్లాడుతూ, కాంగ్రెస్ ను అధికారంలోకి తేవడం ద్వారా ప్రజలు తాము కోల్పోయిన స్వేచ్ఛను తిరిగి

పొందినట్టు భావిస్తున్నారని, ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలన్నీ అమలు పరుస్తామని అన్నారు.

వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ, పాలనా వ్యవస్థను చిన్నాభిన్నం చేసిన భారాస ప్రభుత్వానికి చరమగీతం పాడి, నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపే ప్రభుత్వాన్ని సాధించుకున్నారంటూ యువతను అభినందించారు. ఆబ్కారీ, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రగతిభవన్ కంచెలు బద్దలు కొట్టడం ద్వారా తమ వైఖరి ఏమిటో చాటామన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, హోమ్ శాఖ ముఖ్యకార్యదర్శి జితేందర్, హైదరాబాద్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### 70 రోజుల్లో 25 వేల నియామకాలు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికైరంలోకి వచ్చిన 70 రోజుల్లో25 వేల ప్రభుత్వ నియామకాలు చేపట్టినట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.ఎల్బీ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో గురుకులాల్లో గ్రాడ్యుయేట్ టీచర్లు, ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్లుగా ఉద్యోగాలు సాధించిన 1,997 మందికి ముఖ్యమంత్రి నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ, గత ప్రభుత్వం విద్యపై కేవలం 4 శాతం మాత్రమే ఖర్చుచేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం విద్యపై పెట్టేది ఖర్చులాగా కాకుండా, పెట్టుబడిగా భావించి 10 నుంచి 12 శాతం నిధులు కేటాయిస్తామని చెప్పారు.

ఎస్సీ, ఎస్టీ, ఓబిసి, మైనారిటీ విద్యార్థులు ఉద్యోగావకాశాలు పొందేలా వసతులు కల్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. గత ప్రభుత్వం 6,453 ఎకోపాధ్యాయ పాఠశాలలు మూసివేసి, తండాలు, మారుమూల గ్రామాలలో పేదవారికి విద్యను దూరం చేసిందన్నారు. త్వరలో మెగా డీఎస్సీని ప్రకటించి, మూతపడిన పాఠశాలలను తెరిపిస్తామన్నారు.

విద్యాసంస్థలకు వేలకోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉండటంతో విద్యార్థులు సర్టిఫికెట్లను సయితం తీసుకోలేక పోతున్నారని, గురుకుల పాఠశాలలకు సొంత భవనాలులేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని, త్వరలో కొడంగల్‌లో మోడల్ గురుకుల పాఠశాల ప్రారంభించనున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. 25 ఎకరాల విస్తీర్ణంలో ఒకేచోట ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు గురుకుల పాఠశాలలు నిర్మిస్తామని అన్నారు. దీనివల్ల వారిలో వివక్ష తొలగిపోయి, సోదరభావం పెరుగుతుందని అన్నారు. అన్ని గురుకులాలు ఒకే ప్రాంగణంలో ఉండేలా ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఈ వేదికనుంచే ఆదేశాలు జారీచేస్తున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ కారణంగా చట్టపరమైన, న్యాయపరమైన సమస్యలను పరిష్కరించి ఉద్యోగ నియామక పత్రాలను ఇస్తున్నామన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి మాట్లాడుతూ, విద్య, వైద్య రంగాలను పటిష్టపరిచే దిశగా తమ ప్రభుత్వం ముందుకెళుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, తదితరులు పాల్గొన్నారు.



## కులగణనకు ఏకగ్రీవ తీర్మానం

**గతంలో ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం వేసిన సచార్ కమిటీ స్ఫూర్తితో రాష్ట్రంలో కుల గణన చేపడతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. డోర్ టూ డోర్ సర్వే నిర్వహించి అన్ని కులాల సమగ్ర లెక్కలను సేకరిస్తాం. బీసీల అభ్యున్నతికే ఈ నిర్ణయం అని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాల వారి లెక్కలు.. కులాల వారీగా వారి స్థితిగతుల వివరాలు సేకరించి, వారి ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగపరమైన అభివృద్ధికి తమ ప్రభుత్వం సమగ్రసర్వేకు సిద్ధమైందని చెప్పారు. ఇదొక చరిత్రాత్మక నిర్ణయమని అన్నారు. తమ నేత రాహుల్ గాంధీ, తమ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కుల గణన జరిపిస్తున్నామని చెప్పారు.**

**తెలంగాణ** మూడవ శాసనసభ, రెండవ సమావేశంలోని ఏడవ రోజు ప్రభుత్వం ప్రవేశపెట్టిన కులగణన తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ కులగణనకు సంబంధించిన తీర్మానాన్ని బిసి సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ సభలో ప్రవేశ పెట్టారు. బలహీన వర్గాల బలోపేతం కోసమే కులగణన తీర్మానాన్ని శాసనసభలో ప్రవేశపెడుతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

### ప్రభుత్వ తీర్మానం

వెనుకబడిన తరగతుల, షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల మరియు మిగతా బలహీన వర్గాలకు చెందిన ప్రజల అభ్యున్నతి నిమిత్తం వివిధ సామాజిక, ఆర్థిక విద్యాపరమైన ఉపాధి, రాజకీయ అవకాశాల ప్రణాళికలను రూపొందించి అమలుపరచేలా తెలంగాణ మంత్రివర్గం 04.02.2024 తేదీన చేసిన సిఫార్సు మేరకు తెలంగాణ రాష్ట్రమంతటా (సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన, ఉపాధి, రాజకీయ కుల సర్వే (కుల గణన) ఒక సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను చేపట్టాలని ఈ సభ ఏకగ్రీవంగా తీర్మానిస్తోంది" ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి పొన్నం కులగణనతో అన్ని వర్గాలకు న్యాయం చేస్తామన్నారు. ఈ కులగణన అంశంపై ఎటువంటి రాజకీయాలు చేయకుండా సహేతుకమైన సలహాలు, సూచనలు వుంటే ప్రతిపక్షాలు చెప్పవచ్చునన్నారు.



• ప్రగతిపథం

# ఉద్యోగాల పండుగ

**ఎవరినైనా మీ అబ్బాయి పెళ్లి చేశారా? అని అడిగితే, "లేదండీ.. ఇంకా ఉద్యోగం రాలేదు" అని సమాధానం వస్తోంది. ఇలా ఉద్యోగం రాలేదని పెళ్లి వాయిదా వేస్తున్నవారి సంఖ్య పెద్దగానే ఉంటోంది. ఈ సమస్య ఆడపిల్లలకు కూడా వర్తిస్తుంది. 'ఉద్యోగం పురుష లక్షణం' అనేది ఒకనాటి మాట. గుండమ్మ కథ సినిమా రోజుల్లోనే 'లేచింది మహిళా లోకం..' అని పాట పాడుకున్నాం. ఇప్పుడు చదువుల్లోనే కాదు, అన్నిరంగాలలో పురుషులతో సమానంగా మహిళలూ పోటీ పడుతున్నారు. పోటీ పడాలి కూడా. ఇది ఓ శుభ పరిణామం.**

**కానీ,** గత దశాబ్ద కాలంగా రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగావకాశాలు ఆశించిన స్థాయిలో అందుబాటులోకి రాకపోవడంతో పెద్దసంఖ్యలో నిరుద్యోగులు ప్రభుత్వ నోటిఫికేషన్ల కోసం, ఉద్యోగాలకోసం కళ్ళలో వత్తులు వేసుకొని ఎదురు చూస్తున్నారు. పెళ్ళీడు వచ్చిన యువతీ, యువకులు కూడా ఉద్యోగాలు రాకపోవడంతో పెళ్ళిళ్ళను వాయిదా వేస్తూ వచ్చారు. మరికొందరు కుటుంబ సభ్యుల వత్తిడితో, వయసు మీరిపోతుండటంతో వివాహాలు చేసుకుని, మరీ ఉద్యోగాలకోసం ఎదురు చూస్తున్నవారూ లేకపోలేదు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తూనే, నిరుద్యోగులకు శుభవార్తను మోసుకొచ్చింది. నిర్ణీత గడువులోగా రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీచేసి తీరుతామని ఘంటాపథంగా ప్రకటించింది. దానికి అనుగుణంగా అధికారంలోకి వచ్చిన 70 రోజుల్లోనే 25 వేలకుపైగా ఉద్యోగ నియామకపత్రాలను నిరుద్యోగులకు అందజేసింది. మాట ఇచ్చిన ప్రకారం, అధికారంలోకి వచ్చిన వెనువెంటనే, పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను ప్రక్షాళన చేసింది. గ్రూప్ -1 నోటిఫికేషన్ కూడా జారీచేసింది. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి కోచింగ్ సెంటర్లలో కోచింగ్ తీసుకొని పోటీ పరీక్షలకు సిద్ధమైన వారిలో ఈ వార్త ఉత్సాహం నింపింది.

ఈ నిరుద్యోగుల వెతలు తెలిసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యోగాల కోసం సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ఊరట నిచ్చే విధంగా ఉద్యోగార్థుల వయో పరిమితిని 44 సంవత్సరాల నుంచి 46 సంవత్సరాలకు పెంచారు. ఇది వయసు మీరి పోతోందని ఆందోళన చెందుతున్న ఎందరో నిరుద్యోగులలో ఆశలను నింపింది. ఈ సడలింపు రెండు సంవత్సరాలపాటు అమలులో ఉంటుంది.

రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు

నిరుద్యోగుల బాధలు తొలగించే పనిలోపడింది. మంత్రివర్గం ప్రమాణ స్వీకారం చేసిన ఎల్.బి. స్టేడియంలోనే నిరుద్యోగులకు నియామక పత్రాలను అందించడం ఒక శుభ పరిణామం. అయితే, నియామక పత్రాలను అందుకోవడానికి కొందరు తల్లులు తమ పిల్లలను చంకనపెట్టు కొని రావడం విశేషం. యువతులుగా ఉన్నప్పటి నుంచీ ఉద్యోగంకోసం ఎదురుచూసిన ఈ మహిళలు నేటికి ఉద్యోగ నియామకపత్రాలను అందుకోవడం పట్ల ఎంతో ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

ముందుగా, వైద్య ఆరోగ్య శాఖలో నియమితులైన 6,956 మంది స్టాఫ్ నర్సులకు ఎల్.బి.స్టేడియంలో ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆరోగ్య శాఖా మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి నియామక పత్రాలను అందజేశారు. రాబోయే రోజుల్లో వీరు ఆస్పత్రులలో పనిచేస్తున్నప్పుడు మానవతా దృక్పథంతో పనిచేయాలని, ఆస్పత్రులకు వచ్చే రోగులకు 'మీరే డాక్టర్లు, మీరే డాటర్లుగా, ప్రేమగా విధులు నిర్వర్తించాలి' అని చెప్పి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వారిలో సేవాభావాన్ని పాదుకొల్పారు.

పోలీసు, జైళ్ళు, అగ్నిమాపక, ఎక్సైజ్, రవాణా శాఖలలో కానిస్టేబుళ్ళుగా ఎంపికైన మొత్తం 13,445 మంది అభ్యర్థులకు కూడా ముఖ్యమంత్రి నియామక పత్రాలను అందించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే కోర్టు సమస్యలను పరిష్కరించి ఒక్కో విభాగంలో ఉద్యోగ నియామకపత్రాలను అందిస్తోంది. యువత పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని, రాష్ట్రాన్ని సాధించుకున్న యువతకు ప్రభుత్వంలో, ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు, ఉపాధి కల్పించే బాధ్యత తాను తీసుకుంటానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ఇచ్చిన భరోసా నిరుద్యోగులలో ఉత్సాహాన్ని నింపింది. సింగరేణికి సంబంధించి కారుణ్య నిమాయకాలను చేపట్టి లబ్ధిదారులకు అంబేద్కర్ విగ్రహం సాక్షింగా నియామకపత్రాలను ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందజేసారు. ఇంకా మిగిలి ఉన్న పోస్టుల భర్తీకి కూడా ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది.

అలాగే, గురుకులాలలో గ్రాడ్యుయేట్ టీచర్లు, ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్లుగా ఉద్యోగాలు సాధించిన 1,997 మందికి కూడా ముఖ్యమంత్రి నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమాలు ఎల్.బి. స్టేడియంలో అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యుల ఆనందోత్సాహాల మధ్య ఒక పండుగ వాతావరణంలో జరగడం విశేషం.

నిరుద్యోగులకు మరో తీపి కబురు కూడా ప్రభుత్వం అందించింది. 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా విడుదల చేయడం మరో శుభపరిణామం.

- శాస్త్రి



# సేవాలాల్ మార్గంలో నడవాలి

**శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ చూపిన మార్గంలో నడుస్తూ రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపించేందుకు ప్రతి ఒక్కరూ నడుంబిగించా లని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కూసుమంచిలో రిగిన సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాల్లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని సంత్ సేవాలాల్ మహరాజు చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహరాజ్ 285వ జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందన్నారు.**

**చిన్నతనం** నుండే సేవాగుణం అలవర్చుకొని నలుగురికి సహాయపడేవారన్నారు. లిపిలేని బంజారాల భాషను ఒక పద్ధతిగా మార్చారని, 10 కోట్ల బంజారా ప్రజలు ఎక్కడ్కెనా ఒకే రకంగా మాట్లాడుకోగలుగు తున్నారన్నారు. తమ కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలు, విలక్షణమైన దుస్తులు, ఆభరణాలతో బంజరాలు తమ ప్రత్యేకతను నిలుపుకుంటున్నారని మంత్రి తెలిపారు. సంత్ సేవాలాల్ మహరాజ్ ప్రజల మేలు కోసం అనేక ఉద్యమాలు చేశారని, మానవ హింస, మద్యం, ధూమపానం లాంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారన్నారు. సామాన్యునిగా పుట్టి అసామాన్యునిగా ఎలా ఎదగాలో ఆచరించి చూపిన మహానుభావుడు సంత్ సేవాలాల్ అని, మనిషి మనీషిగా ఎలా ఎదగాలో తెలియచెప్పారన్నారు. ఆదర్శవంతమైన ఆయన జీవితాన్ని అందరూ ఆచరించాలని ఆయన జయంతి, వర్ధంతులను తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం జరుగుతుందని మంత్రి తెలిపారు.

# వయోపరిమితి పెంపు

**ఉద్యోగాల** కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులందరికీ ఊరటనిచ్చే మంచి కబురందించింది ప్రభుత్వం. మరీ ముఖ్యంగా గత ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లను ఇవ్వడంలో జరిగిన కాలయాపనతో వయోపరిమితి దాటిపోయిందని బాధపడే నిరుద్యోగులకు ఈ వార్త ఎంతో ఊరటనిస్తుంది. ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునే వారి గరిష్ఠ వయోపరిమితి 44 సంవత్సరాలుగా వుంది. ఈ పరిమితిని మరో రెండేళ్ళు పెంచింది ప్రభుత్వం. ఇపుడు గరిష్ఠ వయోపరిమితి 46 సంవత్సరాలుగా ప్రభుత్వం నిర్ధారించింది. అయితే ఈ వయోపరిమితి సడలింపు రెండేళ్ల పాటు అమలులో ఉంటుందని స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఫిబ్రవరి 8న ఉత్తర్వులు జారీచేశారు.



## ఆశయాల సాధన దిశగా కార్యాచరణ

# 2,75,891 కోట్లతో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్

**"ఎందరో యువకుల త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణ, పదేళ్ళ తర్వాత నిజమైన ప్రజాస్వామ్య మంటే ఏమిటో రుచి చూపిస్తున్నది. తెలంగాణ త్యాగమూర్తులు ఏ ఆశయాలకోసం ఆత్మార్పణ చేశారో, వాటిని సాధించడం కోసం, వారి కలలను సాకారం చేయడం కోసం, వాటిని ఆచరణలోకి తీసుకురావడం కోసం మా కార్యాచరణను మీ ముందు ఉంచబోతున్నాం" అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖా మంత్రి భట్టి విక్రమార్క మల్లు రాష్ట్ర శాసన సభలో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను సమర్పిస్తూ అన్నారు.**

**2024-25** ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ఆయన రాష్ట్ర శాసన సభకు సమర్పించారు. ఇందులో మొత్తం వ్యయం 2,75,891 కోట్ల రూపాయలుగా, రెవెన్యూ వ్యయం 2,01,178 కోట్ల రూపాయలుగా, మూల ధన వ్యయం 29,669 కోట్ల రూపాయలుగా ప్రతిపాదించారు. ఇందులో ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలుకు సింహభాగం నిధులను కేటాయించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మల్లు ప్రసంగిస్తూ...

భారత రాజ్యాంగ పీఠిక గుర్తు చేసుకుంటూ..... "పౌరులెల్లరకు సామాజిక, ఆర్థిక, రాజకీయ, న్యాయమును, భావము, భావప్రకటన, విశ్వాసము, ధర్మము, ఆరాధన-వీటి స్వాతంత్ర్యమును, అంతస్తులోను, అవకాశంలోను, సమానత్వమును చేకూర్చుటకు" ఈ స్ఫూర్తితో మీ ముందుకు ఈ బడ్జెట్‌తో వచ్చాము.

తెలంగాణ త్యాగమూర్తులు ఏ ఆశయాల కోసం ఆత్మార్పణ చేశారో... వాటిని సాధించడం కోసం... వారి కలలను సాకారం చేయడం కోసం.... వాటిని ఆచరణలోకి తీసుకు రావడంకోసం..... ఈ సమావేశాల్లో మా కార్యచరణ మీ ముందు ఉంచబోతున్నాం.

"కొందరి కోసం మాత్రమే అందరు బతకాలి" అనే నిరంకుశ విధానాలను ఎదిరించిన తెలంగాణ ప్రజలు ఇప్పుడు నిజమైన అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నారు. "అందరికోసం మనమందరం" అనే నూతన స్ఫూర్తితో.... మన చిరకాల ఆశలు.... ఆకాంక్షలు తీర్చుకోవడానికి ఇప్పుడు సరైన వేదిక ఏర్పాటైందన్న భావన కూడా తెలంగాణ ప్రజల కళ్లలో స్పష్టంగా కనిపిస్తుంది. ఎందరో యువకుల త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణ, పదేళ్ల తర్వాత నిజమైన ప్రజాస్వామ్యమంటే ఏమిటో రుచి

చూస్తున్నది.

ఈ నేపథ్యంలో మనం, ఈ స్వేచ్ఛా తెలంగాణలో, తొలి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టుకోవడం ఎంతో ఆనందకరమైన విషయం. సమాన అవకాశాలు, సామాజిక న్యాయం, ప్రజలకు అందుబాటులో ఉండే పాలనకు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రైతులు, యువకులు, మహిళలు నిరుపేదల జీవితాలలో మరిన్ని వెలుగులు నింపేందుకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటున్నాము.

> **“మీ నమ్మకాలు మీ ఆలోచనలు అవుతాయి,**
> **మీ ఆలోచనలు మీ పదాలవుతాయి,**
> **మీ మాటలు మీ చర్యలు అవుతాయి,**
> **మీ చర్యలు మీ అలవాట్లుగా మారుతాయి,**
> **మీ అలవాట్లు మీ విలువలు అవుతాయి,**
> **మీ విలువలు మీ విధిగా మారుతాయి.”**

అంటూ జాతిపిత మహాత్మాగాంధీ చెప్పిన విషయాన్ని గుర్తు చేస్తున్నాను.

తెలంగాణ ప్రజల జీవితాలలో గుణాత్మక మార్పు తీసుకురావాలనేది మా కృతనిశ్చయం. అందుకు అనుగుణంగా మా హామీలు ఉండడం వల్లనే తెలంగాణ ప్రజలు మమ్మల్ని నమ్మారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి ఈ ప్రజా ప్రభుత్వం ఎంతటి సాహసాన్నైనా చేస్తుంది..... ఎంతటి కష్టాన్నైనా భరిస్తుంది..... ప్రజలకు నిజమైన ప్రతినిధులుగా మేము ఎంతటి త్యాగానికైనా సిద్ధంగా ఉన్నాం.... పాలకులకు, ప్రజలకు మధ్య ఉన్న ఇనుప కంచెలు తొలగించడంతో ప్రారంభమైన మా ఈ ప్రజాపాలన మరింత పటిష్టంగా ముందుకు సాగుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు. నిస్సహాయులకు సహాయం చేయడం మా విధానం......ఇదే మా లక్ష్యం...

తెలంగాణ ప్రజల దశాబ్దాల ఆకాంక్షను గౌరవిస్తూ 2014లో ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన నాటి యూపీఏ ప్రభుత్వానికి, ఈ ప్రక్రియలో కీలకపాత్ర పోషించిన నాటి యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీకి, నాటి ప్రధాని డా. మన్మోహన్ సింగ్‌కి 4 కోట్ల తెలంగాణ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలుపుకోవడం మా కర్తవ్యం, మన అందరి బాధ్యత. స్వరాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన ఎందరో అమరవీరులకు మరొకసారి సభావేదికగా నివాళులు అర్పిస్తున్నాం.

కేవలం లాంఛనంగా మాత్రమే నేను ఇది చెప్పడం లేదు.... మనస్సాక్షిగా చెబుతున్న మాట ఇది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నేను, మా మంత్రివర్గ సహచరులు తెలంగాణ ప్రజల ఆకాంక్షలు తీర్చడానికి ఏమాత్రం వెనకాడము.

ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం తెస్తామని మాట ఇచ్చాం. నిర్బంధాలు, నియంతృత్వ ధోరణులు ఉండవని చెప్పాం. ప్రజా సంక్షేమం కోసం ఆరు గ్యారంటీలు ప్రకటించాం. బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఇచ్చిన హామీలు, చెప్పిన మాటకు కట్టుబడి హామీలకు చట్టబద్ధత కల్పించే ఫైలు పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తొలి సంతకం చేయడం మా ప్రభుత్వ సంకల్పానికి, చిత్తశుద్ధికి నిదర్శనం. నూతన ప్రభుత్వం తొలి అడుగులోనే సంక్షేమానికి నాంది పలికింది. ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. మన రాష్ట్ర క్లిష్ట ఆర్థిక పరిస్థితులపై ఈ సభకు ఇదివరకే శ్వేత పత్రం ద్వారా సవివరంగా వాస్తవాలను తెలిపాము. ఇటువంటి విపత్కర ఆర్థిక పరిస్థితులలో కూడా మేము ప్రజా సంక్షేమానికి చేసిన వాగ్దానాలకు కట్టుబడి ఉన్నాము. ఆడం స్మిత్ చెప్పినట్లుగా “మానవ జీవన ప్రమాణాలు మొత్తంగా పెంచే బహుముఖ ప్రణాళిక అంటూ ఏదీలేదు. కానీ, రాష్ట్రంలో అందుబాటులో ఉన్న వనరులతో వివిధ సాధన మార్గాల ద్వారా సాధించవచ్చు”.

గత పాలకుల నిర్వాకంతో మన ధనిక రాష్ట్రంలో కూడా ఆర్థిక కష్టాలు వచ్చాయి. పూట గడవడం కూడా కష్టం అనేంత కనిష్ట స్థాయికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చేర్చారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనివ్వకుండా, ప్రజలకు ఏమాత్రం అవసరంలేని ఆర్భాటాలకు డబ్బు ఖర్చు చేశారు. రాష్ట్రం ఆర్థికంగా ఎంత దురదృష్టకర పరిస్థితిలో ఉందంటే... ప్రతీనెల 1వ తేదీన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు జీతాలు ఇవ్వలేనటువంటి



పరిస్థితి. దీని వల్ల ఉద్యోగుల క్రెడిట్ స్కోర్ (CIBIL Score) దెబ్బతినడం వల్ల వారు రుణాలు పొందడం కూడా కష్టమవుతుంది. వృద్ధులైన పెన్షనర్లు మందుల కోసం ఖర్చు పెట్టిన డబ్బులు పొందడం కోసం ఎదురు చూసే పరిస్థితి ఉత్పన్నమైనది.

అందుకే తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని, ప్రజల జీవితాలను దుర్భరం చేసే దిశగా సాగిన ప్రజా వ్యతిరేక పాలనకు ప్రజలు చరమగీతం పాడారు. ఇదే మన ప్రజాస్వామ్య వ్యవస్థ యొక్క గొప్పతనం... దివాళా తీసిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడానికి ఇప్పటికే దుబారా ఖర్చులు తగ్గించాం. ఆర్థిక క్రమశిక్షణతో పాటు మెరుగైన సంక్షేమ పాలన అందించాలన్నది మా లక్ష్యం. గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రతి బడ్జెట్ వాస్తవానికి చాలా దూరంగా ఉంది. రాష్ట్ర రాబడిని అధికంగా



## తలసరి ఆదాయం

**తెలంగాణ తలసరి ఆదాయం ప్రస్తుత ధరల ప్రకారం, 2023- 24లో 3,43,297 రూపాయలుగా ఉంటుందని అంచనా. గత ఏడాది తలసరి ఆదాయం 3,09,912 రూపాయలు. దీనితో పోలిస్తే ఈ సంవత్సరం పెరుగుదల కనిపిస్తున్నప్పటికి, వృద్ధి రేటు మాత్రం క్షీణించింది.**

చేసి చూపెట్టడం ద్వారా ఎన్నో పథకాలకు నిధులను కేటాయిస్తున్నాము అనే భ్రమను కల్పించారు. ఉదాహరణకు దళితబంధు పథకానికి బడ్జెట్‌లో 17,700 కోట్ల రూపాయలు చూపిస్తే, నిధులు మాత్రం ఒక్క పైసా కూడా ఖర్చు పెట్టలేదు. అంతేకాకుండా, 2021-22 సంవత్సరానికి కాగ్ లెక్కల ప్రకారం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధికి డిమాండులో 4,874 కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేయలేదు. గిరిజన అభివృద్ధిలో 2,918 కోట్ల రూపాయలు ఖర్చు చేయలేదు. వెనుకబడిన తరగతుల అభివృద్ధిలో 1,437 కోట్ల రూపాయలు ఖర్చు చేయలేదు. అదేవిధంగా రైతులకు వడ్డీలేని రుణాల కొరకు కేవలం 2014-15 ఆర్థిక సంవత్సరం నుండి 2023-24 ఆర్థిక సంవత్సరం వరకు 1,067 కోట్ల రూపాయల బడ్జెట్ పెట్టి కేవలం 297 కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు పెట్టారు. అదేవిధంగా మహిళలకు 2014 -15 ఆర్థిక సంవత్సరం నుండి 2023-24 ఆర్థిక సంవత్సరం వరకు 7,848 కోట్ల రూపాయల బడ్జెట్ పెట్టి కేవలం 2,685 కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు పెట్టారు. ఈ విధంగా సమాజంలోని 90 శాతం జనాభా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బి.సి, మైనారిటీ మరియు మహిళల కోసం గొప్పలు చెప్పుకోవడానికి పథకాలు బడ్జెట్ లో ఉన్నాయి తప్పితే, వాటికి నిధుల విడుదల లేవు. ఈ సాంప్రదాయానికి స్వస్తి పలికి మా ప్రభుత్వం వాస్తవానికి దగ్గరగా రాబడులు అంచనావేసి దానికి అనుగుణంగానే పథకాలకు కేటాయింపులు చేయడం జరిగింది. ఇది మా చిత్తశుద్ధికి నిదర్శనం. సరైన ప్రణాళికలతో అన్ని అడ్డంకులను అధిగమిస్తాం. అందులో ఎలాంటి సందేహం లేదు. "ఇది మా ప్రభుత్వం" అని ప్రజలు భావించే విధంగా బాధ్యతతో వ్యవహరిస్తాం. మా ఈ నిర్ణయానికి గతంలో జరిగిన తప్పులు... చేసిన అప్పులు... ఏమాత్రం అడ్డం కావు.. కాలేవు....... ఇదే స్ఫూర్తితో, ఆశయంతో, ప్రజా ఆశీర్వాదంతో ఈ బడ్జెట్ ను ప్రవేశ పెడుతున్నాం.

## ఆర్థిక వృద్ధి

2023-24 ఆర్థిక సంవత్సరంలో, తెలంగాణ రాష్ట్ర స్థూల ఉత్పత్తి (GSDP) ప్రస్తుత ధరలలో 2022-23తో పోల్చినప్పుడు 13,02,371 కోట్ల రూపాయలు నుండి 14,49,708 కోట్ల రూపాయలకు పెరిగింది. అయితే, ఆర్థిక వృద్ధి రేటు అదే కాలంలో 14.7 శాతం నుండి 11.3 శాతానికి క్షీణించింది. దేశీయ స్థాయిలో వృద్ధి రేటు మాత్రం 16.1 శాతం నుండి 8.9 శాతానికి పడిపోయి మరింత ఎక్కువగా క్షీణించింది. పర్యవసానంగా, భారత దేశ జిడిపి వృద్ధి రేటుతో పోలిస్తే తెలంగాణ రాష్ట్ర వృద్ధి రేటు 2.4 శాతం ఎక్కువ. తెలంగాణ ఆర్థిక వృద్ధి రేటు, స్థిరమైన ధరలలో, గత సంవత్సరం 7.5 శాతం నుండి ఒక శాతం తగ్గి ఈ సంవత్సరానికి 6.5 శాతానికి పడిపోయింది. దేశ స్థాయిలో ఈ వృద్ధి +0.1 శాతంగా ఉంది. తెలంగాణ ఆర్థిక వృద్ధి రేటు తీవ్ర క్షీణతను చవి చూసిందనేది స్పష్టమవుతుంది. తెలంగాణ మరియు భారతదేశం యొక్క ప్రస్తుత మరియు స్థిరమైన ధరల వద్ద భిన్నమైన వృద్ధి రేట్లు, తెలంగాణలో ఉన్న అధిక ద్రవ్యోల్బణం రేటును సూచిస్తున్నాయి. 2023 డిసెంబర్‌లో తెలంగాణలో 6.65 శాతంగా ఉన్న వినియోగదారుల ధరల సూచీ 5.69 శాతంగా ఉన్న దేశ సగటుతో పోలిస్తే చాలా అధికంగా ఉంది. అధిక ద్రవ్యోల్బణం ఉన్న రాష్ట్రాలలో తెలంగాణ 5 వ స్థానంలో ఉంది.

## వివిధ రంగాల వృద్ధి రేట్లు

2023-24 ఆర్థిక సంవత్సరంలో, తెలంగాణ ఆర్థిక వ్యవస్థ వివిధ రంగాలలో పనితీరు ఒకేలా లేదు. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. ప్రాథమిక రంగాలలో ఒకటైన వ్యవసాయం చాలా క్షీణించింది. వ్యవసాయ రంగంలో పంటల ద్వారా వచ్చే స్థూల విలువ 49,059 కోట్ల రూపాయల నుండి 45,723 కోట్ల రూపాయలకి తగ్గి, మైనస్ 6.8 శాతం వృద్ధి రేటుగా నమోదు అయినది. ఈ గణనీయమైన తగ్గుదలకి ప్రధాన కారణం ప్రతికూల వాతావరణ పరిస్థితులు. తయారీ రంగంలో మాత్రం పెరుగుదల కనిపించింది. గత సంవత్సరంలో నమోదైన 1.3 శాతం వృద్ధితో పోలిస్తే ఈ సంవత్సరం 5.9 శాతంగా వృద్ధి చెందింది. రియల్ ఎస్టేట్, నిర్మాణం, మైనింగ్, క్వారీ వంటి ఇతర రంగాలు కూడా మునుపటి సంవత్సరంతో పోలిస్తే 2023-24లో అధిక వృద్ధి రేటును నమోదు చేశాయి.

## సుపరిపాలన

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మానిఫెస్టోలో ప్రకటించిన విధంగా అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రగతి భవన్ ను మహాత్మా జ్యోతిబాపూలే భవన్‌గా మార్చి ప్రజా పరిపాలనకి

శుభారంభం చేశాము. ప్రతివారం రెండు రోజులలో ప్రజావాణి నిర్వహిస్తూ, ప్రజల కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకొంటున్నాం. ఈ రెండు నెలలలో 43,054 దరఖాస్తులు వస్తే, వాటిలో 14,951 ఇండ్ల కొరకు, 8,927 భూ సమస్యల గురించి, 3,267 పెన్షన్ ల గురించి మరియు 3,134 ఉద్యోగ కల్పన గురించి వచ్చాయి. ప్రజావాణిలో వికలాంగులు, వృద్ధులు, మహిళలు మరియు పిల్లల కొరకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి, అదనపు సౌకర్యాలు కూడా కల్పించాం. వైద్య సేవల నిమిత్తం వచ్చే రోగుల సహాయార్థం ఆరోగ్యశ్రీ కౌంటర్లను ఏర్పాటు చేశాం. ఒక పోర్టల్ ద్వారా ప్రజావాణి దరఖాస్తులన్నింటిని నమోదు చేసి అవి పరిష్కారం అయ్యే దాక వాటిని పర్యవేక్షించడానికి కలెక్టర్లకి, శాఖాధిపతులకు ఆదేశాలు ఇచ్చాం. ప్రజావాణి సక్రమంగా నిర్వహించేలా ఒక సీనియర్ ఐ.ఎ.ఎస్.ను ప్రత్యేక అధికారిగా నియమించాం.

## అభయ హస్తం (ఆరు గ్యారంటీలు) అమలుకు 53,196 కోట్లు

సంపూర్ణ ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రణాళిక. అందుకే ఆరు హామీలను ప్రజల ముందు ఉంచి వారి ఆమోదంతో ఈ శాసన సభా వేదిక ద్వారా వాటిని అమలు చేసేందుకు మా ప్రణాళికను మీ ముందు ఉంచుతున్నాము. హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో, రెండు గ్యారెంటీలను మేము బాధ్యతలు స్వీకరించిన 48 గంటలలోనే ప్రారంభించి కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధిని నిరూపించుకున్నాం.

ఆరు హామీల అమలుకై అర్హులైన లబ్ధిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించడం కోసం, ప్రత్యేకంగా డిసెంబర్ 28 నుండి జనవరి 6 వరకు గ్రామాల్లో మరియు వార్డుల్లో సభలు ఏర్పాట్లు చేయడం జరిగింది. ఈ సభలలో ప్రజలు 1.29 కోట్ల దరఖాస్తులు ఇవ్వడం జరిగింది. దీనిని బట్టి ప్రజలలో ఈ హామీలపై ఉన్న విశ్వాసం అర్థమవుతుంది. అందుకే ఒక ప్రత్యేక సాఫ్ట్ వేర్ ద్వారా ఈ దరఖాస్తులను క్రోడీకరించే పనికూడా త్వరితగతిన పూర్తి చేయడం జరిగింది. దీనివల్ల మున్ముందు ఈ హామీల అమలులో లబ్ధిదారుల ఎంపిక, వాటికి అవసరమైన నిధులు సమకూర్చుకోవడానికి మార్గం సులభతరం అవుతుంది.

మహాలక్ష్మి పథకంలో భాగం అయిన ఉచిత ఆర్టీసి బస్సు రవాణా సౌకర్యాన్ని మా ప్రభుత్వం డిసెంబర్ 9, 2023 న ప్రారంభించడం జరిగింది. రాష్ట్ర మహిళలు ఈ పథకం పట్ల అత్యంత సంతృప్తి, సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకం సజావుగా సాగడానికి సకాలంలో ఆర్టీసికి అవసరమైనన్ని నిధులు అందచేస్తున్నాము. ఇప్పటికే నెలకు 300 కోట్ల రూపాయల చొప్పున అదనపు నిధులు మంజూరు చేయడం జరిగింది.

మరొక ముఖ్యమైన ప్రజాసంక్షేమ పథకం – రాజీవ్ ఆరోగ్యశ్రీ. ఈ పథకం క్రింద మా హామీ ప్రకారం డిసెంబర్ 9, 2023 నుండి వైద్య ఖర్చుల పరిమితిని 5.00 లక్షల రూపాయల నుండి 10.00 లక్షల రూపాయల వరకు పెంచడం జరిగింది. గతంలో ఆరోగ్యశ్రీ కింద చెల్లించవలసిన బకాయిలు చెల్లించ నందున, ఆస్పత్రులలో ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయి సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నందున మా ప్రభుత్వం దీనిని ప్రాధాన్యతగా తీసుకొని గత బకాయిలను కూడా విడుదల చేయడం జరిగింది. భవిష్యత్తులో కూడా ఆరోగ్యశ్రీ క్రింద వైద్య సేవలకు ఎటువంటి అడ్డంకి లేకుండా అవసరమైన నిధులు చెల్లించడం జరుగుతుంది.

మా ప్రభుత్వ హామీలలో మరో ముఖ్యమైన రెండు హామీలు గృహజ్యోతి, 500/- రూపాయలకే వంట గ్యాస్ సిలెండర్ సరఫరా. గృహజ్యోతి పథకం ద్వారా అర్హులైన వినియోగదారులందరికి నెలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్‌ను అందించడానికి, అర్హులైన వినియోగ దారులకు 500/- రూపాయలకే వంట గ్యాస్ సిలిండర్లను సరఫరా చేసే పథకాలకి మరో ముందడుగు వేశాము. ఫిబ్రవరి 4, 2024 నాటి రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం ఈ పథకాల అమలుకు ఆమోదం తెలిపింది. త్వరలోనే తగిన విధి విధానాలు రూపకల్పన చేసి వాటి ఫలాలను ప్రజలకు అందించడం జరుగుతుంది. మహాలక్ష్మి, రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత, యువవికాసం హామీల అమలుకు మా ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది. వాటిని వీలైనంత త్వరలో అమలు చేసే సంకల్పంతో వున్నాం. ఈ బడ్జెట్‌లో ఈ పథకాల అమలుకు 53,196 కోట్ల రూపాయలు ప్రతిపాదించడం జరిగింది. ఈ కేటాయింపు ఒక ప్రాథమిక అంచనా ప్రకారం మాత్రమే చేయడం జరిగింది. హామీలకు సంబంధించిన విధి విధానాలను రూపొందించే పని ఇంకా కొనసాగుతున్నందున, అది పూర్తయిన వెంటనే అమలుకు అవసరమైన పూర్తి నిధులు కేటాయిస్తాం.

ఎన్నికల ప్రణాళికలో చెప్పిన ప్రతి హామీని నెరవేర్చేందుకు కృతనిశ్చయంతో ఉన్నాం. రైతుల కోసం ప్రకటించిన వరంగల్ డిక్లరేషన్, హైదరాబాదులో ప్రకటించిన యువ డిక్లరేషన్, చేవెళ్లలో ప్రకటించిన ఎస్సీ-ఎస్టీ డిక్లరేషన్, కామారెడ్డిలో ప్రకటించిన బీసీ, మైనారిటి డిక్లరేషన్ అన్నింటిని ఖచ్చితంగా అమలు చేస్తాం.

## పారిశ్రామిక, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ

రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి చెందడం వల్ల ఎన్నో సమస్యలు పరిష్కారం అవుతాయి. లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు దొరుకుతాయి. ఉత్పాదకత పెరుగుతుంది. అందుకే తెలంగాణ రాష్ట్రం సత్వర పారిశ్రామిక ప్రగతి సాధించేందుకు అన్ని చర్యలు ప్రారంభించాము. ఈ దిశగానే గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మన ఐ.టి, పరిశ్రమల శాఖా మాత్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఇటీవల స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం వార్షిక సమావేశంలో పాల్గొన్నారు. మన రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు తెచ్చే లక్ష్యంతో పలు పారిశ్రామికవేత్తలతో వరుస సమావేశాలు నిర్వహించారు. తత్ఫలితంగా మన రాష్ట్రానికి దాదాపు 40,000 కోట్ల రూపాయలకు పైబడి పెట్టుబడులు రానున్నాయని ఈ సందర్భంగా చెప్పడానికి సంతోషిస్తున్నాము. తెలంగాణ ప్రభుత్వం అనుసరిం

చబోయే విధానాలను ప్రఖ్యాత పారిశ్రామిక వేత్తలు ప్రశంసించిన విషయాన్ని కూడా ఈ సందర్భంగా మీకు తెలియజేస్తున్నాము. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు అత్యంత సానుకూలత వ్యక్తం కావడం మా పాలనపై ఉన్న నమ్మకానికి నిదర్శనం. ఈ పెట్టుబడుల ద్వారా మన రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరిగి, ప్రజలకు సంపద పెరుగుతుంది అనడంలో ఎటువంటి సందేహం లేదు. పారిశ్రామిక అభివృద్ధి అనేది ఒకే చోట కేంద్రీకృతమైనప్పుడు ప్రాంతీయ, ఆర్థిక అసమానతలు తలెత్తుతాయి. ఇది దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర నలుమూలలు అభివృద్ధి చెందడానికి ఫార్మా క్లస్టర్లను ఏర్పాటు చేయడానికి నిర్ణయించాము.

తెలంగాణ రాష్ట్రానికి తీర ప్రాంతం లేదు. అందువల్ల సరుకు రవాణాకు పోర్టులు అందుబాటులో లేవు. ఈ లోటును భర్తీ చేసుకోవడానికి డ్రైపోర్టులను అందుబాటులోకి తీసుకురావడానికి ఒక బృహత్ ప్రణాళికను రూపొందించాం. డ్రైపోర్టులు ఏర్పాటు చేయడం ద్వారా సరకు రవాణా ఖర్చులు గణనీయంగా తగ్గుతాయి. మన ఉత్పత్తులను సులభంగా ఎగుమతి చేసుకునే సౌకర్యం మన రాష్ట్ర పారిశ్రామిక రంగానికి అందించబోతున్నాం. ఈ బడ్జెట్‌లో పరిశ్రమల శాఖకు 2,543 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నాం.

దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ అన్నట్టుగా "భారతదేశం పారిశ్రామిక విప్లవం యొక్క అవకాశం కోల్పోయింది. కానీ కంప్యూటర్ విప్లవం మాత్రం కోల్పోలేము". ఎంతో దార్శనికతతో మూడున్నర దశాబ్దాల క్రితమే ఆయన చెప్పిన మాటలు ఇప్పటికీ స్ఫూర్తిదాయకం. తెలంగాణ రాష్ట్రం ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీలో దేశంలోనే అగ్రస్థానంలో ఉండాలనేది మా ఆకాంక్ష. ఐటి రంగంలో అభివృద్ధి సాధించడం ద్వారా తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మరింత అధునాతన సౌకర్యాలు కల్పించడానికి వీలు కలుగుతుంది. అంతే కాకుండా ఎంతో మందికి ఉపాధి అవకాశాలు లభ్యమౌతాయి. ఐటీ రంగానికి మరింత మెరుగుపరిచిన విధానాన్ని రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి మరియు ప్రజల జీవన స్థితి గతులను మెరుగు పరచడానికి వీలుగా Artificial Intelligenceను ఉపయోగించుకుంటాం.

ఐటి రంగంలో భారీ పెట్టుబడులతో ముందుకు వచ్చే వారికి అత్యంత సులువైన విధానాలతో స్వాగతం పలకడమే కాకుండా భవిష్యత్తులో కూడా వారికి ఎలాంటి సమస్యలు తలెత్తని పటిష్టమైన విధానాలను రూపొందిస్తున్నాం. అత్యంత అధునాతన మైన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా ఐటి రంగంలో నైపుణ్యం మరింత వృద్ధి చెందే విధంగా మా నూతన పాలసీ ఉంటుంది.

హైదరాబాద్‌లోని ఐటి పరిశ్రమ రోజు రోజుకూ అభివృద్ధి చెందుతున్నది. ఐటి పరిశ్రమలతో హైదరాబాద్ కిటకిటలాడుతున్నది. కాని రాష్ట్ర సమగ్రాభివృద్ధి జరగాలంటే ఒక హైదారాబాదు మాత్రమే అభివృద్ధి జరిగితే సరిపోదు. ఇలాంటి అభివృద్ధి తెలంగాణ రాష్ట్రం నలుమూలలకు కూడా విస్తరించాలి. ఈ కారణంగా ఐటి పరిశ్రమను ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు విస్తరించేందుకు ప్రణాళికలు రచిస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో ఐటి పరిశ్రమలు రావాలంటే పటిష్టమైన విధానం ఉండాలి. అందుకే అమెరికాలోని ఐటిసర్వ్ అనే సంస్థతో సంప్రదింపులు జరుపుతున్నాం. దీనివల్ల తెలంగాణ రాష్ట్రం ఐటి రంగంలో తిరుగులేని శక్తిగా మారుతుందనడంలో సందేహం లేదు. దేశంలోనే అత్యంత పటిష్టమైన ఫైబర్ నెట్‌వర్క్ కనెక్షన్ ఉండే రాష్ట్రంగా తెలంగాణను తీర్చి దిద్దుతాం.

**ఈ బడ్జెట్ లో ఐ.టి శాఖకు 774 కోట్ల రూపాయలను పతిపాదిస్తున్నాం.**

## పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి కి 40,080 కోట్లు

**"ప్రజాస్వామ్యం అనేది కేవలం ప్రభుత్వ రూపం కాదు. ఇది ప్రాథమికంగా అనుబంధిత జీవన విధానం, ఉమ్మడి కమ్యూనికేట్ అనుభవం. ఇది తప్పనిసరిగా తోటివారి పట్ల గౌరవం మరియు గౌరవప్రదమైన వైఖరి." - డా.బి.ఆర్.అంబేద్కర్**

గ్రామాల అభివృద్ధితో ప్రతి పల్లె కళకళలాడేలా చేయడమే మా ప్రభుత్వ ప్రాధాన్యత. అందుకే గ్రామీణాభివృద్ధి విషయంలో గత పదేండ్లలో పడ్డ తప్పటడుగులను సరిచేయబోతున్నాం. ప్రతి గ్రామం యూనిట్‌గా గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక తీసుకుని ముందుకు వెళుతున్నాం.

గ్రామీణ ప్రాంతాలలో సురక్షిత తాగునీరు ఇప్పటికీ పూర్తిగా అందుబాటులో లేదు. 35,752 కోట్ల రూపాయలు ఖర్చు చేసి మిషన్ భగీరథ పూర్తి చేశామని గత ప్రభుత్వం గొప్పలు చెప్పింది. వాస్తవానికి ఇన్ని వేల కోట్లు ఖర్చు చేసినా, ఈనాటికీ రాష్ట్రంలో సురక్షిత మంచినీరు లేని గ్రామాలు ఎన్నో ఉన్నాయి. కేంద్ర జల మంత్రిత్వ శాఖ కూడా అప్పటి రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలో వంద శాతం ఇళ్లకు సురక్షిత మంచినీరు అందుతోందని చెప్పడాన్ని తప్పు పట్టింది. ఈ విషయంలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు నివేదికలు ఇవ్వడం వల్ల కేంద్ర జల మంత్రిత్వ శాఖ మన రాష్ట్రానికి హక్కుగా రావలసిన నిధులు కూడా ఇవ్వలేదు.

స్థానికంగా ఉన్న నీటి వనరులను వాడుకోవడం కాకుండా సుదూర ప్రాంతాల నుంచి పైప్ లైన్ల ద్వారా తాగునీరు అందించే ప్రయత్నం చేయడం వల్ల, ఖర్చు ఎన్నో రెట్లు పెరిగి, చివరకు సమస్యలు తలెత్తుతున్నాయి. స్థానిక నీటి వనరులను నిర్లక్ష్యం చేసి ఎక్కడి నుంచో నీరు తేవడం అనేది ప్రయాసతో కూడుకున్న పని. కేవలం కాంట్రాక్టర్లు మాత్రమే ఈ కార్యక్రమం ద్వారా లాభపడ్డారు. ఈ కారణంగా గ్రామీణ పేదలు సురక్షిత మంచినీటి కోసం ఇంకా ఇబ్బంది పడుతూనే ఉన్నారు. తక్షణమే మిషన్ భగీరథ లోపాలను సవరించవలసి ఉంది. మిషన్ భగీరథ కార్యక్రమాన్ని ఇప్పటికైనా ప్రక్షాళన చేయకపోతే ఎంతో ప్రజాధనం వృధా అయ్యే ప్రమాదం ఉందని మీకు

తెలియచేస్తున్నాం. అందుకే ఈ దిశగా దిద్దుబాటు చర్యలు ప్రారంభించాం.

2014 సంవత్సరంలో కొత్తగా ఏర్పడిన మన రాష్ట్రానికి మొదటి రాష్ట్ర ఆర్థిక సంఘం నియమించుకోవడం జరిగింది. రాష్ట్ర ఆర్థిక సంఘం తన నివేదికలో రాష్ట్ర నికర స్వంత పన్నుల ఆదాయంలో 11 శాతం నిధులు గ్రామీణ మరియు పట్టణ స్థానిక సంస్థలకు కేటాయించమని సిఫార్సు చేసింది. ఈ 11 శాతంలోని 61 శాతం నిధులు గ్రామీణ స్వయం ప్రతిపత్తి సంస్థలకు కేటాయించాలని కూడా సిఫార్సు చేసింది. ఈ సిఫార్సులను గత రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. నిబంధనల ప్రకారం రాష్ట్ర ఆర్థిక సంఘం యొక్క నివేదికపై తీసుకొన్న చర్యలను అసెంబ్లీ లో ఉంచాలి, అయినా కూడా దాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. మా ప్రభుత్వం ఆ సిఫార్సులను వెంటనే ఆమోదించింది. ఆ ప్రకారమే నిధులు విడుదల చేస్తుంది. ఒక దశాబ్దం వరకు కూడా శాసనసభ లో రాష్ట్ర ఆర్థిక సంఘ నివేదికను ప్రవేశపెట్టలేదు. దానిని మా ప్రభుత్వం ఆమోదించి ఈ సభ ముందు ఉంచుతున్నాము.

**ఈ బడ్జెట్‌లో పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 40,080 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నాం.**

## హైదరాబాద్ మెడలో అందమైన హారంగా మూసీ

తెలంగాణ రాష్ట్రానికి హైదరాబాద్ పాలనా కేంద్రం మాత్రమే కాదు, రాష్ట్ర అభ్యున్నతికి అవసరమైన ఆర్థిక వనరులను అందించే గుండెకాయ లాంటిది. హైదరాబాద్‌కు ఈ ఆర్థిక శక్తిని ఇచ్చింది గత కాంగ్రెస్ ప్రభుత్వాలే. రక్షణ రంగ సంస్థలు, ఫార్మా పరిశ్రమలు, ఐటీ పరిశ్రమల వంటి మౌలిక పరిశ్రమల స్థాపన మొదలుకొని మెట్రో రైలు వరకు... శంషాబాద్ విమానాశ్రయం మొదలుకొని ఓఆర్ఆర్ వరకు, తాగునీటి అవసరాలకోసం మంజీరా, కృష్ణా, గోదావరి జలాల సరఫరా, నగరానికి 24 గంటల విద్యుత్తు సరఫరా చేసే వ్యవస్థతో పాటు హైదరాబాద్ లో అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాల కల్పన కూడా జరిగింది గత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే.

హైదరాబాద్ అభివృద్ధి ద్వారా సృష్టించబడిన సంపద ఏ కొందరు అధికారులు లేదా నాయకుల స్వార్థం కోసం కాదు, అది యావత్తు ప్రజలందరికి చెందాలనేదే మా లక్ష్యం... మా మార్గం. అందుకే పాలనాపరంగా అన్ని సంస్థలను, వ్యవస్థలను ప్రక్షాళన చేస్తున్నాం.

మూసీ ప్రక్షాళనతో పాటు మూసీ పరీవాహక ప్రాంతాన్ని ఉపాధికల్పనా జోన్ గా మార్చే కార్యాచరణ మొదలు పెట్టాం. మూసీ అంటే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నుండి దానిని పునర్జీవింపచేయడానికి వడివడిగా అడుగులు వేస్తున్నాం. మూసీ రివర్ ఫ్రంట్ ను అభివృద్ధిపరిచేందుకు నూతన విధానాలను ఆకళింపు చేసుకుంటున్నాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు అధికారులు ఇటీవల లండన్ పర్యటన సందర్భంగా థేమ్స్ నది నిర్వహణ తీరును పరిశీలించారు. ఏ మాత్రం కాలుష్యం లేకుండా థేమ్స్ నది లండన్ నగరం మధ్య నుంచి ప్రవహిస్తున్న తరహాలోనే మూసీ రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి పరచాలని ఆకాంక్షిస్తున్నాం. ఈ మేరకు ఇటీవల హైదరాబాద్ వచ్చిన బ్రిటిష్ హై కమిషనర్ అలెక్స్ ఎల్లిస్ మరియు నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ సుమన్ బెర్రిలతో కూడా ప్రభుత్వం చర్చలు జరిపింది.

హైదరాబాద్ మెడలో అందమైన హారంలాగ మూసీ నదిని తీర్చిదిద్దుతాం. దీని కోసం 1,000 కోట్ల రూపాయలు ఈ బడ్జెట్‌లో ప్రతిపాదిస్తున్నాం.



తెలంగాణలో అభివృద్ధి వికేంద్రీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. హైదరాబాద్ కేంద్రంగా రాష్ట్రాన్ని మూడు జోన్లుగా ప్రభుత్వం భావిస్తోంది. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న హైదరాబాద్ నగరం పట్టణ ప్రాంతంగా, ఔటర్ రింగ్ రోడ్డు-ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్డు మధ్య ఉన్న ప్రాంతం పెరి ఆర్బన్ జోన్‌గా, ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్డు ఆవల ఉన్న భాగాన్ని గ్రామీణ జోన్‌గా నిర్ధారించి దానికి తగ్గట్టుగా అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నది.

రాష్ట్రంలోని అన్ని పుర ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు పూర్తి స్థాయి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలియచేస్తున్నాం. రాష్ట్ర ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు పట్టణ ప్రాంత అభివృద్ధికి నిధులు విడుదల చేస్తాం.

**ఈ బడ్జెట్‌లో పురపాలక శాఖకు 11,692 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నాం.**



## త్వరలో రైతు రుణమాఫీ

రైతు బాగుంటేనే ఊరు బాగుంటుంది. వ్యవసాయం లాభసాటిగా ఉంటేనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. అందుకే రైతు రుణ మాఫీ అంశాన్ని మేం మా ఎన్నికల ప్రణాళికలో కూడా స్పష్టంగా పేర్కొన్నాం. ఎన్నికల ముందు ప్రజలకు హామీ ఇచ్చిన విధంగానే రైతు రుణమాఫీ పథకాన్ని అమలు చేయబోతున్నాం. 2 లక్షల రూపాయల రుణమాఫీ పై త్వరలోనే కార్యాచరణ ఉంటుంది. అందుకు విధివిధానాలను రూపొందిస్తున్నాం. ప్రతి పంటకు మద్దతు ధర ఇస్తాం.

ఈ సందర్భంలో మేము రైతుబంధు పథకం గురించి ఒక విషయం ఈ గౌరవ సభ ముందు ఉంచదల్చుకున్నాం. రైతుబంధు ముఖ్య ఉద్దేశ్యం రైతుకు పెట్టుబడి సాయం అందించడమేనని గత ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించింది. రైతుకు సాయం అందించడం అనేది ప్రశంసించదగిన విషయమే అయినా, ఈ పథకం పేరుతో అసలు రైతుల కన్నా పెట్టుబడిదారులు మరియు అనర్హులే ఎక్కువ లాభం పొందారని చెప్పడానికి ఎంతో చింతిస్తున్నాం. సాగు చేయని/ సాగు చేయడానికి పనికిరాని కొండలు, గుట్టలు ఆఖరికి రోడ్లు ఉన్న స్థలానికి కూడా రైతుబంధు సాయం ఇచ్చారు. పెట్టుబడిదారులు, బడా రియల్ ఎస్టేట్ కంపెనీలు కొనిపెట్టుకున్న వేలాది ఎకరాలకు కూడా రైతుబంధు సాయం అందింది. ఇది అక్రమం. ఇచ్చిన జి.ఓకు విరుద్ధంగా పథకాన్ని వర్తింపచేయడం అనేది గత ప్రభుత్వానికే సాధ్యం అయింది. జరిగిన ఈ అక్రమాల కారణంగా మేము రైతుబంధు నిబంధనలను పున:సమీక్ష చేసి నిజమైన అర్హులకు రైతు భరోసా కింద ఎకరాకి 15,000 రూపాయలు అందించేందుకు కృతనిశ్చయంతో ఉన్నాము. గతంలో కన్నా భిన్నంగా మేము కౌలు రైతులకు కూడా రైతు భరోసా సాయాన్ని ఇవ్వడానికి మార్గదర్శకాలను సిద్ధం చేస్తున్నాం.

అదే విధంగా ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కార్యక్రమాన్ని ఆధారంగా చేసుకుని రాష్ట్రంలో పంటల బీమా పథకాన్ని పటిష్టంగా అమలు చేయబోతున్నాం. పశ్చిమ బెంగాల్ లో అమలు జరుగుతున్న తీరును పరిశీలించిన అనంతరం దానికి సంబంధించి తుది నిర్ణయాన్ని తీసుకుంటామని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాం. రైతు బీమా పథకాన్ని కౌలు రైతులకు కూడా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అందుకు అవసరమైన మార్గదర్శకాలను రూపొందిస్తున్నాం.

విత్తన భాండాగారంగా ఉన్న తెలంగాణ ఇంకా ఎంతో ప్రగతిని సాధించడానికి అవకాశం ఉండి కూడా సాధించలేక పోయింది. విత్తనం నాణ్యమైనది అయితేనే రైతుకు మేలు కలుగుతుంది. విత్తనం నాశిరకంది అయితే రైతు శ్రమ అంతా బూడిదలో పోసిన పన్నీరు అవుతుంది. పంట చేతికి రాకపోవడమే కాకుండా అప్పటి వరకూ పెట్టిన పెట్టుబడి అంతా వృధా అయిపోతుంది.

గత ప్రభుత్వ హయాంలో నకిలీ విత్తనాల సమస్య తీవ్రంగా ఉండేది. గత ప్రభుత్వ అచేతనం వల్ల, నకిలీ విత్తనాల వల్ల అనేక మంది రైతులు మోసపోయి ఆత్మహత్యలకు కూడా పాల్పడ్డారు. నాసిరకం విత్తనాలను, నకిలీ విత్తనాలను అరికట్టేందుకు మా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుంది. రైతుకు నష్టం చేసే ఏ విత్తన వ్యాపారినీ మా ప్రభుత్వం ఉపేక్షించదు. దీనితో బాటు నాణ్యమైన విత్తన ఉత్పత్తి విషయాల్లో పురోభివృద్ధి సాధించేందుకు సకల చర్యలు చేపడుతున్నాం. ఈ మేరకు త్వరలో ఒక నూతన "విత్తన విధానం" తీసుకురా బోతున్నాం. ఈ సంవత్సరంలో ఆయిల్ పాం సాగు విస్తరణ, అదనంగా లక్ష ఎకరాలు పెంచడానికి తగు చర్యలు తీసుకుంటున్నాం. ఇవన్నీ రైతును రాజును చేయడానికి మేం తీసుకోబోతున్న చర్యలు.

**ఈ బడ్జెట్ లో వ్యవసాయ శాఖకు 19,746 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నాం.**

## భూపరిపాలన

గత ప్రభుత్వం ఎంతో హడావుడిగా, ఎలాంటి అధ్యయనం చేయకుండా తీసుకువచ్చిన ధరణి పోర్టల్ కారణంగా ప్రజలు ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారు. "ధరణి కొంతమందికి భరణంగా మరికొంత మందికి ఆభరణంగా చాలా మందికి భారంగా మారింది". గత ప్రభుత్వం చేసిన తప్పులతో ఎంతో మంది తమ అవసరాల కోసం సొంత భూమిని కూడా అమ్ముకోలేకపోయారు. పిల్లల పెళ్లిళ్లకు, చదువులకు ఇతర అవసరాలను తీర్చుకోలేక తీవ్ర ఆవేదన చెందారు. ఇదంతా లోపభూయిష్టమైన ధరణి పోర్టల్ కారణంగానే జరిగింది. ఇప్పుడు మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, రికార్డులు పరిశీలించిన మీదట, ఇది నిజమేనని తేలింది. అందుకే ఈ సమస్యను పరిష్కరించేందుకు మా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిచ్చింది. ఇచ్చిన హామీ మేరకు రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు సత్వర చర్యలు తీసుకున్నాం. ధరణి పోర్టల్ అమలు కారణంగా వచ్చిన సమస్యలను అధ్యయనం చేయడానికి ఐదుగురు సభ్యులతో ఒక కమిటీని నియమించాం. అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే ఇంతటి కీలకమైన నిర్ణయం తీసుకుని నిపుణుల కమిటీకి బాధ్యత అప్పగించడం గతంలో ఎన్నడూ జరగలేదు.

## ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమం

రివరెండ్ మార్టిన్ లూథర్ కింగ్ (జూనియర్) అన్నట్టు – "నాకూ ఒక కల ఉంది. ఒక రోజున మన దేశం నిజమైన ఆదర్శాల స్వరూపంగా ఎదుగుతుందని ఆశిస్తున్నాను. మనుష్యులంతా సమానంగా సృష్టించబడ్డారు అన్న సత్యానికి ఆదర్శంగా నిలుస్తుంది, అని తలుస్తున్నాను."

జనాభాలో అత్యధిక శాతం మంది ఇంకా పేదరికంలోనే ఉంటే అది నిజమైన అభివృద్ధి కాదు. మన తెలంగాణా రాష్ట్రంలో గత దశాబ్ద కాలంగా పేదలకు, ధనికులకు మధ్యనున్న అంతరం మరింత పెరిగింది. అందుకే, రాష్ట్ర సంపద వనరులు ప్రజలందరికి చెందేటట్లుగా చేస్తామని మేము ఇచ్చిన హామీలను ప్రజలు విశ్వసించారు. వారి విశ్వాసానికి విఘాతం కలిగించకుండా పటిష్టమైన ప్రణాళికతో ముందుకు సాగుతామని, వారికి నిజమైన అభివృద్ధిని అందిస్తామని ఈ సందర్భంగా మీకు తెలియచేస్తున్నాం. ఎస్సీ గురుకులాల భవన నిర్మాణాలకి 1,000 కోట్ల రూపాయలు, ఎస్టీ గురుకులాల భవన నిర్మాణాలకి 250 కోట్ల రూపాయలు ఈ బడ్జెట్ లో ప్రతిపాదించాం.

గురుకుల పాఠశాలల సొసైటీ ద్వారా నూతనంగా రెండు ఎం.బి.ఎ కళాశాలల ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించాం. వీటి ప్రతిపాదనలను ఇప్పటికే ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (A.I.C.T.E) వారికి తగిన అనుమతి కొరకు సమర్పించడం జరిగింది. రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలకు బోధనా సిబ్బంది నియామకాలు అతి త్వరలో పూర్తి చేయబోతున్నాం.

**ఎస్సీ సంక్షేమానికి 21,874 కోట్ల రూపాయలు, ఎస్టీ సంక్షేమానికి 13,313 కోట్ల రూపాయలు మరియు మైనారిటీ సంక్షేమానికి 2,262 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నాం.**

## బి.సి. సంక్షేమం

"మనిషిని మహోన్నతుడిగా తీర్చి దిద్దేది విద్య ఒక్కటే" అని చెప్పిన మహాత్మా జ్యోతిబాపూలే అడుగుజాడల్లో నడిచేందుకు సంకల్పించుకున్న ప్రభుత్వం మాది. ఈ దిశలోనే మేము బీసీ డిక్లరేషన్ ఇచ్చి తెలంగాణలోని వెనుకబడిన ప్రజల ఆకాంక్షలు తీర్చేందుకు ముందుకు వెళుతున్నాం.

బీసీ విద్యార్థులకు ఉపకార వేతనాలను క్రమం తప్పకుండా అందిస్తాం. అంతే కాదు, విదేశీ విద్యా పథకం క్రింద మరింత ఎక్కువ మంది విద్యార్థులకు చేయూత అందిస్తాం. ఈ చర్యల ద్వారా బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు మరే ఇతర విషయాల గురించి ఆలోచించకుండా విద్యాభ్యాసం చేసి జీవితంలో ఉన్నత శిఖరాలను అందుకునే విధంగా వారికి సహాయపడతాం. ప్రయివేటు భవనాల్లో ఉన్న బీసీ హాస్టళ్లకు ప్రభుత్వ భవనాలు కట్టిస్తాం.

**రాష్ట్రంలో ఉన్న వెనుకబడిన తరగతుల గురుకులాలకు స్వంత భవనాల నిర్మాణానికి ఈ బడ్జెట్ లో 1,546 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నాం.**

రాష్ట్రంలో ఇప్పటికి సాంప్రదాయ వృత్తులలో కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నాయి. వారికి నూతన సాంకేతికతలో శిక్షణ ఇచ్చి అవసరమైన పనిముట్లు అందజేస్తాం. వారు చేసిన ఉత్పత్తులకు మేలైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తూ వారి అభ్యున్నతికి సహకరిస్తాం. అదే సమయంలో వారి పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు సహాయం చేస్తాం. వారు ఐ.ఐ.టి మరియు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలలో సీట్లు సాధించేలా అవసరమైన శిక్షణను ఏర్పాటు చేస్తాం. భవిష్యత్తులో వారు విదేశీ ఉద్యోగావకాశాలు కూడా అందిపుచ్చుకునేటట్టు వారిని తయారు చేస్తాం.

**ఈ బడ్జెట్‌లో బి.సి సంక్షేమానికి 8,000 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నాం.**

## పర్యాటక రంగానికి ప్రోత్సాహం

**తెలంగాణ** రాష్ట్రానికి ఎనలేని వారసత్వ సంపద ఉన్నది. మనం చేయాల్సిందల్లా వాటిని కాపాడి భావితరాలకు అందివ్వడమే. పర్యావరణ సమతుల్యాన్ని కాపాడే అడవులు, నిత్యం పారే, సెలయేళ్లు, ఆకాశం నుంచి దుమికే ఎత్తిపోతలు, చరిత్రకు సాక్ష్యాలుగా కోటలు, భక్తి పారవశ్యాన్ని పంచే... పెంచే దేవాలయాలు... కొలనుపాక జైన్ మందిరం, నాగార్జున సాగర్, నేలకొండ పల్లి బౌద్ధ స్థూపాలు, ఒక్కటేమిటి తెలంగాణ తల్లి ఒడిలో ఇలాంటి అపురూప చిత్రాలు ఎన్నో... అలాంటి ప్రదేశాలను పర్యాటక ప్రాంతాలుగా రూపుదిద్దితే భావితరాలు కూడా వాటిని కాపాడుకుంటాయి.

ఇంతటి ఘనమైన ఆశయంతో రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు నూతన విధానాన్ని రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

## మహిళా శిశు సంక్షేమం

సమాజంలో సగభాగం మహిళలే. మహిళా సాధికారత అనేది కొందరికే పరిమితం కారాదు. ఈ కారణంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం తమ మ్యానిఫెస్టో లో సింహభాగం మహిళల గురించే హామీలు ఇచ్చింది. తెలంగాణ ఆడబిడ్డలను మహాలక్ష్ములను చేయాలనే ఆలోచనతోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని డిసెంబర్ 9న ప్రారంభించుకున్నాం. ఇందిరా క్రాంతి పథం ద్వారా మహిళా స్వయం సహాయక సంఘాలను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తాం.

> **"పిల్లలు ఉద్యానవనంలో మొగ్గల్లాంటి వారు. రేపటి పౌరులు. జాతి భవిష్యత్తు నిర్మించేది వాళ్లే. కాబట్టి వారిని జాగ్రత్తగా ప్రేమగా పెంచాలి"**

అని భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ఏనాడో చెప్పారు. ఆ సూక్తిని పాటించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అకుంఠిత దీక్షతో పని చేస్తుంది. పాఠశాల విద్యపై మా ప్రభుత్వం ఎక్కువ శ్రద్ధ చూపాలని నిర్ణయించింది. అవసరమైన నిధులు అందుబాటులో ఉంచడమే కాకుండా అన్ని స్కూళ్లలో డిజిటల్ క్లాస్ రూంలను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం.

రాష్ట్రంలో ఉన్న 35,781 అంగన్ వాడీ కేంద్రాల ద్వారా గర్భిణి స్త్రీలకు, బాలింతలకు పోషకాహారాన్ని అందించే కార్యక్రమాన్ని పటిష్ఠంగా చేపడుతున్నాం.

## ప్రతి మండలానికి పబ్లిక్ స్కూల్

తెలంగాణ రాష్ట్రాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తయారు చేయాలనేది రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం. అంతే కాదు, పేదవారు సైతం ఉన్నత విద్యను అందుకునే విధంగా ఫీజు రీఇంబర్స్‌మెంట్ విధానాన్ని తీసుకువచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే. అయితే గత ప్రభుత్వం ఫీజు రీఇంబర్స్‌మెంట్ నిధులను సరైన సమయంలో విడుదల చేయకపోవడం వల్ల ఎంతోమంది విద్యార్థులు తమ చదువు పూర్తయి కూడా కాలేజీల నుండి తమ అర్హత సర్టిఫికెట్లను పొందలేక ఎన్నో విలువైన అవకాశాలు కోల్పోయి తీరని నష్టం చవి చూశారు. ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన సాంప్రదాయాన్ని మరింత పకడ్బందీగా ముందుకు తీసుకువెళ్లడానికి ఈనాటి మా ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ఫీజు రీఇంబర్స్‌మెంట్‌తో బాటుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ బాలబాలికలకు ప్రస్తుత స్కాలర్ షిప్‌లను సకాలంలో అందించేందుకు కూడా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

ప్రతి మండలానికి అధునాతనమైన సౌకర్యాలతో, అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా మీకు తెలియచేస్తున్నాం. కళాశాల స్థాయిలో ఉద్యోగానికి అవసరమైన మేరకు కోర్సులను ప్రవేశపెట్టి పోటీ ప్రపంచంలో తెలంగాణ విద్యార్థులు నెగ్గుకు రాగల సమర్థతను సమకూరుస్తాం. ఉన్నత విద్యామండలిని పూర్తిగా ప్రక్షాళన చేసి ఉన్నత విద్యలో ప్రమాణాలను మెరుగుపరుస్తాం. పైలెట్ ప్రాతిపదికన తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటుకు ఈ బడ్జెట్‌లో 500 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నాం.

రాష్ట్రంలో సాంకేతిక విద్యను మరింత పటిష్ఠంగా మరియు పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా సమాయత్తం చేయడానికి మన రాష్ట్రంలోని 65 ఐ.టి.ఐలను ప్రయివేటు సంస్థల భాగస్వామ్యంతో ఒక బృహత్తర ప్రణాళికను అమలుపరచబోతున్నాం. ఈ ఐ.టి.ఐ.లలో అదనంగా సీట్లు పెంచి ఎక్కువ మంది విద్యార్థులకు శిక్షణను అందిస్తాం. ఇక్కడ శిక్షణ పొందిన విద్యార్థులకు వంద శాతం ఉద్యోగాలు పొందేలా ప్రణాళిక ఉంటుంది. ఈ పథకానికి మంత్రివర్గ ఆమోదం కూడా లభించిందని చెప్పడానికి సంతోషిస్తున్నాను.

స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుపై కూడా రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. గుజరాత్, ఢిల్లీ, ఒడిశా రాష్ట్రాలలోని స్కిల్ యూనివర్సిటీలను అధ్యయనం చేసేందుకు అధికారుల బృందం ఇటీవల పర్యటన జరిపింది. ఆయా రాష్ట్రాలలో అమలు చేస్తున్న విధానాలను పరిశీలించి అత్యుత్తమ విధానాలను మన రాష్ట్రంలో అమలు జరిపేందుకు ప్రయ త్నిస్తున్నాం. ఉస్మానియా విశ్వవిద్యాలయం మొదలుకొని రాష్ట్రంలో ఉన్న అన్ని విశ్వవిద్యాలయాలలో ఉన్నత విద్యను ప్రోత్సహించడానికి మౌలిక సదుపాయాల కల్పనకు 500 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నాం. విద్యారంగానికి ఈ బడ్జెట్‌లో 21,389 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నాం.

## యువజన సంక్షేమం

యువకులను రెచ్చగొట్టడం కాదు... అక్కున చేర్చుకుంటాం... వారికి ఆసరాగా ఉంటాం... ఆదు కుంటాం... స్వేచ్ఛాయుత తెలంగాణలో ఆత్మగౌరవంతో బతికే ఏర్పాట్లు చేస్తాం... యువతే దేశానికి భవిష్యత్తు... అంటూ కూనిరాగాలు తీయడం కాదు... చిత్తశుద్ధితో వారి మెరుగైన జీవితానికి బాటలు వేస్తాం. ఇది మా వాగ్దానం మాత్రమే కాదు... ఇది మా విధానం...

గత ప్రభుత్వం చేసిన పనులతో యువతలో ఆత్మస్థైర్యం దెబ్బతిన్నది. వారు భవిష్యత్తుపై ఆశను కోల్పోయారు. వారి భవిష్యత్తుకు మేం గ్యారెంటీ ఇచ్చాం. అందుకే రాష్ట్రంలోని యువత మొత్తం మా వెనుక నిలిచింది. మమ్మల్ని గెలిపించింది. ఈ నిజం మాకు తెలుసు కాబట్టి బాధ్యతగా ఉంటాం.



చెప్పిన మాట ప్రకారం ఉద్యోగ నియామకాల విషయంలో జాబ్ క్యాలెండర్ తయారు చేసే ప్రక్రియను ప్రారంభించాం. మెగా డీఎస్సీ నిర్వహించబోతున్నాం. దాదాపు 15 వేల మంది కానిస్టేబుళ్ల రిక్రూట్ మెంట్ అతి త్వరలో పూర్తి చేసి, నియామక పత్రాలు ఇవ్వబోతున్నాం. ఇప్పటికే నోటిఫికేషన్‌లో చేర్చినవి కాకుండా అదనంగా 64 గ్రూప్ వన్ ఉద్యోగాల భర్తీకి ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. పది సంవత్సరాలు పాలించిన గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వం ఒక్క గ్రూప్ వన్ ఉద్యోగం కూడా నియామకం చేయకుండా నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడింది.

తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమీషన్ సరైన దారిలో నిరుద్యోగ యువత ఆకాంక్షలను నెరవేర్చే విధంగా పనిచేయడానికి ప్రక్షాళన చేయడం జరిగింది. టి.యస్.పి.ఎస్.సి తన కర్తవ్యం నిర్వహించడానికి అవసరమైన 40 కోట్ల రూపాయలు ఆర్థిక వనరులను, అదనపు సిబ్బందిని ఇప్పటికే మంజూరు చేశాం.

## కార్మిక సంక్షేమం

తెలంగాణ రాష్ట్రంలోని కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తున్నది. సంఘటిత కార్మికులకు, అసంఘటిత కార్మికులకు అందించే సాయాన్ని మరింత పకడ్బందీగా అందుబాటులో ఉంచుతాం. నిబంధనలను సరళీకరించడం ద్వారా ఎక్కువ మందికి లాభం చేకూరే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

మా ప్రభుత్వం గిగ్ వర్కర్ల సంక్షేమానికి కూడా పునాదులు వేసింది. గిగ్ వర్కర్ అంటే ఒక తాత్కాలిక ఉద్యోగి లాంటి వాడు. సాంప్రదాయ ఉద్యోగుల వలే కాకుండా, గిగ్ ఎకానామీ కార్మికులకు, పూర్తి సమయ ఉద్యోగికి ఉండే భద్రత, ప్రోత్సాహకాలు మరియు ఉద్యోగ ప్రయోజనాలు ఉండవు. వారికి ఏదైనా ప్రమాదం సంభవించి ప్రాణాలు కోల్పోతే వారి కుటుంబం మొత్తం రోడ్డున పడుతుంది.

అందుకే మా ప్రభుత్వం, ప్రమాదవశాత్తూ మరణించిన వారికి ఈ సామాజిక భద్రత స్కీమ్ కింద 5 లక్షల రూపాయల ప్రమాద బీమా పథకాన్ని వర్తింపచేస్తూ డిసెంబర్ 30, 2023 న ఉత్తర్వులు జారీ చేశాం.

## వైద్య ఆరోగ్యం

ప్రజల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యత కల్పిస్తున్నాం. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్య శ్రీ అనే గొప్ప పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకాన్ని పెరిగిన వైద్య ఖర్చులకు అనుగుణంగా, ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా మరింత విస్తృతపరిచి 10 లక్షల రూపాయల వరకు ఉచిత వైద్యం పొందేలా ఇప్పటికే ప్రారంభించాం.

మా ప్రభుత్వం అసంపూర్తిగా ఉన్న సూపర్ స్పెషాలిటి మరియు ఇతర ఆసుపత్రులు, మెడికల్ కాలేజీలు, నర్సింగ్ కాలేజీల నిర్మాణానికి కావలసిన నిధులను మంజూరు చేసి వాటిని త్వరలోనే పూర్తి చేస్తుంది. హైదరాబాద్‌లో వైద్య సేవలు విస్తృత పరిచేందుకు వీలుగా నిమ్స్ వైద్యశాల విస్తరణను పూర్తి చేసేందుకు తగిన నిధులు కేటాయిస్తాం. పాతబస్తీలోని చారిత్రాత్మక ఉస్మానియా ఆసుపత్రి నూతన భవన నిర్మాణాన్ని త్వరలోనే ప్రారంభిస్తాం. ప్రకటనలకే పరిమితం అయిన వైద్యరంగంలోని సిబ్బంది నియామకాలను తగిన కాలపరిమితితో పూర్తి చేస్తాము. మా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 6,956 నర్సింగ్ ఆఫీసర్ల నియామకాల ప్రక్రియను పూర్తి చేసి వారికి నియామక పత్రాలను అందచేయడం జరిగింది. ప్రభుత్వ వైద్యశాలలను మరింత పటిష్టపరచి, వాటి నిర్వహణకు కావలసిన నిధులను మంజూరు చేస్తాము. నూతన వైద్యకళాశాలలకు అవసరమైన సిబ్బందిని మరియు వనరులను సమకూరుస్తాము.

**వైద్యారంగానికి ఈ బడ్జెట్‌లో 11,500 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నాం.**

# చేనేత

తెలంగాణ రాష్ట్రం చేనేత కార్మికులకు పుట్టినిల్లు. తెలంగాణకు గర్వకారణంగా ఉన్న చేనేత పరిశ్రమను ప్రోత్సహించడం అంటే తల్లి తెలంగాణ ముద్దుబిడ్డల్ని గౌరవించుకోవడమే. తెలంగాణలోని వివిధ ప్రాంతాలలో వివిధ రకాల చేనేత కార్మికులు ఉన్నారు. మన చేనేత అన్నలు చేసే ప్రతి పని ప్రత్యేకమే... ప్రతి వస్త్రం అద్భుతమే. రాష్ట్ర ప్రభుత్వం తరపున చేనేత కార్మికులకు సంబంధించి అత్యంత కీలకమైన నిర్ణయాన్ని తీసుకున్నాం. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వానికి అవసరమైన వస్త్రాలను, స్కూలు విద్యార్థులకు అందించే స్కూలు యూనిఫారంలను ఒకే చోటు నుంచి కొనుగోలు చేస్తున్నది. ఈ పద్ధతిని సమూలంగా మార్చి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చేనేత కార్మికుల నుంచి కొనుగోలు చేయాలని అనుకుంటున్నాము. ఇందుకు సంబంధించిన నియమ నిబంధనలు రూపొందించేందుకు, చేనేత కార్మికులు లాభం పొందే విధంగా ఉండేందుకు తగిన సూచనలు సలహాలు తీసుకోవడానికి త్వరలో ఒక ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయబోతున్నాము. చేనేత కార్మికులు ఈ సమావేశంలో అందించే అతి విలువైన సలహాలను మా ప్రభుత్వం వినమ్రంగా స్వీకరిస్తుంది. వాటిని చిత్తశుద్ధితో అమలు చేస్తుంది. అగ్గిపెట్టెలో పట్టే చీర నేసిన తెలంగాణ అద్భుత చేనేత కళా వైభవాన్ని తిరిగి ఈ ప్రపంచం ముందు ఉంచుతాం.



# అడవులు, పర్యావరణం

తెలంగాణ రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం విశేష ప్రాధాన్యతనిస్తున్నది. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నియంత్రించడానికి ప్రజల సహకారంతో అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ఈ సంవత్సరంలో ప్రభుత్వం బయోడైవర్సిటీ మేనేజ్‌మెంట్ కమిటీలను పటిష్టపరచడం, పర్యావరణ అవగాహన మరియు శిక్షణ కార్యక్రమాలు చేపట్టబోతున్నాం. అంతేకాకుండా, తెలంగాణ మత్స్య సంపద వైవిధ్యం, వెదురు పంటల సంరక్షణ మరియు పునరుజ్జీవం, చిత్తడి నేలల సంరక్షణకి సంబంధించిన కార్యక్రమాలు చేయబోతున్నాం.

## విద్యుత్ రంగం

రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వడం అనేది కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రారంభించిన విధానం. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులు ఈ ఉచిత విద్యుత్ పథకంతో ఎంతో ఆనందంగా ఉండేవారు. తెలంగాణ రాష్ట్రంలో అప్పటివరకూ కొనసాగిన రైతు ఆత్మహత్యలు ఆగిపోవడానికి ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ విషయంలో అనుసరించిన వ్యూహాత్మక విధానాలే అనే విషయం మేము ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాం. రాష్ట్రంలోని రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ ను అందించడానికి ఈ ప్రభుత్వం కట్టుబడి ఉంది.

రాష్ట్రంలోని అర్హులైన కుటుంబాలకి "గృహ జ్యోతి" పథకం కింద 200 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా అందచేసేందుకు ఇప్పటికే మంత్రివర్గ నిర్ణయం జరిగింది. దానిని అమలు చేసే సత్వర చర్యలు చేపడుతున్నాము. ఈ పథకానికి బడ్జెట్‌లో 2,418 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నాం.

**రాష్ట్రంలో ట్రాన్స్ కో మరియు డిస్కమ్ లకి ఈ బడ్జెట్ లో 16,825 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నాం.**

## గృహ నిర్మాణ శాఖ

రాష్ట్రంలో అవసరమైన వారందరికి డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించి ఇస్తామని గత ప్రభుత్వం చేసిన వాగ్దానాన్ని గాలికి వదిలివేసింది. గత ప్రభుత్వం చెప్పిన విషయాలు విని తెలంగాణ రాష్ట్ర ప్రజలు డబుల్ బెడ్ రూం ఇండ్లపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ప్రజల అవసరాలను, ఆశలను గత ప్రభుత్వం వారి రాజకీయ అవసరాలకు మాత్రమే వాడుకుంది.

కానీ, మా ప్రభుత్వం, ఆరు గ్యారెంటీలలో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇళ్లు లేని వారికి ఇంటి స్థలం, స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల సాయం అందించడానికి అవసరమైన కార్యాచరణ మొదలు పెడుతున్నది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం క్రింద పొందగలిగిన నిధులను గత ప్రభుత్వం వినియోగించుకోలేకపోయింది. అందుకోసమే ఇప్పుడు కేంద్రం నుంచి అత్యధిక నిధులు రాబట్టి వాటిని తెలంగాణ ప్రజలకు మరింత ఎక్కువ లబ్ధి చేకూర్చేలా వినియోగిస్తాం. ఈ సంవత్సరం ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ప్రతీ నియోజకవర్గానికి 3 వేల 500 ఇండ్ల చొప్పున మంజూరు చేస్తామని తెలియజేయడానికి ఎంతో సంతోషిస్తున్నాం. ఈ పథకానికి బడ్జెట్‌లో 7,740 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నాం.

## రోడ్లు భవనాలు

రహదారులే ప్రగతికి సూచికలు. అందుకోసమే ప్రతి మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి డబుల్ లైన్ కనెక్టివిటీని అభివృద్ధి పరచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ఇప్పటివరకూ ఇలా అనుసంధానించబడని ప్రాంతాలకు అధిక ప్రాధాన్యతనిస్తాం. నదులపైనా, వాగులపైనా ఇప్పటి వరకూ కనెక్టివిటీ లేని ప్రాంతాలను ఎంపిక చేసుకుని నూతన బ్రిడ్జిల నిర్మాణం ద్వారా అనుసంధానం చేస్తాం. మరీ ముఖ్యంగా గిరిజన ఆవాసాలకు రోడ్డు కనెక్టివిటీని కల్పిస్తాం. గ్రామీణ ప్రాంతాలలోని రోడ్లను మరింత మెరుగ్గా తీర్చిదిద్దడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త రూపు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నాం.

జిల్లా కేంద్రాలలో ఇంకా పూర్తి కాని కలెక్టరేట్ భవనాలను సత్వరమే పూర్తి చేస్తాం. వివిధ శాసనసభ నియోజకవర్గ కేంద్రాలలో ఎమ్మెల్యేల కార్యాలయాల నిర్మాణం పూర్తి చేస్తాం. రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన రీజినల్ రింగ్ రోడ్డు విషయంలో భూ సేకరణకి అవసరమైన నిధులు కేటాయించి యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలనేది మా లక్ష్యం.

## నీటిపారుదల

నీళ్లు, నిధులు, నియామకాల కోసం కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రం ఈ పది సంవత్సరాల కాలంలో నీటిపారుదల రంగంలో గణనీయమైన అభివృద్ధి సాధించి ఉండాల్సింది. పచ్చని పైర్లతో తెలంగాణ భూభాగం కళకళలాడాల్సి ఉంది. అయితే గత పదేండ్లలో జరిగిన తప్పిదాలు నీటిపారుదల రంగంలో సాధించాల్సిన ప్రగతికి అవరోధాలుగా మారాయి. ఈ కఠోర వాస్తవం గ్రహించినప్పుడే మనం భవిష్యత్తులో ఇలాంటి తప్పులు పునరావృతం కాకుండా చూసుకోగలుగుతాం. అందుకే ఈ విషయాలను మొహమాటం లేకుండా ప్రస్తావిస్తున్నాం. నీటిపారుదల రంగ నిపుణుల సూచనలు పట్టించుకోకుండా, మేధావుల సలహాలు పాటించకుండా కేవలం మనకు తెలిసిందే వేదం అన్న రీతిలో గత ప్రభుత్వం వ్యవహరించిందనడంలో సందేహం లేదు. ఏదైనా రాష్ట్రం నీటిపారుదల రంగంపై విశేష శ్రద్ధ చూపిస్తే అద్భుతాలు సాధించడానికి పదేండ్ల కాలం సరిపోతుంది. అయితే ఈ దశాబ్ద కాలంలో అనుసరించిన "ఒంటెద్దు పోకడ" సాగునీటి రంగాన్ని, ఆర్థిక రంగాన్ని అతలాకుతలం చేసింది.

కాంట్రాక్టర్ల కోసం ప్రాజెక్టులు నిర్మించే విధానం తెలంగాణకు శాపంగా మారింది. లక్షల కోట్ల రూపాయల ఖర్చులో అవినీతి ఎంతో తేల్చాల్సిన బాధ్యత మాపై పడింది. అందుకే కాళేశ్వరం ప్రాజెక్ట్ లోని మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బ్యారేజీల నిర్మాణంలో జరిగిన నాణ్యతా లోపం, అవినీతి కార్యక్రమాలు, అనాలోచిత విధానాల అవకతవకలపై విచారణ జరిపిస్తామని మేం ప్రజలకు మాట ఇచ్చాం. ఆ మాట నిలబెట్టుకునే దిశగా కార్యాచరణ ఉంటుంది. కృష్ణా మరియు గోదావరి జలాల్లో తెలంగాణకు న్యాయంగా రావలసిన నీటి కేటాయింపులకోసం ఎక్కడ కూడా రాజీ పడకుండ పోరాటం చేసి, తెలంగాణ రైతుల ప్రయోజనాలు కాపాడడానికి ఎంత దూరం అయినా వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాము.

గత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ప్రాణహిత – చేవేళ్ల ను పూర్తి చేసి ఎగువ ప్రాంతాలైన ఆదిలాబాద్ మరియు ఇతర జిల్లాలకు సాగునీరు ఇవ్వాలన్నది మా ప్రభుత్వ లక్ష్యం. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులలో తక్కువ ఖర్చుతో తొందరగా పూర్తి చేయగలిగి ఎక్కువ ఆయకట్టుకి నీరు అందించే వాటిని సత్వరమే పూర్తి చేయాలనేది ప్రభుత్వ ఆలోచన. వాటిలో ఎఎంఆర్ శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్, మహాత్మగాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, జవహర్ నెట్టెంపాడు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, రాజీవ్ భీమా లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, కోయిల్ సాగర్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, ఎస్ఆర్ఎస్పి ఇందిరమ్మ వరద నీటి కాల్వ, జె చొక్కారావు దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, కొమురంభీం మరియు చిన్న కాళేశ్వరం ఉన్నాయి.

**ఈ బడ్జెట్‌లో నీటిపారుదల శాఖకు 28,024 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నాం.**

## దేవాదాయ, ధర్మాదాయం

పవిత్ర పుణ్య క్షేత్రాలైన వేములవాడ, భద్రాచలం, బాసర, జమాలాపురం (చిన్న తిరుపతి), ధర్మపురిలను మరింత ఆకర్షణీయంగా, భక్తులకు సౌకర్యవంతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అందుకు అవసరమైన కార్యాచరణ త్వరలో ప్రారంభం కాబోతున్నదని తెలియచేయడానికి సంతోషిస్తున్నాం. ప్రముఖ పుణ్యక్షేత్రాలను అనుసంధానం చేస్తూ టూరిజం సర్క్యూట్‌లను ఏర్పాటు చేసేందుకు కూడా సత్వర చర్యలు తీసుకుంటాం. దేవాదాయ ధర్మాదాయ శాఖకు చెందిన వేలాది ఎకరాల అన్యాక్రాంత భూములను గుర్తించి వాటిని పరిరక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

మన గిరిజనుల పెద్ద పండుగైన మేడారం జాతర ఘనంగా నిర్వహించబోతున్నాం. దేశంలోనే అతి పెద్ద అడవి బిడ్డల జాతరలో సమ్మక్క-సారలమ్మ తల్లులను దర్శించుకోవడానికి సుదూర ప్రాంతాల నుండి వచ్చే జనం కోసం అన్ని సౌకర్యాలను కల్పించాం. 110 కోట్ల రూపాయల నిధులను కూడా విడుదల చేశాం. భక్తులు సులభంగా బంగారం మొక్కులు చెల్లించుకొనేందుకు వీలుగా ఆన్ లైన్ పోర్టల్ కూడా ప్రారంభించాం.

# రెండు తీర్మానాలు, మూడు బిల్లులకు ఆమోదం

శాసనసభ బడ్జెట్ సమావేశాలు 8 రోజులపాటు విజయవంతంగా కొనసాగాయి. ఈ సభలో రెండు తీర్మానాలు, మూడు బిల్లులకు ఆమోదం లభించింది. కృష్ణా నది యాజమాన్య బోర్డుకు ప్రాజెక్టులను అప్పగించేది లేదంటూ ఒక తీర్మానం, రాష్ట్రంలో కులగణన చేపట్టాలంటూ మరో తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టి ఆమోదంప చేశారు. బడ్జెట్ అప్రాప్రియేషన్ సహా మూడు బిల్లులకు సభ ఆమోదం తెలిపింది. సభ మొత్తం 45.32 గంటలపాటు నడిచింది. ముఖ్యంగా కృష్ణా యాజమాన్య బోర్డుకు కృష్ణా నది ప్రాజెక్టుల పర్యవేక్షణ అప్పగించడం, నీటిపారుదలశాఖపై శ్వేత పత్రం, కులగణన తదితర అంశాలపై తీవ్రస్థాయిలో చర్చ జరిగింది.

ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ పాలనలో జరిగిన ఆర్థిక అవకతవకలు, నీటిపారుదల రంగంలో చేసిన పొరపాట్లను ఎత్తి చూపడంలో సభలో అధికారపక్షం విజయవంతమైంది. అప్పటి పాలకుల అవనీతిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సహా మంత్రులు, శాసనసభ్యులు ఎండగట్టారు. మొత్తంగా సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 3.10 గంటలు మాట్లాడగా, సీఎం, మంత్రులు కలిపి 15.56 గంటలు సభలో ప్రసంగించారు. కాంగ్రెస్ సభ్యులు 8.43 గంటలపాటు ప్రసంగించారు.

**శాసన మండలి** బడ్జెట్ సమావేశాలు 7 రోజులు జరిగాయి. ద్రవ్యవినిమయ బిల్లు, మత్తు పదార్థాల నియంత్రణ బిల్లులు, కుల గణన, కృష్ణా ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించమని చేసిన తీర్మానాలు ఏకగ్రీవంగా మండలి ఆమోదం పొందాయి. విపక్షాల విమర్శలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధీటైనసమాధానమిచ్చారు.

## సినిమాటో గ్రఫీ

**ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన విధంగా ఇక నుంచి నంది అవార్డును "గద్దర్" అవార్డు పేరుతో చిత్ర మరియు టీవీ కళాకారులకు అందచేయబోతున్నాము. ప్రజా యుద్ధ నౌక గద్దరన్నకు ఇది మేమిచ్చే నివాళి. గద్దరన్నను గౌరవించుకోవడం అంటే తెలంగాణ సంస్కృతిని, ప్రగతిశీల భావజాలంతో సమాజాన్ని చైతన్య పరిచే ప్రజా కవులని, ప్రజాగాయకులని గౌరవించుకోవడమే.**

**అందుకే ఇక నుంచి గద్దర్ అవార్డులు తెలంగాణ కళాకారుల కీర్తిపతాకను ప్రపంచానికి చాటి చెబుతాయి.**

## ప్రణాళిక (ప్లానింగ్)

రాష్ట్రంలోని వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సత్వర అభివృద్ధి సాధించేందుకు, ప్రజా అవసరాలను గుర్తించి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సంబంధిత మంత్రులు తగిన చర్యలు తీసుకోవడానికి వీలుగా అవసరం మేరకు నిధులు అందుబాటులో ఉంచుతున్నాం. నియోజకవర్గం అభివృద్ధి కార్యక్రమం కింద గత ప్రభుత్వం నిధులు కేటాయించడమే కానీ అవసరం మేరకు విడుదల చేయలేదు. ఇక నుంచి ఆ పరిస్థితి లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

## శాంతి భద్రతలు

రాష్ట్రంలో శాంతి భద్రతలను పరిరక్షించడం మా ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం. శాంతిభద్రతలు అదుపులో ఉంటే ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలను నిరాటంకంగా అందించే అవకాశం ఉంటుంది. గత ఐదు సంవత్సరాలుగా రాష్ట్రంలో మాదకద్రవ్యాల వినియోగం ఎక్కువైంది. ఎంతో మంది యువతీయువకులు మాదకద్రవ్యాలకు బానిసలుగా మారుతున్నారు. ఇది ఏ మాత్రం ఉపేక్షించే అంశం కాదు.

అందుకే రాష్ట్రంలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నాం. ఎంతో కాలం పెండింగ్‌లో ఉన్న నూతన హైకోర్టు భవన సముదాయానికి వంద ఎకరాల స్థలాన్ని కేటాయించడమయినది. న్యాయ వ్యవస్థ పటిష్టతకు మేం తీసుకుంటున్న ఈ చర్యతో దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తుందనడంలో సందేహం లేదు.

## ప్రతి తెలంగాణ బిడ్డ గర్వపడేలా...

చివరగా ఒక విషయం మీ ద్వారా వినమ్రంగా ఈ గౌరవ సభకు, రాష్ట్ర ప్రజానికానికి స్పష్టం చేయదలచుకొన్నాం. గొప్ప ఆశలు, ఆశయాలు ప్రతి ఒక్కరికి ఉంటాయి. కాని, వాటిని నెరవేర్చుకునే ధైర్యం, కష్టపడేతత్వం మరియు నైతిక విలువలతో కూడిన నిబద్ధత ఉన్నప్పుడే ఈ ఆశయాలు సాకారం అవుతాయి. ఇవన్ని కూడా మా ప్రభుత్వానికి ఉన్నాయి. ప్రతి తెలంగాణ బిడ్డ గర్వపడేలా మేము ఫిబ్రవరి 4, 2024 న రాష్ట్ర మంత్రి వర్గ భేటీలో ఈ అంశాలు అమోదించాం.

- ప్రముఖ తెలంగాణ కవి అందెశ్రీ వ్రాసిన "జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం" అనే గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించాము.
- మన రాష్ట్ర వాహన రిజిస్ట్రేషన్ కోడ్ టి.ఎస్. నుండి టి.జి.కి మార్చాం.
- రాచరిక ఆనవాళ్లతో ఉన్న రాష్ట్ర అధికారిక చిహ్నాన్ని మారుస్తూ, భారత రాజ్యాంగ స్ఫూర్తితో, ప్రజాస్వామ్యం మరియు తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేటట్టుగా తీర్చిదిద్దడానికి నిర్ణయించాం.
- తెలంగాణ తల్లుల ప్రతిరూపం ఉట్టిపడేటట్టు తెలంగాణ తల్లి విగ్రహం రూపొందించడానికి నిర్ణయించాం.

ఈ నిర్ణయాలు తెలంగాణ బిడ్డలుగా మనందరి అస్థిత్వాన్ని కాపాడేవి, మన గౌరవాన్ని పెంచేవి. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజానీకానికి మా ప్రభుత్వం కృతజ్ఞతలు తెలుపుతూ, వారి ఆశలు నెరవేర్చుతామని, ఇందిరమ్మ రాజ్యం సాకారం చేస్తామని మరొక్కసారి తెలియజేసుకుంటున్నాం.

## ఓట్-ఆన్-అకౌంట్ ప్రవేశ పెట్టడానికి కారణం

మా ప్రభుత్వం ప్రవేశ పెట్టే తొలి బడ్జెట్ ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌గా పెట్టడం మాకు కొంత అయిష్టంగానే ఉంది. కానీ, కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1, 2024 న ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశ పెట్టింది. మొదటి నుంచే మా ప్రభుత్వానికి, నిధులు ఎలా సమకూర్చుకోవాలనే విషయం మీద స్పష్టమైన అవగాహన ఉంది. దానిలో భాగంగానే, కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాలకు విడుదల చేసే నిధులను సాధ్యమైనంత ఎక్కువగా రాష్ట్ర ప్రజల ప్రయోజనాలకు ఉపయోగించుకోవాలనే స్పష్టత ఉంది. అలాంటప్పుడు కేంద్ర ప్రభుత్వం యొక్క పూర్తి స్థాయి బడ్జెట్‌లో, వివిధ రంగాలవారీగా కేటాయింపులు జరిగినప్పుడే, మన రాష్ట్రానికి ఎంతమేరకు ఆ నిధులలో వాటా వస్తుందనేది అంచనా వేయగలుగుతాము. అందువల్లే, కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తర్వాతనే రాష్ట్రంలో కూడా పూర్తి స్థాయి బడ్జెట్ పెట్టాలని నిర్ణయించాం.

## 2024-25 సంవత్సరానికి బడ్జెట్ ప్రతిపాదనలు

### 2022-23 అకౌంట్లు

- **2022-23 ఆర్థిక సంవత్సరం లెక్కల ప్రకారం 2,04,523 కోట్ల రూపాయలు ఖర్చు అయింది. రెవెన్యూ మిగులు 5,944 కోట్ల రూపాయలు. ద్రవ్యలోటు 32,557 కోట్ల రూపాయలు.**

### 2023-24 సవరించిన అంచనాలు

- **సవరించిన అంచనాల ప్రకారం, 2023-24 సంవత్సరానికి చేసిన మొత్తం అంచనా వ్యయం 2,24,625 కోట్ల రూపాయలు. ఇందులో రెవెన్యూ వ్యయం 1,69,141 కోట్ల రూపాయలు కాగా మూలధన వ్యయం 24,178 కోట్ల రూపాయలు. సవరించిన అంచనాల ప్రకారం రెవెన్యూ ఖాతాలో మిగులు 9,031 కోట్ల రూపాయలు, ద్రవ్యలోటు 33,786 కోట్ల రూపాయలు**
- **2024-25 ఓట్-ఆన్ అకౌంట్ బడ్జెట్ అంచనాలు**
- **2024-25 ఆర్థికసంవత్సరానికి ఓట్-ఆన్ అకౌంట్ మొత్తం వ్యయం 2,75,891 కోట్ల రూపాయలు, రెవెన్యూ వ్యయం 2,01,178 కోట్ల రూపాయలు, మూలధన వ్యయం 29,669 కోట్ల రూపాయలుగా ప్రతిపాదిస్తున్నాను.**
- **2024-25 సంవత్సరానికి ఓట్-ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రతిపాదనను సభ ఆమోదం కోసం ప్రవేశ పెడుతున్నాను.**

**జై తెలంగాణ......**
**జై హింద్.....**

# సింగరేణి కార్మికులకు
# కోటి బీమా

**రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దడానికి బాధ్యతాయుతంగా, శక్తినంతా కూడదీసుకుని పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఆర్థిక పరంగా ఎన్ని నిధులు ఖర్చయినా ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. ఆరు గ్యారంటీల అమలు అనేది నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. సింగరేణి కార్మికులకు కోటి రూపాయల ప్రమాద బీమ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సచివాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో సింగరేణి కార్మికులు కీలకపాత్ర పోషించారని సిఎం కొనియాడారు. వారిని గత ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పుడు వారికి కోటి రూపాయల ప్రమాద బీమా కల్పిస్తున్నట్లు సిఎం పేర్కొన్నారు.**

**సంక్షేమ** పథకాలు నిజమైన పేదలకు అందాలనే ఉద్దేశ్యంతోనే తెల్లరేషన్‌కార్డు నిబంధన అమలులోకి తెచ్చామన్నారు. లబ్ధిదారుల ఎంపిక నిరంతరం కొనసాగుతుందని, కొత్త తెల్ల రేషన్‌కార్డులను కూడా జారీ చేస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఎలాంటి నిబంధనలు లేకుండా ఇస్తే కోటీశ్వరులు కూడా ఈ పథకాలకు దరఖాస్తు చేసుకుంటారని అన్నారు. నిజమైన పేదలకు సంక్షేమ ఫలాలు దక్కాలన్నదే తమ ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు.

నిరుద్యోగ సమస్యపై కూడా దృష్టి సారిస్తున్నామని, 60 రోజుల్లో 25వేల ఉద్యోగాలను భర్తీ చేశామని పేర్కొన్నారు. నిరుద్యోగులు వారి కాళ్ళపై వారు నిలబడే విధంగా ప్రతి నియోజకవర్గంలో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. దానిలో యువకులకు శిక్షణ ఇచ్చి పోటీ పరీక్షల్లో పాసయ్యే విధంగా తయారుచేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవిన్యూ, గృహనిర్మాణ, సమాచార, పౌర సంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వర్‌రావు, సీతక్క, కొండా సురేఖ తదితరులు పాల్గొన్నారు.



# ఆడ బిడ్డలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం...

ఆడ బిడ్డలను కోటీశ్వరులు చేయడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈ రోజుల్లో లక్షలకు విలువ లేనందున వారిని కోటీశ్వరులుగా తీర్చిదిద్దుతామన్నారు. వివిధ చిరు పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని వారు పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి అన్నిరకాలుగా అండగా నిలుస్తామని ముఖ్యమంత్రి అభయం ఇచ్చారు. రూ.2945.50 కోట్లతో కొడంగల్, నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాల పరిధిలో లక్ష ఎకరాలకు సాగు నీరు ఇచ్చేందుకు నిర్మించనున్న నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతలతో పాటు కొడంగల్ నియోజకవర్గ పరిధిలో మొత్తంగా రూ.4369.143 కోట్లతో నిర్మించనున్న ప్రభుత్వ వైద్య కళాశాల, పారా మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల, ఫిజియోథెరపీ కళాశాల, ఇంజినీరింగ్ కళాశాల, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాలలు, రహదారులు, వంతెనలు ఇతర అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు.

**తర్వాత** కోస్గిలో స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. అనంతరం ఆయా సంఘాల మహిళలతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, పాఠశాలలు, హాస్టళ్లలో చదివే విద్యార్థులకు యూనిఫాంలు కుట్టే అవకాశాన్ని ఎస్‌హెచ్‌జీలకు ఇస్తామని తెలిపారు. పెద్ద ఎత్తున యూనిఫాంల తయారీకి అవసరమైన అధునాతన కుట్టు మిషన్లు, ఇతర సహాయ సహకారాలు అందజేస్తామని ఆయన వెల్లడించారు. గతంలో కొడంగల్ ప్రాంతంలోని ఎస్‌హెచ్‌జీ మహిళలు కందులు కొనుగోలు చేసి నష్టపోయారని, దాని నుంచి తేరుకునేందుకు ఎంతో కష్టపడ్డారని ముఖ్యమంత్రి అన్నారు. భవిష్యత్తులో పంటల కొనుగోళ్లను సంఘాల ద్వారానే కొనుగోలు చేయిస్తామని, ఈ క్రమంలో ఆయా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందజేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

## విద్యా కేంద్రంగా కొడంగల్...

కొడంగల్ ప్రాంతంలో గతంలో చదువుకోవడానికి బడులు లేవని, చదువుకోవడానికి ఇక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే పరిస్థితి ఉండేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇప్పుడు వైద్య కళాశాల, నర్సింగ్



కళాశాల, ఇంజినీరింగ్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, పశుసంవర్థక కళాశాల, జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేస్తున్నామని, దీంతో రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల విద్యార్థులు ఇక్కడకు రానున్నారన్నారు. కొడంగల్ ప్రాంతం విద్యాకేంద్రంగా మారనుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఎస్‌హెచ్‌జీలతో సమావేశం అనంతరం నారాయణపేట, వికారాబాద్ జిల్లాలోని 3083 మహిళా

సంఘాలకు బ్యాంకు లింకేజీ కింద రూ.177 కోట్ల చెక్కును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందజేశారు.

### రేవంత్ రెడ్డి పోరాటంతోనే ఒంటరి మహిళలకు పింఛను

ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి శాసనసభలో చేసిన పోరాటంతోనే ఒంటరి మహిళలకు పింఛను వచ్చిందని ఆజమ్మ అనే మహిళ అన్నారు.. ఎస్‌హెచ్‌జీలతో సమావేశంలో జోగిని వ్యవస్థ నుంచి బయటపడి దాని నిర్మూలనకు పాటుపడిన ఆజమ్మ మాట్లాడారు. జోగినిగా తాను ఎదుర్కొన్న ఇబ్బందులు, జీవనపోరాటాన్ని వివరించడంతో పాటు స్వయం సహాయక బృందంతో ఎదిగిన తీరును ఆమె వివరించారు. జోగిని వ్యవస్థ విషయాన్ని ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళితే ఆయన శాసనసభలో కొట్లాడారని, క్యాన్సర్‌తో పోరాడుతున్న ఓ జోగిని వ్యథను శాసనసభలో రేవంత్ రెడ్డి వినిపించారని ఆమె గుర్తు చేశారు. ఆ పోరాటంతోనే ఒంటరి మహిళలకు పింఛను వచ్చిందని ఆమె అన్నారు. ఉచిత బస్సు ప్రయాణంతో లబ్ధిపొందుతున్న తీరును వివరించారు.

జోగినిలు ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం ఇవ్వాలని ఆమె కోరగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. పోలేపల్లికి చెందిన పద్మమ్మ గ్రామ సంఘం భవనం నిర్మించాలని కోరగా వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ముఖ్యమంత్రి ఆదేశించారు. పదకొండేళ్ల క్రితం తన బిడ్డ అనారోగ్యంతో ఉన్నప్పుడు నాడు ఎమ్మెల్యేగా ఉన్న రేవంత్ రెడ్డి నిమ్స్ వైద్యులతో మాట్లాడి తన బిడ్డను బతికించారని ఆమె గుర్తు చేసుకున్నారు. మొగిలమ్మ అనే దివ్యాంగురాలు వికలాంగుల సమాఖ్య ద్వారా పొదుపు చేస్తున్న విషయాన్ని వివరించారు. దౌల్తాబాద్ కు చెందిన యశోదమ్మ బడికిరాని పిల్లలను బడిలో చేర్పించి విద్యావంతులను చేసిన తీరును వివరించారు. దౌల్తాబాద్‌కు జూనియర్ కళాశాల మంజూరు చేశామని, ప్రతి ఒక్కరూ చదువుకోవాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు. విద్యతోనే తామంతా పెద్దవాళ్లమయ్యామని చెప్పారు.

హస్నాబాద్‌కు చెందిన వసంత అనే మహిళ హిందీలో ప్రావీణ్యం సాధించి వివిధ రాష్ట్రాల్లో పర్యటించి స్వయంసహాయక సంఘాల నిర్మాణం, పొదుపు ఆవశ్యకతపై వివరించారు. తమ గ్రామంలో ఎస్‌హెచ్‌జీ సమావేశాలకు భవనం నిర్మించాలని కోరగా వెంటనే మంజూరు చేయాలని సీఎస్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు.



# అంబేద్కర్ విగ్రహం సాక్షిగా కారుణ్య నియామకాలు

**అంబేద్కర్ నిలువెత్తు విగ్రహం సాక్షిగా, సింగరేణి సంస్థలో కారుణ్య నియామకాలకు సంబంధించిన నియామక పత్రాలను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. సింగరేణిలోని 441 మందికి హైదరాబాద్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి నియామక పత్రాలను అందజేశారు. వీరిలో 412 మందికి కారుణ్య నియామక పత్రాలు, 29 మందికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. వీరిలో బదిలీ వర్కర్లు, జూనియర్ అసిస్టెంట్లు, మోటారు మెకానిక్‌లు ఉన్నారు.**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ, అంబేద్కర్ విగ్రహం సాక్షిగా నియామక పత్రాలు అందజేస్తున్నామని వ్యాఖ్యానించారు. తెలంగాణ సాధనలో సింగరేణి కార్మికుల పాత్రను ఎవరూ తగ్గించలేరని ఆయన స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన సింగరేణి సంస్థను అన్నిరకాలుగా ఆదుకుంటామని అన్నారు. సింగరేణిలోని 80 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని ఇటీవలే తాను ఆదేశించానని సి.ఎం చెప్పారు. సింగరేణి ప్రాంతంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించే అంశంపై చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామన్నారు. కారుణ్య నియామకాల వయస్సు సడలింపు అంశాన్ని కూడా పరిశీలిస్తామన్నారు.

గత రాష్ట్ర ప్రభుత్వం సింగరేణిని ఖాయిలా పడేలా చేసిందని, కేంద్రం కూడా సింగరేణి సంస్థకు అనేక అడ్డంకులు సృష్టించిందని సి.ఎం అన్నారు. గత ఎన్నికల్లో సింగరేణి ప్రాంతం కాంగ్రెస్‌కు అండగా నిలిచి, ప్రజా ప్రభుత్వం ఏర్పాటుకు సహకరించిందని ముఖ్యమంత్రి అన్నారు. త్వరలో 15 వేల పోలీసు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీచేస్తామని, 60 కొత్త ఖాళీలతో గ్రూప్ -1 నోటిఫికేషన్ కూడా జారీచేస్తామని, రాష్ట్రంలోని 30 లక్షల మంది నిరుద్యోగులు పోటీపరీక్షలకు సిద్ధంకావాలని ముఖ్యమంత్రి సూచించారు. గత పదేళ్ల పాలనలో నిర్లక్ష్యానికి గురై వ్యవస్థపై విశ్వాసం కోల్పోయిన లక్షలాది మంది నిరుద్యోగులలో విశ్వాసం పెంచేందుకు తమ ప్రభుత్వం కార్యక్రమాలు చేపడుతోందన్నారు.




# ఆదిలాబాద్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తాం...

**రాష్ట్రంలో ఆదివాసులు, గిరిజనులు నివసించే ప్రాంతాల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం మొట్టమొదటి రాష్ట్ర పర్యటనలో భాగంగా ఆదిలాబాద్ జిల్లాలో రేవంత్ రెడ్డి పర్యటించారు. ఇంద్రవెల్లిలో గిరిజనులు, ఆదివాసులు, స్వయం సహాయక సంఘాలతో ముఖాముఖీ నిర్వహించి వారి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకొని అభివృద్ధి పథం వైపు నడిపిస్తామని ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ పరిధిలోని ఇంద్రవెల్లిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రకటించారు.**

**ఇది** ప్రజల కోసం ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వమని, ఉట్నూర్ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 38 కోట్ల 20 లక్షల రూపాయలతో రోడ్లు, భవనాలు, అమరవీరుల స్మృతివనం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సమ ప్రాధాన్యతనిస్తూ సంక్షేమం, అభివృద్ధి కొరకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు.

రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన 6 గ్యారంటీలను ఖచ్చితంగా అమలు చేస్తామని, తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తామని, ఒక లక్ష మంది ఆడబిడ్డల సమక్షంలో 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్ పథకాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం క్రింద ఉచిత వైద్య సేవల పరిమితిని 5 లక్షల రూపాయల నుండి 10 లక్షల రూపాయలకు పెంచడం జరిగిందని తెలిపారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టు, సదర్మాట్ ప్రాజెక్టును పూర్తి చేసి, కడెం ప్రాజెక్టుకు మరమ్మతు చేస్తామని, సాగునీటి ప్రాజెక్టులను నిర్మించి సాగునీటి రంగంలో నూతన సంస్కరణలతో అభివృద్ధి చేసి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు.

మారుమూల గ్రామాలకు రహదారులు నిర్మించి జిల్లా కేంద్రాలకు అనుసంధానం చేసి అభివృద్ధికి బాటలు వేస్తామని తెలిపారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించే దిశగా ఉద్యోగాల కల్పన కోసం కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి భరోసా ఇస్తూ, కోట్లాది రూపాయలతో అభివృద్ధికి కృషి చేస్తామని, పేదలు, అట్టడుగు, అణగారిన వర్గాల పక్షాన నిలుస్తామని, రాష్ట్ర ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని తెలిపారు. ఆదివాసీ ప్రజల జీవితాలలో మార్పు తీసుకువస్తామని, ప్రజల కలలను నిజం చేసేందుకు ప్రభుత్వం పని చేస్తుందని, ధరణిలో భూములు కోల్పోయిన అర్హులైన వారికి భూములు తిరిగి వచ్చేలా కృషి చేస్తామని ముఖ్యమంత్రి అన్నారు.

ఆదివాసీ ముద్దు బిడ్డ రాంజీగోండ్ కొమురంభీం జల్-జంగల్-జమీన్ నినాదంతో బ్రిటీష్ వారిని ఎదిరించి పోరాడిన యోధుడని, ఇదే స్ఫూర్తితో ఆదివాసీ ప్రాంతాలలో రహదారులు, త్రాగునీరు, ఆదివాసీ బిడ్డలకు నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రణాళికా బద్ధంగా పని చేయడం జరుగుతుందని తెలిపారు. అమరుల కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలే కాకుండా ఇల్లు నిర్మించుకోడానికి 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించి ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఆదివాసీ, గిరిజన కుటుంబాల ఆత్మగౌరవాన్ని నిలబెడతామని అన్నారు. నాగోబా ఆలయ అభివృద్ధికి 7 కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, 10 కోట్ల రూపాయలతో పాఠశాలల్లో తరగతి గదులు నిర్మిస్తున్నామని, ప్రభుత్వం ఏర్పడిన కొద్ది కాలంలో 7 వేల మంది ఆడబిడ్డలకు స్టాఫ్ నర్స్ ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందని, రాబోయే 15 రోజుల్లోనే మంత్రివర్గ ఆమోదంతో 15 వేల కానిస్టేబుళ్ళ పోస్టుల భర్తీని బాధ్యతగా

నిర్వహిస్తామని అన్నారు. త్యాగాల పునాదుల మీద ఏర్పడిన రాష్ట్రాన్ని శరవేగంగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక– ప్రణాళిక, విద్యుత్ శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా, మహిళ–శిశు సంక్షేమశాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క), రోడ్లు–భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఐ.టి., ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమలు, కామర్స్, శాసనసభ వ్యవహారాల శాఖల మంత్రి దుదిళ్ల శ్రీధర్ బాబు, పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ, వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, శాసన మండలి సభ్యులు బల్మూరి వెంకటేష్, మహేష్ గౌడ్, మంచిర్యాల, చెన్నూర్, బోథ్, ఖానాపూర్, ఆసిఫాబాద్, వేములవాడ నియోజకవర్గాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, గడ్డం వివేకానంద్, అనిల్ జాదవ్, వెడ్మ బొజ్జు, కోవ లక్ష్మి, శ్రీనివాస్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలందరూ ఆత్మగౌరవంతో బతకాలి

మహిళలు ఆత్మగౌరవంతో బతకాలనేదే తమ ప్రభుత్వ ఉద్దేశమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ లోని నాగోబా దర్బార్ హాల్‌లో మహిళా స్వయం సహాయక సంఘాలతో సిఎం ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, గతంలో వైఎస్సార్ సిఎంగా ఉన్నప్పుడు మహిళలకు పావలా వడ్డీకి రుణాలు ఇచ్చారని గుర్తు చేశారు. కిరణ్ కుమార్ రెడ్డి సిఎంగా ఉన్నప్పుడు జీరో వడ్డీకే రుణాలు ఇచ్చారని అన్నారు. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ధర రూ.1200 ఉందని, త్వరలో మహిళలకు రూ.500లకే ఇస్తామని తెలిపారు.

స్కూల్ యూనిఫామ్‌లను కుట్టే అవకాశం స్వయం సహాయక బృందాలకే కల్పిస్తామని హామీ ఇచ్చారు. విద్యుత్ బిల్లులు కూడా ఎక్కువగా వస్తున్నాయన్న సిఎం.. త్వరలో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని ప్రకటించారు. గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 1450 డ్వాక్రా సంఘాలకు సుమారు రూ.60 కోట్లకుపైగా రుణాలను సిఎం బ్యాంక్ లింకేజి కింద పంపిణీ చేశారు.

ఫార్మర్ ప్రొడ్యూస్ కంపెనీకి 25 లక్షలు, కేస్లాపూర్ నాగోబా ఆలయంలో అభివృద్ధి పనులను చేపట్టేందుకు రూ.7 కోట్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అంతకుముందు ముఖ్యమంత్రి నాగోబా ఆలయంలో నాగోబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పేదరిక నిర్మూలన సంస్థ, వివిధ ప్రభుత్వ శాఖల స్టాళ్ళను సందర్శించారు.

## ఆదివాసీ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

ఆదివాసులు, గిరిజనుల ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ఆధునిక ప్రపంచానికి చేరువగా అభివృద్ధి బాటలు వేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 38 కోట్ల 20 లక్షల రూపాయలతో చేపడుతున్న రోడ్లు, భవనాలు, అమరవీరుల స్మృతివనం అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఆదివాసుల ప్రాంతాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసే దిశగా అధికార యంత్రాంగంతో పాటు ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని అన్నారు. ఐ.టి.డి.ఎ. ద్వారా గిరిజన ఆవాసాలకు 27 కోట్ల నిధులతో రహదారులు, వంతెనల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. విద్యాభివృద్ధిలో భాగంగా 5 కోట్ల రూపాయలతో ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం బుగ్గారం గ్రామంలో గిరిజన బాలికల గురుకుల పాఠశాల భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందని, ఇంద్రవెల్లి మండల కేంద్రంలో స్మృతివనం (అమరవీరుల స్థూపం) వద్ద 1 కోటి రూపాయల అంచనా వ్యయంతో అభివృద్ధి పనులు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఖానాపూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాలలో గ్రామీణ త్రాగునీటి సరఫరా ప్రాజెక్టు క్రింద కెరమెరి మండలంలో 60 కోట్ల రూపాయల వ్యయంతో ధనోరా నీటి శుద్ధి కేంద్రం పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందని సిఎం తెలిపారు.



అమరుల కుటుంబాలకు 5 లక్షల రూపాయల ఇంటి స్థలం, ఇండ్ల పంపిణీలో భాగంగా 15 మంది అర్హులైన లబ్ధిదారులకు ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ గ్రామంలో పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సమ ప్రాధాన్యతనిస్తూ సంక్షేమం, అభివృద్ధి కొరకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు.

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టివిక్రమార్క మాట్లాడుతూ, ఎంతో చారిత్రాత్మక ఘనత కలిగిన ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని, 5 లక్షల రూపాయల ఇంటి స్థలం, ఇండ్లను అమరుల కుటుంబాలకు అందించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రభుత్వ ఏర్పాటు తరువాత మొట్టమొదటిసారి ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపాన్ని సందర్శించి మహనీయుల త్యాగాలను స్మరించుకోవడం జరుగుతోందని, ఆనాటి పోరాటయోధుల ఆలోచనలను ఈ ప్రభుత్వం తూ.చ. తప్పకుండా అమలు చేస్తుందని అన్నారు.



# తాగునీటి కొరత రానీయద్దు : సిఎం

**వేసవి కాలంలో తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని, ఇందుకు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వర్షాభావంతో జలాశయాలు డెడ్‌స్టోరేజీకి చేరుకున్న నేపథ్యంలో తాగు నీటి సరఫరాలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సాగు నీరు,పట్టణాభివృద్ధి, పురపాలక, పంచాయతీరాజ్, తాగు నీటి సరఫరా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.**

**తొలుత** రాష్ట్రంలో జలాశయాల్లో నీటి నిల్వలు, తాగు నీటికి అవసరమైన నీటి పరిమాణంపై అధికారులు గణాంకాలు వివరించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ నగరాలు/పట్టణాలు, పల్లెలు,తండాలు, గూడేలు, ఎస్సీ కాలనీలు అనే తేడా లేకుండా ప్రతి నివాస ప్రాంతానికి తాగు నీరు అందేలా సాగునీరు, పట్టణాభివృద్ధి, పురపాలక, పంచాయతీరాజ్, తాగునీటి సరఫరా శాఖల సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి కోసమంటూ నాగార్జున సాగర్ నుంచి ఆంధ్రప్రదేశ్ 9 టీఎంసీలకుపైగా నీరు తీసుకుపోతోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అంత పెద్ద మొత్తంలో తాగునీరు ఎక్కడ వినియోగిస్తున్నారని, సరైన గణాంకాలు తీసుకొని ఇతర అవసరాలకు నీరు తీసుకుపోకుండా చూడాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల నుంచి తాగునీటికి నీరు తీసుకోవాలంటే కృష్ణా నది యాజమాన్య బోర్డుకు (కేఆర్ఎంబీ) లేఖ రాయాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. ఎంత నీరు అవసరమో సమగ్రంగా సమీక్షించి వెంటనే కేఆర్ఎంబీకి లేఖ రాయాలని ముఖ్యమంత్రి సూచించారు. గతంలో ఏప్రిల్ నెలాఖరు, మే నెలలో వచ్చిన వర్షాలతో జూరాలకు నీరు రావడంతో ఇబ్బంది రాలేదని, లేకుంటే నారాయణపూర్ జలాశయం నీరు విడుదల కోరుతూ కర్ణాటకను అభ్యర్థించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. గతంలో ఎప్పుడైనా అలా తీసుకున్నారా అని ముఖ్యమంత్రి ప్రశ్నించగా మూడేళ్ల క్రితం తీసుకున్నామని తెలిపారు. అయితే దానిని చివరి అవకాశంగా తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ముందుగా కేఆర్ఎంబీకి లేఖ రాయాలని సూచించారు.

నూతన పథకాలు వచ్చిన తర్వాత గతంలో ఉన్న అనేక నీటి వనరులను వదిలేశారని, ప్రస్తుతం వాటిని వినియోగంలోకి తెచ్చే అవకాశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఈ సందర్భంగా కాగ్నా నదిని ముఖ్యమంత్రి ఉదహరించారు. కాగ్నా నుంచి తాండూర్, కొడంగల్ నియోజకవర్గాలకు నీరు వినియోగించుకునే అవకాశం ఉందని, మిషన్ భగీరథ వచ్చిన తర్వాత దానిని వదిలేశారని, అటువంటివి రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో ఉంటాయని వాటిని వినియోగించుకోవాలన్నారు. అలాగే అవసరమైన చోట తాగు నీటి బోర్లు, బావులు, మోటార్లకు మరమ్మతులు చేయించాలని, ఇందుకు ఎమ్మెల్యేలకు కేటాయించిన ఏసీడీపీ నిధుల నుంచి రూ.కోటి, అవసరమైతే అంతకన్నా ఎక్కువగా వినియోగించుకోవాలని సూచించారు. తాను ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించినప్పుడు అనేక గ్రామాల్లో తాగునీటి సరఫరా లేదని తెలిసిందని, మిషన్ భగీరథ ద్వారా 99 శాతం ఇళ్లకు నీళ్లు ఇచ్చామని గత ప్రభుత్వం కేంద్రానికి తప్పుడు నివేదికలు ఇచ్చినందునే జల్ జీవన్ మిషన్ కింద రాష్ట్రానికి నిధులు రావడం లేదని ముఖ్యమంత్రి అన్నారు. గొప్పలకు పోయి తప్పుడు నివేదికలు ఇవ్వవద్దని, క్షేత్ర స్థాయిలో పరిశీలించి వాస్తవ నివేదికలు కేంద్రానికి పంపించాలని ఆయన అధికారులను ఆదేశించారు. జులై నెలాఖరు వరకు ఎక్కడ తాగునీటి సమస్య తలెత్తకుండా చూసేందుకు ఆయా జిల్లాల్లో ఉన్న నీటి వనరులు, అవసరమైన తాగునీటి పరిమాణం, సమస్యలు అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్లతో రెండు రోజుల్లో సమీక్ష నిర్వహించాలని

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ముఖ్యమంత్రి ఆదేశించారు.

ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్‌ పరిధిలో సిబ్బందికి వేతనాలు ఇవ్వడం లేదనే వార్తలు వస్తున్నాయని ముఖ్యమంత్రి అన్నారు. గత రెండేళ్లుగా జీతాలు ఇవ్వడం లేదని అధికారులు తెలిపారు. వేతన బకాయిలపై ఆరా తీసిన ముఖ్యమంత్రి క్షేత్ర స్థాయి సిబ్బందికి వేతనాలు అందేలా ఆర్థిక శాఖ నుంచి నిధులు విడుదల చేయాలని ఆదేశించారు. తాము నిధులు విడుదల చేస్తామని వాటిని బడా బాబులకు ఇవ్వకుండా క్షేత్ర స్థాయి సిబ్బందికి అందేలా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్‌ అధికారులకు సూచించారు.

### జీహెచ్‌ఎంసీ పరిధిలోనూ....

గ్రేటర్‌ హైదరాబాద్‌ నగర పాలక సంస్థ పరిధిలోనూ తాగు నీటికి ఎటువంటి సమస్య లేకుండా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి అధికారులను ఆదేశించారు. పెద్దగా ఇబ్బందులు లేవని, ఏదైనా కొరత ఏర్పడితే ఎల్లంపల్లి, నాగార్జున సాగర్‌ నుంచి కొంతమేర తెప్పించుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నగరంలోని నీటి అవసరాలపై సూక్ష్మ స్థాయి (మైక్రోలెవల్‌)లో సమీక్షించి తగిన ప్రణాళిక రూపొందించుకోవాలని సిఎం సూచించారు. నగరంలో కొన్ని ప్రాంతాల్లో ట్యాంకర్ల రాకపోకలకు పోలీసుల నుంచి కొంత ఇబ్బంది ఉందని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వేసవి పూర్తయ్యే వరకు తాగు నీటి ట్యాంకర్ల రాకపోకల విషయంలో పోలీసుల నుంచి ఇబ్బంది లేకుండా చూడాలని పోలీసు ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

# కరెంట్‌ కట్‌ చేస్తే.. సస్పెండ్‌ చేస్తాం!

## విద్యుత్‌ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంపై సిఎం ఆగ్రహం

**రాష్ట్రంలో ఎక్కడైనా అకారణంగా విద్యుత్‌ సరఫరాకు అంతరాయం కలిగితే బాధ్యులైన అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి హెచ్చరించారు. ఇప్పుడున్న అవసరాలకు సరిపడేంత విద్యుత్తును ప్రభుత్వం సరఫరా చేస్తోందని, ప్రభుత్వం తరపున ఎక్కడా విద్యుత్తు కోతలను విధించటం లేదని సిఎం స్పష్టం చేశారు. గతంతో పోలిస్తే రాష్ట్రంలో విద్యుత్తు సరఫరా పెరిగిందని చెప్పారు. ఇటీవల పలు చోట్ల విద్యుత్తు సరఫరా నిలిపేసిన సంఘటనలపై ముఖ్యమంత్రి విద్యుత్తు శాఖ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ మండిపడ్డారు.**

ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు, విద్యుత్తుపై దుష్ప్రచారం చేసేందుకు కొందరు కుట్రలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. అటువంటి అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిఎం హెచ్చరించారు. గతంతో పోల్చితే విద్యుత్‌ సరఫరా పెంచినప్పటికీ, కోతలు పెడుతున్నారంటూ జరుగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాల్సిన బాధ్యత మీదేనని విద్యుత్తు శాఖ అధికారులను ముఖ్యమంత్రి అప్రమత్తం చేశారు. సచివాలయంలో గృహజ్యోతి, రూ.500కే సిలిండర్‌ పథకాలపై సమీక్షకు ముందు ముఖ్యమంత్రి విద్యుత్‌ కోతలపై సాగుతున్న ప్రచారంపై అధికారులను ప్రశ్నించారు. గతేడాదితో పోల్చితే గత రెండు నెలల్లో విద్యుత్‌ సరఫరా ఎక్కువగా చేసినట్లు ట్రాన్స్‌ కో, జెన్‌ కో, సిఎండీ రిజ్వీ సమాధానమిచ్చారు. ఇటీవల రాష్ట్రంలో మూడు సబ్‌ స్టేషన్ల పరిధిలో కొంతసేపు విద్యుత్‌ సరఫరాకు అంతరాయం కలిగిందని తెలిపారు. దానికి కారణాలు ఏమిటని ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి ప్రశ్నించారు. సబ్‌ స్టేషన్లలో లోడ్‌ హెచ్చుతగ్గులను డీఈలు సరి చూసుకుంటూ ఉండాలని, అలా చూసుకోకపోవడంతో సమస్య తలెత్తిందని అధికారులు తెలియజేశారు.

అలా నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఏవైనా మరమ్మతులు, ఇతర అంశాలకు సరఫరా నిలిపివేయాల్సి వస్తే ముందుగానే ఆయా సబ్‌ స్టేషన్ల పరిధిలోని వినియోగదారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో నియమితులైన కొందరు క్షేత్రస్థాయి సిబ్బంది అత్యుత్సాహంతో ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు ఉద్దేశ్యపూర్వకంగా కోతలు పెడుతున్నారనే సమాచారం తమకు ఉందని సిఎం హెచ్చరించారు. ఎక్కడైనా అయిదు నిమిషాలకు మించి విద్యుత్‌ సరఫరా నిలిచిపోతే అందుకు గల కారణాలపై వెంటనే సమీక్షించుకోవాలని చెప్పారు. సాంకేతిక, ప్రకృతిపరమైన కారణాలు మినహా ఉద్దేశపూర్వకంగా ఎవరైనా కోతలకు కారణమైతే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రాష్ట్రంలో డిమాండ్‌కు అనుగుణంగా సరిపడేంత విద్యుత్తును అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టింది. విద్యుత్తు అవసరం ఎక్కువగా ఉండే ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్‌ పీక్‌ సీజన్‌కు సరిపడేంత విద్యుత్తును అందించే కార్యాచరణను ఇప్పటికే సిద్ధం చేసుకుంది. ఫిబ్రవరిలో ఒకటో తేదీ నుంచి 13వ తేదీ వరకు రోజుకు 264.95 మిలియన్‌ యూనిట్ల విద్యుత్తు సరఫరా అయింది. గత ఏడాది అదే వ్యవధిలో 242.44 మిలియన్‌ యూనిట్లు మాత్రమే సరఫరా జరిగింది. నిరుడు జనవరిలో 230.54 మిలియన్‌ యూనిట్లు సరఫరా కాగా, ఈ ఏడాది జనవరిలో అంతకంటే ఎక్కువగా 243.12 మిలియన్‌ యూనిట్లు సరఫరా అయింది.

# ప్రాజెక్టులు అప్పగించేది లేదు

## అసెంబ్లీలో ప్రభుత్వ తీర్మానం - ఏకగ్రీవ ఆమోదం

**కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులను కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ)కు అప్పగించేది లేదని తేల్చిచెబుతూ ఫిబ్రవరి 12న జరిగిన తెలంగాణ శాసనసభలో ఏకగ్రీవ తీర్మానాన్ని సభ ఆమోదించింది. ఈ మేరకు నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టగా దానిపై ఉదయం పది గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు సుదీర్ఘ చర్చ జరిగింది. వివిధ పార్టీల శాసనసభ్యులు ఈ విషయంపై మాట్లాడారు. అనంతరం ఇది పార్టీలకు అతీతంగా రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన అంశమైనందున అన్ని పార్టీలు మద్దతు ఇచ్చి ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించాయి. తీర్మానం ఆమెదించబడిందని స్పీకర్ ప్రకటించారు.**

తీర్మానాన్ని ప్రవేశపెట్టిన సందర్భంగా నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సభలో పవర్‌పాయింట్ ప్రజంటేషన్ చేశారు. నీళ్ళు, నిధులు, నియామకాలు అంటూ కొట్లాడి తెలంగాణను తెచ్చుకుంటే గత ప్రభుత్వ కాలంలో సాగునీటి విషయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కంటే ఎక్కువగా నష్టపోయామని మంత్రి వివరించారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి రాయలసీమకు ఎన్‌టిఆర్ కాలంలో 1983లో 11వేల క్యూసెక్కులు తీసుకుపోతే, వైఎస్ఆర్ హయాంలో 44వేల క్యూసెక్కులు తీసుకుపోయారని, ఇప్పుడు ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు జరిగి, సిఎంగా కేసీఆర్ పరిపాలనలో దాన్ని 92,600 క్యూసెక్కులకు పెంచారని సభకు తెలిపారు.

దీన్నిబట్టి ఎవరి పాలనలో మనకు ఎక్కువ నష్టం జరిగిందో అర్థమవుతుందన్నారు. 2014లో కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటి నుంచి 2023లో ఆయన దిగిపోయే వరకు కూడా తెలంగాణకు 299 టి.ఎం.సీలు, ఆంధ్రాకు 512 టి.ఎం.సీ.లుగానే పంపకాలకు ఒప్పుకున్నారని అన్నారు. అంతర్జాతీయ జలాల పంపకాల ప్రకారం నదీ పరీవాహక ప్రాంతం, కరువు ప్రాంతం, సాగుభూమి లభ్యత, ఆ ప్రాంత జనాభాను బట్టి కేటాయింపులు జరుపుతారన్నారు. ఆ ప్రకారం తెలంగాణకు 68 శాతం నీటి కేటాయింపులు జరిగి, 551 టీఎంసీల నీళ్ళు రావాల్సి ఉంటుందన్నారు. కానీ కనీసం 50 : 50 శాతానికి కూడా ఒప్పుకోకుండా మొత్తం నీటిని ఆంధ్రాకు తరలించారని ఆరోపించారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ కన్నా కూడా తెలంగాణ రాష్ట్రం ఏర్పడి, కేసీఆర్ పాలనలో రాష్ట్రం నీటివాటాలో చాలా నష్టపోయిందని మంత్రి ఉత్తమ్ సభకు తెలిపారు. టెలిమెట్రీ లేకుండా పోతిరెడ్డిపాడు నుంచి నీటిని దోచుకుపోతుంటే కేసీఆర్ మిన్నకుండిపోయాడన్నారు. ఆంధ్రప్రదేశ్ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి వారి అసెంబ్లీలోనే కేసీఆర్ ఒక అడుగు ముందుకేసి మనకు నీటిని ఇస్తున్నాడని పొగిడారన్నారు. ఆ క్లిప్పింగ్‌ను సభలో ప్రదర్శించారు. ఇప్పటికైనా తప్పులు సరిదిద్దుకుని తీర్మానానికి మద్దతు పలకాలని ఆయన బీఆర్ఎస్‌ను కోరారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, మన రాష్ట్ర నీటివాటాను ఆంధ్రప్రదేశ్‌కు అప్పగించిన పాపానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బాధ్యుడని అన్నారు. అత్యంత ప్రధానమైన సాగునీటి విషయంలో సభకు వచ్చి సూచనలు, సలహాలు ఇవ్వాల్సిన కేసీఆర్ ప్రతిపక్ష నాయకుడిగా తన బాధ్యత నెరవేర్చడం లేదన్నారు. అంతర్జాతీయ జల పంపకాల నిబంధనల ప్రకారం మనకు 551 టీఎంసీలు రావాలన్నారు. కృష్ణా ప్రాజెక్టులు కేఆర్ఎంబీకి అప్పగించేది లేదని, 551 టీఎంసీలు తెలంగాణకు కేటాయించాలని ఉన్న తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించాలని ఆయన బీఆర్ఎస్ వారిని కోరారు. దీనిద్వారా తెలంగాణ సమాజమంతా ఏకతాటిపై నిలబడిందని నిరూపించాలన్నారు. సభను తప్పుదోవ పట్టించేలా మాట్లాడవద్దని సిఎం ప్రతిపక్ష బీఆర్ఎస్ వారికి హితవు పలికారు.

ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్ర ప్రయోజనాలతో కూడుకున్న విషయంలో ప్రతిపక్ష నేత కేసీఆర్‌కు పట్టింపులేదని, కానీ రాజకీయంగా వాడుకోవడానికి నల్లగొండ సభకు వెళుతున్నారని దుయ్యబట్టారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, బీఆర్ఎస్ పక్షాన మాజీ మంత్రులు తన్నీరు హరీష్‌రావు, కడియం శ్రీహరి, శాసనసభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, బీజేపీ నుంచి మహేశ్వర్‌రెడ్డి, ఎంఐఎం నుంచి అక్బరుద్దీన్ ఒవైసీ, సీపీఐ నుంచి కూనంనేటి సాంబశివరావులు మాట్లాడారు. అనంతరం సభ తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది.

# విజన్ 2050

**తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి మెగా మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నట్టు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. విజన్-2050 దిశగా తమ ప్రభుత్వం ముందుకు వెల్తుందని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు నగరాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ లు రూపొందించాయని, తాము రాష్ట్రాన్ని అర్బన్, సెమీ అర్బన్, రూరల్ విభాగాలుగా తీసుకొని అభివృద్ధి చేస్తామని చెప్పారు.**

హైదరాబాద్‌లోని నానక్‌రామ్‌గూడాలో 17 కోట్ల రూపాయలతో నిర్మించిన తెలంగాణ స్టేట్ ఫైర్ సర్వీసెస్ ప్రధాన కార్యాలయ భవనాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారమభించారు. అలాగే, సనత్ నగర్ పారిశ్రామిక ప్రాంతంలో కొత్తగా నిర్మించిన ఫైర్ స్టేషన్ ను వర్చువల్ గా ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భాగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ, ప్రమాదం జరిగినప్పుడు అందరికంటే ముందుండేది ఫైర్ డిపార్టుమెంటేనని, ప్రజల రక్షమకోసం వారు ప్రాణాలకు తెగించి పోరాడతారని ప్రశంసించారు. పోలీస్ శాఖ సిబ్బంది మాదిరిగానే, ఇన్సూరెన్స్‌తో సహా అన్ని సౌకర్యాలను ఫైర్ విభాగానికి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

ప్రస్తుతం హైదరాబాద్ నగరం ప్రపంచ నగరాలతో పోటీ పడుతోందని, ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, పాలకులు మారినా, పాత ప్రభుత్వ విధానాలనే అమలుచేస్తూ, గత 30 ఏళ్లుగా నగరాన్ని అభివృద్ధిచేస్తున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. నగర అభివృద్ధిపై తమ ప్రభుత్వానికి స్పష్టమైన విధానం ఉన్నదని, అభివృద్ధి విషయంలో అనుభవజ్ఞులు, నిపుణుల సలహాలు తీసుకొని ముందుకు వెళ్తామని సీఎం చెప్పారు. మెట్రో రద్దు కాలేదని, ప్రజలకు ఉపయోగపడేలా మెట్రో విస్తరణ చేయబోతున్నామని చెప్పారు. నాగోల్ నుంచి ఎల్బీనగర్, ఓవైసీ ఆస్పత్రి, చాంద్రాయణగుట్ట మీదుగా ఎయిర్ పోర్టు వరకూ, మియాపూర్ నుంచి రామచంద్రాపురం వరకూ, రాయదుర్గం నుంచిఅమెరికన్ కాన్సులేట్ వరకూ మెట్రోను విస్తరిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు.

## ఫార్మా విలేజ్‌ల ఏర్పాటు

ఫార్మా సిటీపై కొందరు ప్రచారంచేస్తున్నట్టుగా అపోహలు వద్దని, ఫార్మా సిటీకి ప్రత్యామ్నాయంగా చిన్నచిన్న క్లస్టర్లతో పార్మా విలేజ్ లనుఏర్పాటు చేస్తామన్నారు. ఆయా ఫార్మా విలేజ్ లలో విద్య, వైద్యం, రవాణావంటి అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

## FORM IV (See Rule 8)

Statement about ownership and other particulars of the 'Telangana' Telugu Monthly, Hyderabad as required under rule 8 of the registration of News Paper (Central) Rule, 1956.

| | | |
|---|---|---|
| 1. Place of Publication | : | Hyderabad |
| 2. Periodicity of Publication | : | Monthly |
| 3. Printer's Name | : | **M. HANUMANTHA RAO** IAS<br>on behalf of<br>Commissioner, I&PR<br>(on behalf of State Govt. of T.S.) |
| Whether citizen of India? | : | Yes |
| Address | : | Samachar Bhavan,<br>A.C. Guards,<br>Masab Tank,<br>Hyderabad - 500 028. |
| 4. Publisher's Name | : | **M. HANUMANTHA RAO** IAS<br>on behalf of Commissioner, I&PR<br>(on behalf of State Govt. of T.S.) |
| 5. Editor's Name | : | **K. SUBRAHMANYA SASTRY**<br>on behalf of Commissioner,<br>I&PR<br>(on behalf of State Govt. of T.S.) |
| Whether citizen of India? | : | Yes |
| Address | : | Samachar Bhavan,<br>A.C. Guards,<br>Masab Tank,<br>Hyderabad - 500 028. |
| 6. Name & Address of individuals who own the News paper | : | Commissioner,<br>Information &<br>Public Relations<br>Department, A.C. Guards,<br>Masabtank,<br>Hyderabad - 500 028 |


I, M. Hanumantha Rao, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date : 01-03-2024

Sd/-
**M. Hanumantha Rao** IAS
(Publisher)

# జనగీతానికి నీరాజనం

**ఆయన పాటలు జనబాహుళ్యాన్ని తట్టి లేపే జయకేతనాలు. పాటలు తెలంగాణతల్లి నుదుట సింధూరమై పొడిచిన రంగుల సింగిడీలు. తెలంగాణ సాంస్కృతికోద్యమంలో కీలక పాత్ర వహించిన వారిలో ఆయన ఒకరు. ఆయనే అందెశ్రీ. ఉమ్మడి వరంగల్ జిల్లా మద్దూరు మండలం రేబర్తి గ్రామాన 1961, జులై 18న జన్మించి చిన్న నాటి నుంచే పశువుల కాపరిగా బతుకుతూ సొంతంగా అక్షరాలను నేర్చిన ఒకనాటి బాలుడు, తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో తన పాటలతో జనాన్ని ఉర్రూత లూగించిన కవి, పరిశోధకుడైన అందెశ్రీ తెలుగు సాహిత్య రంగంలోనే చారిత్రాత్మకమైన ఘనతను సాధించాడు.**



**సాహితీవేత్త, కవి, సంగీతకారుడు అందెశ్రీ. అందులో భాగంగా వెలువడిన పాటలను, వచన కవితలను సేకరించి వాటిని సంకలనం చేసి 1307 పేజీలతో మహగ్రంథానికి సంపాదకత్వం వహించి వెలువరించిన సాహితీ వేత్త అందెశ్రీ. కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందిన ఈ కవి ప్రపంచంలోని నదులను చూడడానికి పర్యటనలు చేసి ఒక మహా కావ్యాన్ని రాయడంలో నిమగ్నమై ఉన్నాడు.**

**సామిడి లిపి**

ఈ మహాకవి కలం నుంచి జాలువారిన "జయ, జయహే తెలంగాణ జననీ జయకేతనం" అన్న గీతం కవికి తెలంగాణ సంస్కృతి, చరిత్ర పట్ల ఉన్న అవగాహనకు, అనురక్తికి గీటు రాయిగా నిలుస్తుంది. తెలంగాణ రాష్ట్రగీతంగా ప్రకటించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన సహచర మంత్రివర్గం సమష్టి నిర్ణయం తీసుకోవడం పట్ల లక్షలాది మంది అక్కున చేర్చుకుని గళమెత్తి పాడుకున్న ఈ గీతం రాష్ట్రం ఏర్పడిన పదేండ్ల తర్వాత తెలంగాణ రాష్ట్రగీతంగా ప్రకటితమవడం రాష్ట్ర ఉద్యమానికే కాదు, స్థానిక సాంస్కృతిక రంగానికి కూడ నివాళిగా చెప్పాలి. ఇంతేకాదు ఒక సామాన్యుడు, గాయకునిగా తప్ప ఎటువంటి సాహిత్య ప్రతిపత్తి లేని కవి అందెశ్రీ రాసిన గీతాన్ని రాష్ట్రగీతంగా ప్రకటించి ఈ దేశ ప్రజాస్వామిక వ్యవస్థకు ఇచ్చిన అపారగౌరవంగా భావించాల్సి ఉంటుంది.

ఉద్యమగీతాలు జాతీయ గీతాలుగా మారిన చరిత్ర మనదేశంలో ఉన్నది. బంకించంద్ర రాసిన వందేమాతర గీతం అధికార జాతీయ గీతం కాకపోయినా దానిని ఆ స్థాయిలో గానం చేయడం ఉన్నది. ఈ గీతం భారత దేశ స్వాతంత్ర్య ఉద్యమాన్ని ఉర్రూతలుగించిన చరిత్ర లోక విదితమే. సోనార్ బంగ్లా పేరుతో రవీంద్రనాథ్ టాగూరు రాసిన గీతం బంగ్లాదేశ్ పాకిస్తాన్ నుంచి విభజనకు నిర్మించిన ఉద్యమాన్ని ఉర్రూతలూగించింది. ఇది కూడ బంగ్లా దేశ్ విముక్తిలో విశేషమైన పాత్ర నిర్వహించింది. పాకిస్తాన్ నుంచి బంగ్లావిముక్తి సాధించగానే ఆ దేశం ఆ గీతాన్ని తమదేశ జాతీయ గీతంగా ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం కవిగా అందెశ్రీ ప్రతిభకు, పాండిత్యానికి పట్టం కట్టి తెలంగాణ చరిత్రలో నిలిచిపోయింది.

రాష్ట్ర సాధన ఉద్యమంలో తెలంగాణ ఆత్మగౌరవ ప్రకటనకు గుర్తుగా మారిన "జయ జయహే తెలంగాణ గీతం" ఆషామాషిగా రాసినటు వంటిది కాదు. ఇందుకు అందెశ్రీ పడిన తపన ఎనలేనిది. ఇంతే కాదు ఈ గీతం రాయడం వెనుకాల ఆయన ఏండ్ల తరబడి తన గురువుల సముఖాన సముపార్జించుకున్న అపారజ్ఞానం, అవగాహన, తాత్విక దృష్టి ఉన్నది. ఉద్యమ సందర్భంలోనే పురుడు పోసుకున్న ఈ గీతం దానితోనే పెరిగి ఎట్టకేలకు రాష్ట్ర గీతంగా మారింది. కవిగా అందెశ్రీ ప్రతిభకు, పాండిత్యానికి పట్టం కట్టి తెలంగాణ చరిత్రలో నిలిచిపోయింది. బాల్యంలో ఆయన గురువు జక్కి రెడ్డి మల్లారెడ్డి అక్షరాలను నేర్పించడంతో కన్నీళ్లు, కష్టాల మయమైన అందెశ్రీ జీవితానికి ఓదార్పు లభించి

కొత్తజీవిత గమనానికి పాదులు పడ్డాయి. ఇందూరుకు చెందిన సాధువు, శృంగేరిపీఠం పరంపరకు ప్రతినిధి అయిన శంకర్ మహారాజు అందెశ్రీకి కవితా బిక్ష పెట్టిన మహనీయుడు. తాపీ మేస్త్రీగా బతుకుతున్నప్పుడు కష్టకాలంలో అండగా నిలిచిన వ్యక్తి, సినీ రంగ ప్రముఖుడు యలమంచి శేఖర్. మొదట పల్లవి పుట్టడానికి కారణం ధూంధాం, తెలంగాణ రచయితల వేదికలు, బిరుదు రాజు రామరాజు ప్రేరణ. మరో విషయం కూడ చెప్పుకోవాలి. ఈ గీతం అందెశ్రీ రాయడానికి ఒక నేపథ్యం ఉన్నది. తెలంగాణ ఉద్యమం పేరుతో ఈ గీతం రాసేనాటికి వచ్చిన గీతాలన్నీ ఉద్యమ ప్రభోద గీతాలు. కేవలం గద్దర్ రాసిన "అమ్మా తెలంగాణమా" గీతం, నందిని సిధారెడ్డి రాసిన "నాగేటి చాళ్లలో నాతెలంగాణ, నాతెలంగాణ" అన్న గీతాలను మినహాయిస్తే అత్యధికంగా తెలంగాణ ఉద్యమ ప్రచార భావాలను (ఆంగ్లం చెప్పాలంటే సెన్స్ ఆఫ్ లాస్) ప్రచారంలో పెట్టాయి. అవి తెలంగాణ సంస్కృతి, చరిత్ర వ్యక్తమైనవి కావు. దీనితో అందెశ్రీలో ఒక తపన మొదలైంది.

> **ఇది ఇలా ఉంటే పాటకు కావ్య గౌరవం లేని కాలమది. ఈ పరిస్థితిలో ఉద్యమం గురించి చెబుతూనే చరిత్ర, సంస్కృతి పరిచయం చేస్తూ తెలంగాణ మనిషిలో ఆత్మగౌరవ భావాన్ని తట్టి లేపి ఉద్యమోన్ముఖులను చేయాలన్న ఆలోచన వచ్చింది. దీనితో ఈ పాట అందెశ్రీ మనస్సులో రాజుకోవడం మొదలైంది.**

కానీ ఇది రాసిన తరువాత తదుపరి పెద్దలు బిరుదు రాజు రామరాజుకు చూపిస్తే "ఇందులో శిరస్సు లేదేంది బిడ్డా" అన్నాడు. దీనితో ఆలోచనలో పడ్డ అందెశ్రీ జయహే తెలంగాణ గీతంలో సాహిత్య, సాంస్కృతిక రంగాలలో ప్రముఖులు స్థానిక చరిత్రలో నిలిచిపోయిన వ్యక్తులు, కవులు, సంగీత కారుల పేర్లను చేర్చాలన్న నిర్ణయం తీసుకున్నాడు. తొలుత ఒక మహాకావ్యంగా రాసే కాలాన అందెశ్రీ తెలంగాణలోని చారిత్రక ప్రదేశాలన్నిటిని కాలినడకన సంచారం చేస్తూ వాటి చరిత్రను అధ్యయనం చేయడం కూడ ఆయన ఈ పాట రాయడానికి ఉపకరించింది. ఉద్యమంలో భాగంగా జరిగే సభలు సమావేశాలలో పాడుకోవడానికి వీలుగా కుదించవల్సి రావడంతో ప్రస్తుత రూపానికి చేరుకున్నది. ఈ పాటను పాడింది ప్రఖ్యాత సినీ గాయకుడు వి.రామకృష్ణ కాగా, సంగీతాన్ని కూర్చింది మెదక్ జిల్లాకు చెందిన రామాచారి. కామారెడ్డి పట్టణాన( 2002,30, సెప్టెంబరు) లక్షలాది మందితో జరిగిన భారీ బహిరంగ సభ సందర్భంలో ఈ గీతానికి బీజాలు పడ్డాయి. తరువాత సిద్ధిపేటలో జరిగిన తెలంగాణ రచయితల వేదిక సమావేశంలో ఈ పాట ఒకపల్లవి, రెండు చరణాల రూపం తీసుకున్నది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర గీతంగా ప్రకటితమైన ఈ పాట రాసిన తొలినాళ్లలో ప్రచారంలోకి రావడానికి కారణమైన వారిలో కొరిడే ఉమాపతి, సొదిలో ఉండే మహ్మద్ ఇర్ఫాన్ సీనియర్ జర్నలిస్టు శ్రీనివాస్ ముఖ్యులు.

కవి మాటలలో చెప్పాలంటే "తెలంగాణ వెయ్యి సంవత్సరాల చరిత్రను నాలుగు చరణాలలో చెప్పడమనేది ఈ పాట విశిష్టత. తూర్పు ముఖాన పొద్దు పొడిచినప్పుడు చిన్నగానే ఉంటుంది. పెరిగే కొద్ది విశ్వమంతా విస్తరిస్తుంది నాపాట కూడ అంతే. ఈ పాటలో వ్యక్తమైన ప్రతీకల గురించి చెబుతూ నుడికారం, పలుకుబళ్లు, పదబంధాలు నేను పుట్టిన నేల మీద ఉన్నాయి. స్పందన గురించి అడిగినప్పుడు కారుమేఘాలు కమ్ముకున్న మబ్బుల్ని చీల్చుకుని వచ్చినట్టు నాపాట రాష్ట్రగీతంగా ఎంపికయినప్పుడు ఆనందం, భయం దు:ఖం కలిగాయి. భాధ్యతను పెంచింది. ఈ పాట పుట్టడానికి కారణమైన సందర్భాలకు ఆయన ఆరు దండాలు పెట్టాడు. అవి 1) తెలంగాణ మట్టికి, జాతికి, 2) నాతెలంగాణ ఉద్యమ కాలానికి, 3) ఊరు బడికి, బడిపిల్లలకు, పంతుళ్లు. పంతులమ్మలకు, 4) అమరత్వానికి, కలాలకు, గళాలకు, 5) నన్ను కదిపిన ప్రతి చెయ్యికి దండం అన్నాడు అందెశ్రీ, 6) ఈ గీతానికి పరిపూర్ణతను కలిపిస్తూ రాష్ట్రగీతంగా ప్రకటించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన సహచర మంత్రులకు నా దండాలు అన్నాడు.

ఇకపై తెలంగాణ జనం నిత్యం గానం చేసే గీతంగా చరిత్రలో కొనసాగనున్నది. రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా కళాకారుడైన రేవంత్ రెడ్డి, ఆయన మంత్రివర్గం ఈ పాటను రాష్ట్ర గీతంగా ప్రకటించి అనేక మంది త్యాగాలతో, అమరుల కలలతో ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి నిరాజనాలు పలకడంతో గొప్ప ప్రజాస్వామిక స్ఫూర్తిని ప్రదర్శించారు.

## జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం

**జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం**
**ముక్కోటి గొంతుకలు ఒక్కటైన చేతనం**
**తరతరాల చరితగల తల్లీ నీరాజనం**
**పది జిల్లల నీ పిల్లలు ప్రణమిల్లిన శుభతరుణం**
**జై తెలంగాణ - జై జై తెలంగాణ**

**పోతనది పురిటిగడ్డ, రుద్రమది వీరగడ్డ**
**గండరగండడు కొమురం భీముడే నీ బిడ్డ**
**కాకతీయ కళాప్రభల కాంతిరేఖ రామప్ప**
**గొలుకొండ నవాబుల గొప్ప వెలుగే చార్ మినార్**
**జై తెలంగాణ - జై జై తెలంగాణ**

**జానపద జన జీవన జావళీలు జాలువారే**
**కవి గాయక వైతాళిక కళలా మంజీరాలు**
**జాతిని జాగృత పరిచే గీతాల జన జాతర**
**అనునిత్యం నీ గానం అమ్మ నీవే మా ప్రాణం**
**జై తెలంగాణ - జై జై తెలంగాణ**

**సిరివెలుగులు విరజిమ్మే సింగరేణి బంగారం**
**అణువణువు ఖనిజాలే నీ తనువుకు సింగారం**
**సహజమైన వన సంపద సక్కనైన పూవుల పొద**
**సిరులు పండే సారమున్న మాగాణి కరములీయ**
**జై తెలంగాణ - జై జై తెలంగాణ**

**గోదావరి కృష్ణమ్మలు మన బీళ్ళకు మళ్ళాలి**
**పచ్చని మాగాణాల్లో పసిడి సిరులు పండాలి**
**సుఖశాంతుల తెలంగాణ సుభిక్షంగా ఉండాలే**
**స్వరాష్ట్రమై తెలంగాణ స్వర్ణ యుగం కావాలి**
**జై తెలంగాణ - జై జై తెలంగాణ**

# మహా పవిత్రరాత్రి


మహాకవి ధూర్జటి
'శ్రీ కాళహస్తీశ్వర శతకం'లో శివ నామ ప్రాభవం,
ప్రభావం గురించి అద్భుతమైన పద్యం చెప్పాడు.

"పవి పుష్పంబగు,అగ్ని మంచగు..
శత్రుం డతిమిత్రుడౌ..
విషము దివ్యాహారమౌ... "

అని అంటాడు."శివ శివ" అంటూ శివుడిని తలుచుకుంటే చాలు! అన్నీ నీకు వశమవుతాయని అంటాడు.

- మాశర్మ

**మహాశక్తివంతమైన** వజ్రాయుధం లలిత లావణ్యమైన పుష్పంగా రూపు మార్చుకుంటుంది. అగ్ని పర్వతం కూడా మంచు పర్వతంగా మారిపోతుంది, సముద్రమంతా ఇంకిపోయి, మామూలు నేలగా మారిపోతుంది. పరమశత్రువు కూడా అత్యంత స్నేహితుడవుతాడు, విషము దివ్యమైన ఆహారంగా మారిపోతుంది. ఇలా... ఎన్నో జరుగతాయని, అనూహ్యమైన ఫలితాలు, పరిణామాలు ఎన్నెన్నో సంభవిస్తాయని ఈ పద్యం అందించే తాత్పర్యం. అంతటి వశీకరణ శక్తి శివనామానికి వుంది. అతి శీఘ్రంగా భక్తులను కరుణించి, వరాల వర్షాలు కురిపించే సులక్షణభూషితుడు హరుడు. భోళాశంకరుడు, భక్తవశంకరుడు శివదేవుడు. పాల్కురికి సోమనాథుడు నుంచి శ్రీనాథుడు వరకూ, పోతన నుంచి విశ్వనాథ వరకూ, ధూర్జటి నుంచి కొప్పరపు కవుల వరకూ మహాకవులెందరో శివుడిని ఆరాధించినవారే. పంచాక్షరీ మంత్రోపాసనలో పరవశించినవారే. కవులందరూ శివులే. భవ్యకవితా వేశంతో శివమెత్తినవారే. శివరాత్రి వేళ స్త్రీ, బాల, వృద్ధులందరూ ఉరిమే ఉత్సాహంతో శివమెత్తి నర్తిస్తారు. ఆ ఉత్సాహం ఉత్సవమవుతుంది.





హిందువులకు,ముఖ్యంగా శివారాధకులకు 'మహాశివరాత్రి' గొప్ప పండుగరోజు. శివపార్వతుల కల్యాణ శుభదినంగా, శివతాండవం జరిగే విశేషరాత్రిగా పరమపవిత్రంగా పాటించి వేడుకలు జరుపుకోవడం తరతరాల నుంచి ఆనవాయితీగా వస్తోంది. శివపురాణం ప్రకారం శివుడు లింగాకారుడుగా మారే రోజుగా శివపురాణం చెబుతోంది. ఏ రీతిన చూసినా, ఏ తీరున చెప్పినా, ఏ లీలగా భావించినా  ఇది పుణ్యదినం, భక్తులకు ధన్యదినం. శివరాత్రి నాడు ఉపవాసం ఉండడం, రాత్రంతా జాగారం చేయడం, శివ తపో ధ్యానాలతో తన్మయులవడం సర్వత్రా దర్శనమవుతూ ఉంటాయి.

శివపూజలు, అభిషేకాలు,అర్చనలు, శివలీలా విశేషాల కథా పారాయణలు కోట్లాదిమంది ప్రపంచమంతా జరుపుతారు. బిల్వపత్రాలతో అర్చన చేస్తే శివుడు అత్యంతంగా ఆనందిస్తాడని భక్తులు నమ్ముతారు.

"మా రేడు నీవని ఏరేరి తేనా?
మారేడు దళములు నీ పూజకు "

అన్నాడు వేటూరి. ప్రపంచంలో ఏ దేశంలో వున్నా, శివభక్తులు తెల్లవారుజామునే లేవడం క్రమశిక్షణగా పాటిస్తారు.

విభూతి ధారణ చేసి "ఓం నమఃశివాయ" అంటూ పంచాక్షరీ మంత్రాన్ని జపిస్తే ఎంతో శక్తి చేకూరుతుందని, ఎన్నో విశేషఫలితాలు వస్తాయని భక్తులు విశ్వసిస్తారు. తపస్సు, యోగాభ్యాసం, ధ్యానం గొప్ప ఫలితాలను అందిస్తాయన్నది అనాదిగా పెద్దలు చెబుతున్నది. మంత్రోపాసనలు గొప్ప వైభవాన్ని, రక్షణను కలిగిస్తాయని ఆర్యవాక్కు. పంచాక్షరీ మంత్రంతో పాటు మహా మృత్యుంజయ మంత్రాన్ని జపించడం విశేషంగా భావిస్తారు.

శివుడిని ప్రధానంగా యోగకారకుడుగా అభివర్ణిస్తారు.  మహాశివరాత్రి నాడు జాగరణ చేయడం వల్ల మానసికంగా, శారీరకంగా ఆధ్యాత్మిక శోభ, గొప్ప ఆరోగ్యం లభిస్తాయనే విశ్వాసంతో కోట్లాదిమంది తరతరాల నుంచి మహాశివరాత్రిని పరమనిష్ఠగా జరుపుకుంటున్నారు. రాత్రంతా సంగీత, సాహిత్య, నాటక, కళా ప్రదర్శనలతో మార్మోగిపోతుంది. ఎంతోమంది ద్వాదశ లింగాల దర్శనానికి సమాయిత్తమవుతారు. రుద్రాభిషేకం విశేషంగా జరుపుకోవడం పరిపాటి.

తెలుగునాట ఎన్నో సుప్రసిద్ధ శైవక్షేత్రాలు ఉన్నాయి. పల్నాడు ప్రాంతంలోని కోటప్పకొండ ప్రభ తీరే వేరు. కోటప్పకొండ తిరునాళ్ల చాలా ప్రసిద్ధి. శ్రీశైలం, శ్రీకాళహస్తి, భీమేశ్వరం వంటి క్షేత్రాలలో జరిగే విశేషపూజలు, భక్తుల కోలాహలం చెప్పనలవి కాదు. తెలంగాణలో రుద్రేశ్వరస్వామి వెయ్యి స్థంభాల ఆలయం, కీసరగుట్ట, వేములవాడ మొదలైన ఎన్నో పుణ్యక్షేత్రాలు ఐశ్వర్యప్రదాతలై విలసిల్లుతున్నాయి.

శివుని ఆరాధన సర్వశక్తికరం, సర్వముక్తిప్రదం. శివరాత్రి నాడు జరిగే పూజలను దర్శించుకున్నా పుణ్యప్రదం. నాలుగు యామాలుగా పూజలు నిర్వహిస్తారు. అత్యంత శక్తివంతమైన శివ పంచాక్షరీ మంత్రం ప్రకృతిలో భాగమైన భూమి, నీరు, నిప్పు, గాలి, ఆకాశం అనే పంచభూతాలతో ముడిపెట్టుకొని ఉంటుంది. శివుడిని పంచము ఖునిగా, పంచబ్రహ్మలుగా భావిస్తారు.  చైతన్యం దీని మూల సూత్రం. శివతత్త్వమే పరమోన్నతం. నిస్వార్థం, నిరాడంబరత ఆయన సుగుణధనాలు. మహా శివస్మరణ సంబంధియైన మహాశివరాత్రి అర్చనలు మానసిక ప్రశాంతతకు మూలం, శారీరక శక్తికి కేంద్రం, ముక్తికి సోపానం. కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా, కాశీ నుంచి కాళహస్తి దాకా, నేపాల్ నుంచి పాకిస్తాన్ దాకా కోటి ప్రభలతో, కొంగ్రొత్త శోభలతో కోలాహలంగా సాగే 'మహాశివరాత్రి' ధరిత్రిని పవిత్రంగా నిలిపే పుణ్యరాత్రి, శివగాత్రి. పాకిస్తాన్‌లోని కరాచీలో శ్రీ రత్నేశ్వర్ మహాదేవ్ ఆలయం ఎంతో ప్రసిద్ధం. కొన్ని వేలమంది ఎంతో భక్తిశ్రద్ధలతో ఈ ఆలయాన్ని దర్శించుకుంటారు. మన వలె ఉపవాస దీక్ష ఆచరిస్తారు, సముద్రస్నానం చేస్తారు.

శివరాత్రిని ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్కరకంగా పిలుచుకుంటారు. కశ్మీర్ లో 'హరరాత్రి' అంటారు. ఒరిస్సావారు 'జాగరా' అంటారు. జాగరా అంటే జాగారం చేయడం, అంటే నిద్రపోకుండా మేల్కొని ఉండడం.

పంజాబ్‌లో శోభాయాత్రలు నిర్వహిస్తారు. ఇలా ఏ పేరుతో కొలిచినా,తలచేది శివుడినే.

దివ్యశివరాత్రి మనలో భవ్య భావనలు నింపుగాక.



# 'పాపాలను మూటగట్టుకున్నది వారే'

**కృష్ణా జలాలపై మన రాష్ట్రానికున్న హక్కులను కాల రాసిందే గత పాలకులని, బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో చేసిన చర్యలను సిఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ఎండగట్టారు. కృష్ణా జలాల్లో మొత్తం 811 టిఎంసీలకు గాను తెలంగాణ రాష్ట్రానికి 299 టిఎంసీలు చాలునని సంతకం పెట్టింది అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వమని ముఖ్యమంత్రి దుయ్యబట్టారు. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో భాగంగా, గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై తొలుత అధికార, ప్రతిపక్ష సభ్యుల ప్రసంగాల అనంతరం, సభాధ్యక్షుడైన ముఖ్యమంత్రి సమాధానమిచ్చారు.**

**తమ** ప్రభుత్వం తెలంగాణ హక్కుల కోసం కొట్లాడుతుంటే దానికి ప్రతిపక్షం కాళ్ల కింద కట్టె పెడుతోందని ముఖ్యమంత్రి ధ్వజమెత్తారు. బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే వారి కళ్లముందే చంద్రబాబు ముచ్చుమర్రి కట్టడం, వైఎస్ఆర్ పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంచారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. జగన్,కెసిఆర్ భోజనం చేసిన డైనింగ్ టేబుల్ మీదే జీఓ నెంబర్ 203 తయారైందన్నారు.

అనేక మంది ఉద్యమకారులు, విద్యార్థులు సొంత రాష్ట్రం కావాలని తెలంగాణ కోసం ప్రాణ త్యాగం చేశారని, సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఏ ఒక్కరో తొడ కొట్టి, ఇంట్లో కూర్చొని డబ్బాలు కొట్టుకుంటేనో తెలంగాణ రాష్ట్రం రాలేదని సిఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. అరవై యేళ్ల సుదీర్ఘ పోరాటంతో తాము కన్న కలలను నిజం చేసుకోవాలనే ఆశతో తమ జీవితాలలో వెలుతురు వస్తుందని ప్రజలు ఆకాంక్షించారన్నారు. అయితే గత తొమ్మిదిన్నరేళ్లలో అవేవీ నెరవేరలేదని సిఎం అన్నారు.

తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రతిపక్ష నేత కెసిఆర్ అసెంబ్లీకి వచ్చి సలహాలు, సూచనలు ఇచ్చి ఉంటే బాగుండేదని సిఎం అన్నారు. ప్రతిపక్ష నేతలు ఇప్పటికైనా సరైన పాత్ర పోషిస్తారని ఆశిస్తున్నామని పేర్కొన్నారు. ఈ రాష్ట్రం, రజాకార్లకు, నిజాంలకు ఎదురొడ్డి కొట్లాడి విముక్తి పొందిన రాష్ట్రమని సిఎం గుర్తుచేశారు. ఇంతటి పోరాట చైతన్యమున్న రాష్ట్రంలో ప్రతిపక్ష నేత సభకు రాకపోవడం, సబబు కాదన్నారు. సిఎం స్థానంలో ఓ రైతు బిడ్డ కూర్చోవడం బిఆర్ఎస్ పార్టీ జీర్ణించుకోలేకపోతోందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇక్కడి వారెవరూ ఆషామాషీగా ఇక్కడి (అసెంబ్లీ)కి రాలేదని, ఎవరి మాదిరిగానో మేనేజ్‌మెంట్ కోటాలో ఉద్యమం ముసుగులోనో రాలేదని ఆయన దుయ్యబట్టారు. ఉద్యమ సమయంలో వాహనాలపై, బోర్డులపై అందరం టిజి అని రాసుకున్నాం. కేంద్రం కూడా తమ నోటిఫికేషన్‌లో టిజి అని పేర్కొన్నదని ముఖ్యమంత్రి అన్నారు. డిసెంబర్ 9వ తేదీన కొన్ని కీలక హామీలను మంత్రివర్గంలో ఆమోదించామని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర అక్షరాలను టిజిగా మార్చాలని నిర్ణయించుకున్నామన్నారు.

రాష్ట్ర అధికారిక చిహ్నంలో రాచరిక ఆనవాళ్లు ఉన్నాయి. ప్రజాస్వామ్య పాలనలో రాజరికం ఉండకూడదని భావిస్తున్నామని రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ తల్లి అనగానే ప్రతి ఒక్కరికి మన తల్లి, చెల్లి గుర్తుకు రావాలని, శ్రమజీవికి ప్రతీకగా ఉండాలని ఆయన పేర్కొన్నారు.

కవి అందెశ్రీ తెలంగాణకు గొప్ప గీతాన్ని అందించారని, జయజయహే గీతం తెలంగాణ ఉద్యమంలో అందరికీ స్ఫూర్తినిచ్చిందని సిఎం వెల్లడించారు. ఈ పాటను రాష్ట్ర గీతంగా ఆమోదించే నిర్ణయాన్ని విపక్ష నేత అభినందిస్తారని అనుకున్నానని, కానీ, ఆయన కనీసం సభకు కూడా రాలేదని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

త్వరలోనే గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదల చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. గ్రూప్-1 పరీక్షల వయోపరిమితిని 46 ఏళ్లకు పెంచుతున్నట్లు ఆయన తెలిపారు. నిరంకుశ ప్రభుత్వం వద్దని ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారని ఆయన చెప్పారు. ఏ పాపం చూసినా హరీష్ కనపడుతున్నారని సిఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. పాపాల భైరవుడు హరీష్ అని సిఎం విమర్శించారు. ఆర్థిక శాఖ చూసినా, ఇరిగేషన్ శాఖ చూసినా పాపాలు అన్ని బయట పడుతున్నాయని ఆయన విమర్శించారు. మహిళలకు ఉచిత ప్రయాణం వల్ల ప్రముఖంగా దేవాదాయ శాఖ ఆదాయం పెరుగుతోందన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడక ముందు నవంబర్ నెలలో ఎండోమెంట్ ఆదాయం రూ. 49.27 కోట్లు ఉండేదని, ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత డిసెంబర్ నెలలో రూ. 93.27 కోట్లు, జనవరి నెలలో రూ.69 కోట్ల ఆదాయం వచ్చిందని సిఎం చెప్పారు. ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితికి రాష్ట్రాన్ని దిగజార్చారని గత ప్రభుత్వంపై సిఎం రేవంత్ రెడ్డి విమర్శలు చేశారు. పిల్లి శాపనార్థాలకు ఉట్టి తెగిపడదని సిఎం అన్నారు. ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుతూ తమ ప్రభుత్వం, ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు 1వ తేదీనే జీతాలు ఇచ్చామని సిఎం తెలిపారు. •

Printed and Published by **M. Hanumantha Rao, IAS,** at Ground Floor, Samachar Bhawan, A.C. Guards, Hyderabad-28, on behalf of Spl. Commissioner, I & PR, Telangana State. Printed at M/s. Karshak Art Printers, APHB - 40, Vidyangar, O.U. Road, Hyderabad - 44. Chief Editor: **K.Subrahmanya Sastry**, Ph: 040-23326064.






మేడిగడ్డ పగుళ్లను పరిశీలిస్తున్న సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, అఖిలపక్ష బృందం

RNI No. TelTel/2015/61759
Postal Regd. No. D/RNP/HCD-1217/2024-26

Date of Publishing every month 4th
Posting Date: every month 6th & 7th



తెలంగాణ కుంభమేళా

PRINTED MATTER

From:
**The Commissioner**,
Information & Public Relations Department,
10-2-1, Samachar Bhavan, A.C. Guards,
Masabtank, Hyderabad - 500 028.

To